

www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 25 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు చైత్ర బహుళ పాడ్యమి
14-20 ఏప్రిల్ 2025
వెల : ₹20/-





# వక్ఫ్‌కు పాతర ఉమీద్‌కు ఊపిరి


జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# బాలరాముడికి సూర్యతిలకం

బాలరాముడు కొలువైన అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా విచ్చేసిన భక్తుల నడుమ అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన రెండవ శ్రీరామనవమి ఇది. ఈ సందర్భంగా మిట్టమధ్యాహ్నం 12 గంటలకు రామ మందిరం గర్భాలయంలో బాలరాముడి నుదిటిపై సూర్య తిలకం దిద్దుతున్న అద్భుతాన్ని కనులారా చూసిన భక్తులు ఆనందపరవశు లైనారు. శ్రీరామనామ స్మరణ చేశారు.




అంతరాలు లేని భారతీయ సమాజం కోసం పరితపించి..
భారత రాజ్యాంగ రూపకల్పన చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి భారతరత్న
డా. బి.ఆర్.అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా
ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ,
ఘన నివాళులు అర్పిస్తున్నాను
అర్వింద్ ధర్మపురి
( పార్లమెంట్ సభ్యులు, నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


**భా**రత రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని ఇంతగా విషం చిమ్ముతున్న రాజకీయ నాయకుడిని భారతదేశం చూడడం ఇదే మొదటిసారి. 'నీవు అగ్రకులంలో పుట్టకపోతే, ఈ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరుడివే!' ఇదీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పట్నాలో ఏప్రిల్ 7న పాల్గొన్న ఒక సమావేశంలో చేసిన వ్యాఖ్య. పైగా ఈ మాటలు అనడానికి ముందు ఈ అంశం గురించి ఆయన పడ చదివేశారట. ఆయన మాట్లాడినది 'రాజ్యాంగ పరిరక్షణ సమావేశం'. శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్నది కాబట్టి ఇప్పుడు విషం చిమ్మే పనికి బిహార్‌ను ఎంచుకున్నారు విపక్షనేత. అగ్రకులానికీ, కింది కులాలకీ వైరాన్ని రాజేసే ప్రయత్నం చేస్తున్న ఈ ఘనడు గాంధీ–నెహ్రూ వారసుడు.

మొదట ఆ ఉపన్యాసం సారాంశం ఏమిటో చూడాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వం మీద అవాకులు చెవాకులు పేలుతూ ఆ ఉపన్యాసం ఆరంభమైంది. ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగానే దేశంలో ఓబీసీలు, ఈబీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు ద్వితీయ శ్రేణి పౌరులై పోయారని సర్వోత్తమ సామాజిక శాస్త్రవేత్త అనదగిన రాహుల్ గాంధీ తేల్చి పారేశాడు. తన మాటను మన్నించి తెలంగాణ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌ల కోసం తీసుకున్న నిర్ణయం దేశానికి మార్గదర్శకంగా ఉందని కూడా ఆయన కితాబిచ్చారు. సామాజిక న్యాయం దిశగా దేశంలోనే ఇదొక ముందడుగుగా భావించి తీరక తప్పదని కూడా చెప్పారాయన. అలాగే బిహార్‌లో కూడా చేస్తే ఆలస్యం లేకుండా అందరికీ న్యాయం జరిగిపోతుందని వాక్రుచ్చారు.

ఈ విషయం గురించి ఇంతకు మించి మాట్లాడే స్తోమత కాంగ్రెస్ నేతకి కరవైంది కాబోలు. వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ మీద, భారత స్వాతంత్ర్యోద్యమ సమరంలో అనితర సాధ్యుడు వినాయక్ దామోదర్ సావర్కర్ మీద విమర్శలు లంఘించుకున్నారు. సత్యాన్నే ప్రవచించిన శతాబ్దాల నాటి సిద్ధాంతాల ప్రాతిపదికగానే భారత రాజ్యాంగం నిర్మితమైందని రాహుల్ చెప్పారు. రాజ్యాంగం జవాహర్‌లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ఆలోచనల మేరకే రూపుదిద్దుకుందని, అన్నట్టు వీరు

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు చైత్ర బహుళ పాడ్యమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**వక్ఫ్‌కు పాతర ఉమీద్‌కు ఊపిరి**

ప్రత్యేక వ్యాసం

**జానపద పరిశోధక రేడు-బిరుదురాజు**

18లో



ఆనో భద్రాః

**నదికి 'నమో' నమః**

26లో



# జాగృతి

## సంపాదకీయం

కూడా సత్యాన్నే నమ్మారని రాహుల్ బిహార్ ప్రజలకి గుర్తు చేశారు. చెప్పాలంటే సత్యాన్ని నమ్మిన వారి జాబితా చాలా పెద్దదని, అందులో అంబేడ్కర్, జ్యోతిబా పూలే, సావిత్రీ భాయి పూలే, బుద్ధభగవానుడు, గురు నానక్‌దేవ్, బసవన్న, నారాయణ గురు, కబీర్ వంటివారి పేర్లు కూడా ఇందులో చేర్చవలసిందేనని సెలవిచ్చారు. నీవు రాజ్యాంగాన్ని ఎప్పుడైతే చేతులలోకి తీసుకున్నావో అప్పుడు వేలాది సంవత్సరాల సిద్ధాంతాన్ని రక్షించవలసి ఉంటుందని చెప్పారాయన. హిందుస్తాన్‌లో జనించిన వేల ఏళ్ల నాటి సత్యాన్ని రక్షించేది రాజ్యాంగమని, రాజ్యాంగం మన నేతలకు నేర్పినది కూడా అదేనని చెప్పుకొచ్చారు. రాజ్యాంగం

## ద్వితీయ శ్రేణి బాణి

గౌరవించడంతో పాటు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు బిహార్ ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బిహార్ గొప్పతనం మీకు తెలియడం లేదు అంటూ అన్యాయానికి వ్యతిరేకంగా సుస్థిర చర్యలు తీసుకున్న రాష్ట్రం ఏదైనా ఉంటే అది ఇదేనని అన్నారు. గాంధీజీ చంపారన్ సత్యాగ్రహం చేసిన గడ్డ ఇదేనని చరిత్ర మాస్టారి అవతారం కూడా ఎత్తారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవం వచ్చింది కూడా ఇక్కడేనని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాల మీద, వివక్ష మీద, ఆర్థిక సామాజిక న్యాయాలకు ప్రతికూలంగా జరుగుతున్న పోరాటలాల కోసం ముందుకు వచ్చి రాజ్యాంగాన్ని రక్షించాలని అన్నారు.

ఆయన పార్టీని రక్షించలేరు. రక్షించాలన్న తపన ఉన్నవాళ్లని ఆమడ దూరం తరిమేస్తారు. పార్టీ ఎన్నికలలో పోరాడుతూ ఉంటే ఆయన విదేశాలకు వెళ్లి కూర్చుంటారు. అవి పార్లమెంట్ సమావేశాలయినా ఎవరినో చూసి కన్ను కొడతారు. పార్లమెంట్ సమావేశాలు ఆరంభమైన ప్రతిసారి ఒక సమస్యను లేవనెత్తి వాటిని స్తంభింప చేస్తూ ఉంటారు. అక్కడే సొంతింట్లో చిన్నారి చెల్లెలని బుగ్గ గిల్లినట్టు ప్రియాంక వాద్రాని గిల్లుతారు.ఆ నిండు సభలో కూడా రాజ్యాంగం ప్రతి అంటూ ఒక పుస్తకాన్ని ఎత్తి పట్టుకుని ఎవరో రాసిచ్చిన ముక్కలు కష్టపడి అప్పగిస్తారు. ఆఖరికి ముస్లింలను దేశం నుంచి వెళ్లగొట్టడానికి, ఒకవేళ ఇక్కడ ఉంటే అథ:పాతాళానికి తొక్కేస్తుందని వక్ఫ్ సవరణ చట్టం గురించి ఏళ్ల తరబడి ఉపన్యాసాలు దంచి, ఆ వర్గాన్ని రెచ్చగొట్టి తీరా పార్లమెంటులో దాని పతాక సన్నివేశం వేళ పలాయనం చిత్తగిస్తారు. ఇలాంటి నేతను చూసి ముస్లింలు కూడా ఛీత్కరిస్తుంటే, ఇప్పుడు ద్వితీయశ్రేణి పౌరుల బాణీని అందుకున్నారు రాహుల్. ఎక్స్‌రే విధానం ద్వారా జన గణన చేస్తే అది శాస్త్రీయం అవుతుందని తాను ముందు నుంచీ మొత్తుకుంటూనే ఉన్నానని రోదించారు పాపం. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదట. తన పార్టీలోనే తనకు విలువ లేదు. ఉందో లేదో తెలియని ఇండీ కూటమి సభ్యులకు ఈయనంటే కొంచెం అటు ఇటుగా గడ్డిపోచతో సమానం. కాబట్టి దేశంలో మిగిలిన పార్టీలు ఈయన మాటనీ, అభిప్రాయాలనీ గౌరవించాలని అనుకోవడం ఒట్టి మూర్ఖత్వం. ప్రజలు తన మాటను నమ్మేసి వెంటనే ఎన్‌డీఏ కూటమిని తరిమి కొట్టేస్తారని ఆయన అనుకుంటే అనుకోవచ్చు. అదీ ఒక భ్రమే.

కాంగ్రెస్ వారసత్వాన్నీ, కమ్యూనిస్టు భాషనీ మేళవిస్తూ ఈ మధ్య రాహుల్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, మైనారిటీ, మధ్య తరగతి, మహిళ, బడుగు, బలహీనవర్గ, శ్రామికవర్గ, సెక్యులర్, ఉదారవాద, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన వేదికను ఒక దానిని తయారు చేయాలని ఉబలాట పడుతున్నారు. అందులో భాగమే ఈ ద్వితీయ శ్రేణి నినాదం. ★

14 ఏప్రిల్ 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**తొలిరేయి**

– బి.వి.ఎస్. ప్రసాద్





| | | |
|---|---|---|
| రుత్వా– హిందువులు మరచిన కర్తవ్యం (ముఖపత్ర కథనం) | - | 12 |
| ఆక్వాపై అమెరికా సుంకాల భారం (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| అక్షర మాధురి (మహిళ) | - | 22 |
| మంత్రివర్గ విస్తరణ ఎండమావేనా...! (తెలంగాణ) | - | 24 |
| చైనాతో సంబంధాలు నేర్పుతున్న పాఠాలు (అంతర్జాతీయం) | - | 30 |
| తెలుగు ప్రజలకు తెలియని తెలుగు రాణి.. (గళమెత్తిన గతం) | - | 32 |
| పునర్ ‘విభజన’ రాజకీయాల చిచ్చు (జాతీయం) | - | 34 |
| వెండితెర మీద దేశభక్తి భావన (నివాళి) | - | 37 |
| ఐపీఎల్‌లో బాబాయిలు... అబ్బాయిలు! (క్రీడ) | - | 43 |
| తెలుగు సినిమా త్రైమాసిక ఫలితాలు! (సినిమా) | - | 50 |



పార్లమెంట్ ఉభయ సభలూ రాత్రీ పగలూ తేడా లేకుండా 26 గంటలకు పైగా సుదీర్ఘమైన చర్చోపచర్చలు జరిగిన తర్వాత వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపాయి. లోక్‌సభలో బిల్లుపై ఏప్రిల్ 2 బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏప్రిల్ 3 గురువారం తెల్లవారుజామున 2.15 గంటల వరకు చర్చ, ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. లోక్‌సభ ఆమోదం పొందిన బిల్లు అదే రోజు మధ్యాహ్నం రాజ్యసభకు చేరుకుంది. రాజ్యసభలో 12 గంటలకు పైగా చర్చ అనంతరం ఓటింగ్ ప్రక్రియ జరిగిన తర్వాత ఏప్రిల్ 4 శుక్రవారం తెల్లవారుజామున బిల్లు సభ ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటు వేశారు. భారత్ వృద్ధి పథానికి చరిత్రాత్మక మలుపు చేకూర్చారు. దేశ సమ్మిళిత అభివృద్ధికి మేలుకొలుపు పాడారు. పార్లమెంట్ పనిలోపనిగా 1923నాటి ముసల్మాన్ వక్ఫ్ యాక్టుకు ఉద్వాసన పలికే 2024 నాటి ముసల్మాన్ యాక్టు (రద్దు) బిల్లుకు పచ్చ జెండా చూపింది. ఇంతటి ఘనతను సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ముఖ్య భూమికను పోషించారు. పార్లమెంట్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఒక బిల్లుపై ఇన్నేసి గంటలు చర్చ జరగడం ఇదే తొలిసారి. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలతో వేడెక్కిన పార్లమెంట్ కురుక్షేత్రాన్ని తలపించింది. బిల్లు ఆమోదం పొందకుండా ఆపడం కోసమని విపక్షాలు నేలవిడిచి సాము చేశాయి. బిల్లు పట్ల దేశ ప్రజల్లో ముఖ్యంగా ముస్లిం మైనారీటిల్లో లేనిపోని అపోహలను కల్పించడానికి, వారిని భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించాయి. పసలేని మాటలతో కూడిన తుప్పు పట్టిపోయిన, నిర్వీర్యమైపోయిన అస్త్రాలను సంధించాయి. మొత్తమ్మీద తమదే పైచేయి అని చెప్పడానికి ప్రయత్నించాయి. సరిగ్గా ఇక్కడే అమిత్ షా, కిరెన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కృష్ణార్జునులను తలపించారు. వేలెత్తిచూపడానికి అవకాశమివ్వని సమగ్రమైన సమాచారంతో విపక్షాలకు ఊపిరాడకుండా చేశారు. బిల్లును ప్రవేశపెట్టి, అందులోని విశిష్టతలను ఉభయ సభలతో పాటుగా యావత్ భారతావనికి పూసగుచ్చినట్టుగా విడమరిచి చెప్పే బాధ్యతను కిరెన్ తీసుకుంటే, అమిత్ షా పదునైన వాగ్బాణాలతో విపక్షాల వాచాలత్వాన్ని, మూర్ఖత్వాన్ని తుత్తునియలు చేయడమే కాకుండా పార్లమెంట్ ఆమోదం పొందడంలో బిల్లుకు ఎర్ర తివాచీని పరిచారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కోట్లాది ముస్లింలకు ప్రయోజనం చేకూర్చే బిల్లుకు చట్టబద్ధత తీసుకొచ్చేందుకు మార్గం సుగమం చేయడం ద్వారా అనేక దశాబ్దాలుగా భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉప్పుపాతర వేసింది. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న వక్ఫ్ ఆస్తులపై వ్యాజ్యాలు ఓ కొలిక్కి వచ్చేలా చేసింది.

# వక్ఫ్‌కు పె



## చరిత్రాత్మకమైన మలుపు

వక్ఫ్ (సవరణ) బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదాన్ని పొందడం సామాజిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం తాము సమష్టిగా సాగిస్తున్న శోధనకు ఒక చరిత్రాత్మకమైన మలుపునకు నిదర్శనంగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది మరీ ముఖ్యంగా చాలాకాలంగా అట్టడుగున ఉండిపోయి తమ వాణి వినిపించలేక, అవకాశాలు అందుకోలేకపోయిన వారికి ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. “వక్ఫ్ వ్యవస్థ దశాబ్దాల కాలంగా కొరవడిన పారదర్శకతకు, జవాబుదారీ తనానికి మారుపేరుగా నిలిచింది. ఇది ప్రత్యేకించి ముస్లిం మహిళలు, పేద ముస్లింలు, పస్మంద ముస్లిం ప్రయోజనాలకు చేటు చేసింది. పార్లమెంటు ఆమోదించిన బిల్లులు పారదర్శకతకు పెద్ద పీట వేస్తాయి. ప్రజల హక్కులకు ఒక రక్షాకవచంగా నిలుస్తాయి” అని ప్రధాని అన్నారు.

చట్టబద్ధమైన వక్ఫ్‌బోర్డుల్లో ముస్లిమేతరులు ఎందుకు ఉండకూడదని బిల్లు ముందుకు సాగకుండా అడ్డంగా నిలుచున్న విపక్షాలను మోదీ సర్కారు నిలదీసింది. హిందువులు, ముస్లింలకు మధ్య ఆస్తి వివాదం వచ్చినప్పుడు వక్ఫ్ బోర్డులో ముస్లింలు మాత్రమే ఉంటే వివాదం ఎలా పరిష్కారమవుతుందని వేలెత్తి చూపింది. చట్టబద్ధతను సంతరించుకున్న వక్ఫ్‌బోర్డు మతాలకు అతీతంగా వ్యవహరిస్తూ, అన్ని మతాలకు ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరాన్ని కుండబద్దలు కొట్టి నట్టుగా చెప్పింది. గతంలో వక్ఫ్ ట్రిబ్యూనళ్లు ఇచ్చే తీర్పు లపై ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే కోర్టులు జోక్యం చేసు కునేవి. ట్రిబ్యూనల్ ఇచ్చిన తీర్పుతో న్యాయం దక్కనిపక్షంలో కక్షిదారుకు న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునే హక్కును సవరణబిల్లు తెచ్చిపెట్టింది. సంబంధిత యంత్రాంగాలను బలోపేతం చేసింది. 2014 ఎన్నికలకు ముందు, నరేంద్ర మోదీ సర్కార్ రాకకు ముందు ప్రభుత్వ భూములను వక్ఫ్‌బోర్డుకు కట్టబెట్టడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు పాల్పడిన దురాగతాన్ని నిండు సభలో దుయ్యబట్టింది. దానం పేరిట సాగించిన అపాత్రదానాన్ని తూర్పార పట్టింది. ఇకపై ఇలాంటి దాతృత్వపు ఆటలు సాగనే సాగవని తేల్చి చెప్పింది.




# ాతర.. ఉమీద్‌కు ఊపిరి

## సామాన్య ముస్లింలకు సువర్ణ అవకాశం

2025 నాటి వక్ఫ్ సవరణకు ఆంగ్ల అక్షరాలతో ఉమీద్ అని నామకరణం చేశారు. పూర్తిగా చెప్పాలంటే ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, కార్యకుశలత, అభివృద్ధి యాక్ట్ అని అర్థం. అదే ఉమీద్‌కు హిందీలో ఆశ, ఆధారం, నమ్మకం, విశ్వాసం, కోరిక అనే అర్థాలు వస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు వక్ఫ్ ఆస్తులకు కాపుకాస్తూనే మరోవైపు సామాన్య ముస్లింలకు ప్రయోజనాలు చేకూర్చడమే లక్ష్యంగా ఉమీద్‌ను తీసుకొని వచ్చింది. వక్ఫ్ ఆస్తుల బాగోగులను స్వయంగా చూసుకోవాలి. వాటి ద్వారా వచ్చే ఆదాయం అవసరార్థులకు చేయూత నివ్వాలి. వారి పురోగతికి బాట వేయాలి. వక్ఫ్ ఆస్తులనేవి ఉన్నదే ముస్లిం సమాజం సంక్షేమం కోసమని, సామాన్య ముస్లింలకు విద్య, వైద్య, ఆరోగ్య సదుపాయలను కల్పించి, ధార్మిక అవసరాలను తీర్చడానికి అన్న విషయం

## ముస్లిమేతరుల పాత్ర వక్ఫ్ బోర్డు వరకే



వక్ఫ్ (సవరణ) బిల్లుకు లోబడి ముస్లిమేతరుల పాత్ర వక్ఫ్ బోర్డుకు, వక్ఫ్ మండలికి మాత్రమే పరిమిత మవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వారు మతపరమైన ఎలాంటి కార్యకలాపాలను చేపట్టరని తెలిపారు. వారు వక్ఫ్ ఆస్తులను చట్టప్రకారం నిర్వహించేలా చూస్తారని మంత్రి చెప్పారు. 1913 నుంచి 2013 మధ్యకాలంలో వక్ఫ్ బోర్డు కింద 18 లక్షల ఎకరాలు ఉండేవని, అదే 2013 నుంచి 2025 మధ్య కాలంలో దానికి అదనంగా 21 లక్షల ఎకరాలు చేరాయని తెలిపారు. ఉత్తర రైల్వేలు, పురాతన దేవాలయాలకు చెందిన భూములను వక్ఫ్ ఆస్తులుగా పేర్కొన్న దృష్టాంతాలను అమిత్ షా వివరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం తన ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా 2014 ఎన్నికలకు ముందు న్యూఢిల్లీలోని ల్యూటెన్స్ ప్రాంతంలో 123 ప్రముఖమైన ఆస్తులను వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టిందని ఆయన విమర్శించారు.

## బిల్లు పెట్టకపోతే పార్లమెంట్ కూడా వక్ఫ్ ఆస్తే



వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టని పక్షంలో ప్రజాప్రతినిధులు కూర్చొని ఉన్న పార్లమెంట్ సైతం వక్ఫ్ ఆస్తిగా మారిపోయేదని కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. చరిత్రాత్మకమైన వక్ఫ్ (సవరణ) బిల్లును పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1970 నుంచి ఢిల్లీలో పార్లమెంటు భవనంతో పాటుగా పలు ఆస్తులను ఢిల్లీ వక్ఫ్ బోర్డు తనదిగా చెప్పుకున్న వ్యవహారంపై ఓ కేసు నడుస్తోందని తెలిపారు. అయితే కేసు కోర్టులో ఉండగానే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు అప్పగించిందని చెప్పారు.


అందరికీ తెలిసిందే. అంతే తప్ప పలుకుబడి ఉన్న కొందరు వ్యక్తులకు, కొన్ని కుటుంబాలకు, వారి బంధువులకు ప్రయోజనాలు చేకూర్చడానికి కాదు వక్ఫ్ ఆస్తులు ఉన్నది. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 8, 2024న లోక్‌సభలో 2024 నాటి వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024నాటి ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లును ప్రవేశపెట్టింది. అయితే బిల్లులపై లోక్‌సభలో విపక్ష సభ్యులు గగ్గోలు పెట్టడంతో వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి(జేపీసీ) పంపించింది. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలుగా ఎలాంటి పక్షపాతం లేకుండా సమాజంలో అందరికీ అండగా నిలబడటం, అట్టడుగు స్థాయిలో సమ్మిళిత అభివృద్ధిని సాధించడం ఉన్నాయి.

వక్ఫ్ చట్టానికి తాజాగా ప్రతిపాదించిన సవరణ కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం పలుకుబడి ఉన్న వ్యక్తులకు కాకుండా సాధారణ ముస్లింలకు సేవ చేయడం అని చెప్పింది. ఉమీద్ ప్రకారం కొత్తగా ప్రతిపాదించిన సవరణ 1995 నాటి వక్ఫ్ చట్టంలో పక్షపాతంతో కూడుకున్న అనేక క్లాజులను రద్దు చేస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన అనేక అంశాలను, సమస్యలను, సవాళ్లను సరిదిద్దుతుంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో లోటుపాట్లను చక్కబెడుతుంది. సామాన్యుడి పట్ల సానుకూల దృక్పథంతో సర్వతోముఖ సమ్మిళిత అభివృద్ధికి సైతం ఊతమిస్తుంది. ఇదే సవరణలో పొందుపరిచిన అంశాలు దేశమంతటా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణను మరింత మెరుగుపరుస్తాయి. న్యాయ వివాదాల భారాన్ని తగ్గిస్తాయి. మొత్తమ్మీద ముస్లిం సమాజానికి అండగా నిలబడటం ద్వారా దానిని బలోపేతం చేస్తాయి.

అయితే అనాదిగా వక్ఫ్ ఆస్తుల ఆక్రమణ, తప్పుడు యాజమాన్యపు హక్కుల ధ్రువీకరణ, రాజకీయంగా పలుకుబడి ఉన్న ముస్లింలు వక్ఫ్ ఆస్తులను దుర్వినియోగం చేయడం లాంటి లెక్కకు అందని తార్కాణాలు సామాన్య, పేద ముస్లింలు మరీ ముఖ్యంగా ముస్లిం మహిళలను కలవరపెడుతున్నాయి.

రాజకీయంగా అండదండలు దండిగా ఉన్న ముస్లింలు ఈ ఆస్తులను పేద ముస్లింలకు సాయం చేయడానికి బదులుగా, సగటు ముస్లిం వ్యక్తికి నమ్మక ద్రోహం చేస్తూ తమ స్వప్రయోజనాలకు వాడుకున్న దృష్టాంతాలు కోకొల్లలు. ఇస్లాం చట్టం ప్రకారం వక్ఫ్ అనే పదం పక్కన చేరిన ఆస్తులను దాతృత్వ, ధార్మిక అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. కానీ రాజకీయ నేతల ప్రోద్బలంతో రెచ్చిపోతున్న ల్యాండ్ మాఫియా వాటిని దాతృత్వానికి బదులుగా తన వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంది. వక్ఫ్ బోర్డుల అధీనంలో ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఒక లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువతో మొత్తంగా తొమ్మిది లక్షలకు పైగా ఎకరాల్లో ఎనిమిది లక్షలకు పైగా ఆస్తులు ఉన్నాయి. ఫలితంగా వక్ఫ్ బోర్డుల సమూహం దేశంలో మూడవ అతిపెద్ద భూస్వామిగా అవతరించింది. అయితే అడపాదడపా వక్ఫ్ వ్యవహారాల్లో సంస్కరణలు చోటుచేసుకుంటున్నప్పటికీ అవి ఏమంత సమర్థవంతంగా పనిచేయడం లేదు సరికదా సామాన్య ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం పరిష్కరించలేకపోయాయి. అయితే వక్ఫ్ చట్టానికి చేసిన తాజా సవరణ ప్రధాన లక్ష్యం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, సద్వినియోగానికి గ్యారంటీ ఇవ్వడం. తద్వారా సుదీర్ఘ కాలంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో అవినీతి, వక్ఫ్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఆస్తులు లాంటి దీర్ఘ కాలిక సమస్యలకు పరిష్కారం చూపే దిశగా భరోసా ఇవ్వడం. తాజా సవరణ సమ్మిళిత అభివృద్ధికి ముందడుగు అవుతుంది. పారదర్శకత మెరుగుదలకు పెద్ద పీట వేస్తుంది. అది వక్ఫ్ బోర్డులలో జవాబుదారీతనం, సత్ పరిపాలనతో కూడిన ఒక పటిష్టమైన వ్యవస్థను సృష్టించి సాధారణ ముస్లింలు అందరికీ అవకాశం ఇస్తుంది. ఇప్పటిదాకా ఆస్తులను గుర్తించడంలో సరైన వ్యవస్థ, డిజిటైజేషన్ లేకపోవడం వాటి నిర్వహణ లోపాల్లో ప్రధానమైంది. అన్ని ముస్లిం దేశాల్లోనూ వక్ఫ్ ఆస్తులున్నప్పటికీ వాటి బాగోగులు చూసుకోవడానికి ఎలాంటి యంత్రాంగం లేకపోవ డాన్ని ఇక్కడ ప్రధానంగా గమనించాలి. యావత్ ప్రపంచంలో భారతదేశం మాత్రమే చట్టబద్ధమైన భద్రతతో కూడుకున్న వక్ఫ్ బోర్డులను కలిగి ఉంది. మోదీ సర్కారు తాజాగా తీసుకొచ్చిన ఉమీద్ సాధారణ ముస్లింలకు న్యాయం చేకూరుస్తుంది. వారు వివక్షకు గురికాకుండా చూస్తుంది.

ఉమీద్ అసలు భూస్వామికి చట్టబద్ధమైన టైటిల్ లేని ఆస్తులను వక్ఫ్ ఆస్తులు అంటూ పుట్టుకొచ్చే తప్పుడు కేసులను నామరూపాల్లేకుండా చేస్తుంది. ఆ క్రమంలో ఇకపై కలెక్టర్ అంతకు మించి స్థాయిలో ప్రభుత్వ అధికారి వక్ఫ్ ఆస్తులపై యాజమాన్య హక్కులపై దర్యాప్తు చేస్తారు. ఐదేళ్లుగా ఇస్లాంను అనుసరిస్తున్న వారు తమ ఆస్తిని దానం చేయవచ్చు. వక్ఫ్ ఆస్తులపై ట్రిబ్యూనళ్లు ఇచ్చిన తీర్పులపై పిటిషన్లు సహేతుకమైన పక్షంలో తీర్పులు ఇచ్చిన ఆరు నెలల తర్వాత ఆ పిటిషన్లను కోర్టులు స్వీకరించవచ్చు. ఉమీద్ స్త్రీ, పురుష తారతమ్యం లేకుండా చట్టబద్ధమైన వారసుల హక్కులను కాపుగాస్తుంది. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల నిర్వహణ పూర్తి బాధ్యతను తనదిగా



## వక్ఫ్ బోర్డు నిరంకుశత్వానికి అడ్డుకట్ట


యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహాకుంభమేళా కోసం ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు కుంభమేళాకు చెందిన భూమి తమదిగా వక్ఫ్ బోర్డు ప్రకటించిందని తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వక్ఫ్ (సవరణ) బిల్లుతో వక్ఫ్ బోర్డు నిరంకుశ చర్యలకు అడ్డుకట్ట వేశారని యోగి అన్నారు. బోర్డు ఇకపై సంక్షేమ కార్యకలాపాలపై మాత్రమే దృష్టి పెడుతుందని తెలిపారు. వక్ఫ్ పేరుతో అనేక నగరాల్లో భూములను ఆక్రమించుకున్నారని, చివరకు శ్రీరామచంద్రుడికి ఆప్తమిత్రుడైన నిషధ రాజుకు చెందిన పవిత్రమైన భూమిని కూడా విడిచిపెట్టలేదని యోగి అన్నారు.

# వక్ఫ్ యాక్ట్-1995, వక్ఫ్ (సవరణ) బిల్లు-2024 మధ్య కీలకమైన వ్యత్యాసాలు

**వక్ఫ్ నిర్వహణలో మెరుగైన ఏలుబడి, పారదర్శకత, సంఘటితత్వం లక్ష్యంగా 2024 నాటి వక్ఫ్ (సవరణ) బిల్లు 1995నాటి వక్ఫ్ యాక్ట్‌కు పలు మార్పులను ప్రవేశపెట్టింది. వక్ఫ్ యాక్ట్‌కు, వక్ఫ్ సవరణ బిల్లుకు మధ్య కీలకమైన వ్యత్యాసాలు దిగువ పట్టికలో ఉన్నాయి.**

| కేటగిరి | వక్ఫ్ యాక్ట్-1995 | వక్ఫ్ సవరణ బిల్లు - 2024 |
|---|---|---|
| యాక్ట్ పేరు | వక్ఫ్ యాక్ట్ - 1995 | ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, కార్యకుశలత, అభివృద్ధి యాక్ట్ (ఉమీద్) - 1995 గా పేరు మార్పు. |
| వక్ఫ్ ఏర్పాటు | స్పష్టీకరణ వాంగ్మూలం(డిక్లరేషను), వాడకందారు (యూజర్), లేదా ధర్మాదాయం ద్వారా అనుమతిస్తారు (వక్ఫ్-అలల్-అవులాద్) | వాడకందారు ద్వారా వక్ఫ్ (వక్ఫ్ బై యూజర్) తొలగింపు. డిక్లరేషను లేదా ధర్మాదాయం ద్వారా మాత్రమే అనుమతిస్తారు.దాతలు ఐదు సంవత్సరాలకు పైగా ఇస్లాంను అనుసరిస్తూ ఉండాలి. మహిళ వారసత్వాన్ని తిరస్కరించకూడదు. |
| వక్ఫ్‌గా ప్రభుత్వ ఆస్తి | స్పష్టమైన నిబంధన లేదు. | వక్ఫ్‌గా గుర్తించిన ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్ కాదు. దీనికి సంబంధించిన వివాదాలను కలెక్టర్ పరిష్కరించి ప్రభుత్వానికి నివేదిస్తారు. |
| వక్ఫ్‌ను నిర్ధారించే అధికారం | వక్ఫ్ బోర్డుకు అధికారం ఉంది. | (అధికారానికి సంబంధించిన) నిబంధనలు తొలగింపు. |
| వక్ఫ్ సర్వే | సర్వే కమిషనర్లు, అదనపు కమిషనర్లు నిర్వహిస్తారు. | కలెక్టర్లు రాష్ట్ర రెవెన్యూ చట్టాలకు లోబడి సర్వేలు చేపడతారు. |
| కేంద్రీయ వక్ఫ్ మండలి | ఇద్దరు మహిళలతో పాటుగా సభ్యులందరూ ముస్లింలు అయి ఉండాలి. | ఇద్దరు ముస్లిమేతరులు ఉండవచ్చు. ఎంపీలు, పూర్వ జడ్జీలు, ప్రముఖులు ముస్లింలు అయి ఉండాల్సిన అవసరం లేదు. ముస్లిం సంఘాల ప్రతినిధులు, ఇస్లాం చట్టంలో పండితులు, వక్ఫ్ బోర్డుల ఛైర్‌పర్సన్లు ముస్లింలు అయి ఉండాలి. ముస్లిం సభ్యులలో తప్పనిసరిగా ఇద్దరు మహిళలు ఉండాలి. |
| రాష్ట్ర వక్ఫ్ బోర్డులు | ఇద్దరు ముస్లిం ఎంపీలు లేదా ఎమ్మెల్యేలు లేదా బార్ కౌన్సిల్ సభ్యులు సభ్యులుగా ఉండవచ్చు. కనీసం ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉండాలి. | రాష్ట్ర ప్రభుత్వం సభ్యులను నామినేట్ చేస్తుంది. వారిలో ఇద్దరు ముస్లిమేతరులు, షియా, సున్ని, వెనుకబడిన ముస్లిం తరగతులు, బోహ్రా, అగాఖనీ నుంచి ఒక్కొక్కరు, కనీసం ఇద్దరు ముస్లిం మహిళలు ఉండాలి. |
| ట్రిబ్యూనల్ కూర్పు | జడ్జీ నేతృత్వంలో అదనపు జిల్లా మేజిస్ట్రేటు, ముస్లిం చట్టంలో నిపుణుడు ఉంటారు. | ముస్లిం చట్టంలో నిపుణుడు ఉండరు. ఛైర్మన్‌గా జిల్లా కోర్టు జడ్జి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంయుక్త కార్యదర్శి ఉంటారు. |
| ట్రిబ్యూనల్ ఉత్తర్వులపై అప్పీలు | హైకోర్టు ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే జోక్యం చేసుకుంటుంది. | హైకోర్టుకు 90 రోజులలోగా అప్పీలు చేసుకోవచ్చు. |
| కేంద్ర ప్రభుత్వ అధికారాలు | రాష్ట్ర ప్రభుత్వాలు వక్ఫ్ ఖాతాలను ఎప్పుడైనా తనిఖీ (ఆడిట్) చేయవచ్చు. | కేంద్ర ప్రభుత్వానికి వక్ఫ్ నమోదు, ఖాతాలు, ఖాతాల తనిఖీపై నియమ నిబంధనలను రూపొందించే అధికారం ఉంటుంది. భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ లేదా నిర్దేశిత అధికారి ద్వారా ఖాతాలు తనిఖీ చేయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. |
| తెగలవారీగా వేర్వేరు వక్ఫ్ బోర్డులు | మొత్తం వక్ఫ్‌లో షియా తెగ వాటా 15% లేదా అంతకు మించి ఉన్నపక్షంలో షియా, సున్నీ తెగలకు ప్రత్యేక బోర్డులను అనుమతిస్తుంది. | బోహ్రా, అగాఖనీ వక్ఫ్ బోర్డులను కూడా అనుమతిస్తుంది. **('ఆర్గనైజర్' సౌజన్యంతో)** |

చేసుకుంటుంది. సమాజంలో పెద్దమనుషులుగా చలామణీ అవుతూ వక్ఫ్ ఆస్తులను స్వప్రయోజనాలకు వాడుకునే వారి భరతం పడుతుంది. పాత చట్టంలో పాతుకుపోయిన అవకతవకలు కోకొల్లలు. వాటిలో రద్దు చేయడానికి వీలు లేని విధంగా వక్ఫ్ ఆస్తులకు అవాంఛనీయమైన రక్షణ, అనవసరమైన న్యాయ వివాదాలు, పేలవమైన నిర్వహణ, కోర్టుల పర్యవేక్షణ లేకపోవడం, ముత్తావలీల అధికార దుర్వినియోగం లాంటివి కీలక మైనవి. సాధారణ ముస్లింలు, సాధారణ జన బాహుళ్యం ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా వక్ఫ్ చట్టానికి సవరణ జరిగింది. ఈ సవరణ పాలనా పరమైన జవాబుదారీతనం, పారదర్శకత, ఆస్తులపై న్యాయబద్ధమైన యాజమాన్యం ధ్రువీకరణపై గట్టి పట్టు బిగించడం ద్వారా వక్ఫ్ బోర్డులకు చట్టసమ్మతిని పునరుద్ధరిస్తుంది. వక్ఫ్ బోర్డుల ద్వారా సాధారణ ముస్లింలకు మేలు చేకూర్చి దేశాన్ని సమ్మిళిత అభివృద్ధి దిశగా ముందడుగు వేయిస్తుంది. ★



భారత్‌లో అత్యంత ప్రముఖ స్మారక నిర్మాణాల్లో ఒకటైన తాజ్‌మహల్ చాలా కాలంగా ప్రేమకు, భవన నిర్మాణ శాస్త్రంలో ఒక అద్భుతానికి తార్కాణంగా నిలుస్తూ వస్తోంది. అయితే ఇటీవలి సంవత్సరాల్లో తాజ్‌మహల్ యాజమాన్యంపై తీవ్రమైన చర్చ జరిగింది. అది న్యాయవివాదాలు, రాజకీయ వివాదాలు, మతపరమైన దావాకు దారి తీసింది. ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డు తాజ్‌మహల్‌పై యజమాన్యం తమదే అంటూ నమ్మబలకడంతో వ్యవహారం ముదిరి పాకాన పడింది. ఆ స్మారక కట్టడం భారత ప్రభుత్వం అధీనంలో ఉండిపోవాలా లేకుంటే దానిని వక్ఫ్ ఆస్తిగా గుర్తించాలా అనే న్యాయపోరాటానికి నాంది పలికింది.

# షాజహాన్ తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా రాసిచ్చాడా?!

1998లో ఫిరోజాబాద్‌కు చెందిన ఇర్ఫాన్ బెదర్ అనే వ్యాపారవేత్త తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా ప్రకటించాలంటూ ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డును ఆశ్రయించడంతో స్మారక కట్టడంపై వివాదం పురుడు పోసుకుంది. ఇర్ఫాన్ తాజ్‌మహల్‌కు చారిత్రకమైన, మతపరమైన ప్రాముఖ్యత ఉంది కాబట్టి దాని నిర్వహణ బాధ్యతలను వక్ఫ్ బోర్డు తీసుకోవాలని వాదించాడు. దీంతో వక్ఫ్ బోర్డు తాజ్‌మహల్‌ను నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ భారత పురావస్తు సంబంధిత సర్వే సంస్థ – ఏఎస్ఐకు నోటీసు జారీ చేసింది.

**వివాదం ముదిరి సుప్రీంకోర్టుకు..**

ఇర్ఫాన్ 2004లో ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. తన వాదనకు న్యాయపరమైన మద్దతు కావాలని కోరాడు. తాజ్‌మహల్‌కు సంరక్షకుడిగా తనను గుర్తించాలని హైకోర్టును వేడుకున్నాడు. హైకోర్టు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాలంటూ హైకోర్టు వక్ఫ్ బోర్డుకు సూచించింది. దీంతో 2005లో వక్ఫ్ బోర్డు తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా రిజిస్టర్ చేసింది. అయితే ఏఎస్ఐ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సర్వోన్నత న్యాయస్థానం కేసుపై విచారణ చేపట్టింది. తాజ్‌మహల్ వక్ఫ్ ఆస్తి అని అనడానికి తగిన ఆధారం చూపించాలని, మొగలాయి చక్రవర్తి షాజహాన్ తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తి అని ధ్రువీకరిస్తూ స్వయంగా ఇచ్చిన దస్తావేజును కోర్టు ముందు ఉంచాలని వక్ఫ్ బోర్డును ఆదేశించింది. సుప్రీంకోర్టు 2010లో తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా రిజిస్టర్ చేస్తూ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయంపై స్టే విధించడంతో పాటుగా యాజమాన్య హక్కుపై దర్యాప్తునకు ఆదేశించడంతో కేసు ఒక తిరుగులేని మలుపు తీసుకుంది.

**రాజకీయ రణగొణ ధ్వని**

తాజ్‌మహల్ ఎవరిదనే అంశంపై ఓ వైపు న్యాయ పోరాటం జరుగుతూ ఉండగానే మరోవైపు వ్యవహారానికి మరింత పీటముడి వేస్తున్నట్టుగా రాజకీయ ప్రముఖులు బరిలోకి దిగారు. 2014లో సమాజ్‌వాది పార్టీ నేత, అప్పటి ఉత్తరప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అజామ్‌ఖాన్ తాజ్‌మహల్‌ను అధికారికంగా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన అదే స్మారక కట్టడంలో షాజహాన్, ముంతాజ్ మహల్ సమాధులు ఉన్న కారణంగా అది కచ్చితంగా వక్ఫ్ బోర్డు పరిధిలోకే వస్తుందని వాదించారు. అజామ్‌ఖాన్ వాదన ఒక పెను వివాదానికి ఆజ్యం పోసింది. విమర్శకులు ఆయన వాదనను ప్రశ్నించారు. జాతీయ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్ మతపరమైన సంస్థ అధీనంలో ఉండరాదని వాదించారు. షియా నేతలు సైతం చర్చకు రావడంతో వివాదం మరో మలుపు తీసుకుంది. షియా నేతలు ముంతాజ్‌మహల్ షియా ముస్లిం అని, తాజ్‌మహల్‌కు షియా సంప్రదాయాలతో విలక్షణమైన సంబంధం ఉందని అన్నారు. వారు మరింత విడమరచి చెబుతున్నట్టుగా "ముంతాజ్ ఓ షియా. ఆమె అసలుపేరు అర్జుమన్ బానో. తాజ్‌మహల్ నిర్మాణమే ఆ స్మారక కట్టడానికి షియాతో సంబంధం ఉంది అనేందుకు నిలువెత్తు నిదర్శనం" అని అన్నారు.

**తాజ్‌మహల్ వక్ఫ్ ఆస్తి అంటే ఒప్పుకునేదెవరు?**

ఏప్రిల్, 2018న సుప్రీంకోర్టు వక్ఫ్ బోర్డు వాదిస్తున్న దానికి దస్తావేజు ఆధారం ఏదంటూ ప్రశ్నించడంతో కేసు ఒక కీలకమైన దశకు చేరుకుంది. కోర్టు షాజహాన్ తాజ్‌మహల్‌పై యాజమాన్య హక్కును వక్ఫ్ వ్యవస్థకు బదలాయిస్తూ సంతకం చేసిన అసలు దస్తావేజులను సమర్పించాలని వక్ఫ్ బోర్డును ఆదేశించింది. వాదోపవాదాల సందర్భంగా అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఒక కీలకమైన వ్యాఖ్యానం చేస్తున్నట్టుగా "భారత్‌లో ఎవరైనా తాజ్‌మహల్ వక్ఫ్ బోర్డుకు చెందినది అంటే ఒప్పుకుంటారా? (వక్ఫ్ బోర్డును ఉద్దేశించి) దానిని మీకు ఎప్పుడు ఇచ్చారు? అది 250 సంవత్సరాలకు పైగా ఈస్టిండియా కంపెనీ అధీనంలో ఉంది. ఆ తర్వాత అది కేంద్ర ప్రభుత్వ పరమైంది. దానిని నిర్వహిస్తున్న ఏఎస్ఐకే దాని బాగోగులు చూసుకునే హక్కు ఉంది" అని అన్నారు.

వక్ఫ్ బోర్డు న్యాయవాదుల బృందం తమ



షాజహాన్

వాదనలను గట్టిగానే వినిపించినప్పటికీ సుప్రీంకోర్టు నిస్సంశయమైన రుజువు లేకుండా తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా వర్గీకరించలేమని స్పష్టం చేసింది. అయితే వక్ఫ్ బోర్డు తరఫు సీనియర్ అడ్వకేటు వీవీ గిరి తాజ్ మహల్‌లో ఇద్దరు ముస్లిం ప్రముఖుల సమాధులు ఉన్నాయి కాబట్టి ఆ కట్టడాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించవచ్చని వాదించారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు తాను చేసిన స్పష్టీకరణకే కట్టుబడింది. మతపరమైన ప్రాముఖ్యత న్యాయబద్ధమైన యాజమానత్వాన్ని కట్టబెట్టలేదని తేల్చి చెప్పింది.

**తోక ముడిచిన వక్ఫ్ బోర్డు**

2018 సంవత్సరంలో అర్ధభాగం గడిచిపోయే సరికి వక్ఫ్ బోర్డు దస్తావేజులు లేకుండా కోర్టులో చేస్తున్న వాదనకు నిలువ నీడ ఉండదని తేలిపోయింది. బోర్డు తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తి అని పేర్కొంటూ అధికారికంగా రిజిస్టర్ చేయడానికి వీలుకాదనే సత్యాన్ని అంగీకరించింది. అదే సమయంలో బోర్డు తరఫు న్యాయవాదులు వాదిస్తూ తాజ్‌మహల్‌కు యజమాని ఎవరనేది తేలలేదు కాబట్టి ఆ స్మారక కట్టడం 'అల్లాకు చెందుతుంది' కనుక వ్యావహారిక కార్యాల కోసమని దానిని వక్ఫ్ బోర్డు నిర్వహించడం సబబుగా ఉంటుందని అన్నారు. వారు తమ వాదనను కొనసాగిస్తున్నట్టుగా "తాజ్‌మహల్‌ను వక్ఫ్ ఆస్తిగా చూపడానికి మా దగ్గర ఎలాంటి పత్రాలు లేవు. కానీ మతాచారం ప్రకారం చూసుకుంటే అది వక్ఫ్ ఆస్తి అవుతుంది. సన్నీ వక్ఫ్‌బోర్డు తాజ్‌మహల్‌ను నిర్వహించడానికి అర్హమైంది" అని తెలిపారు. దీన్నిబట్టి వక్ఫ్‌బోర్డుకు తాజ్ మహల్‌పై యావత్ యాజమాన్యపు హక్కును పొందడానికన్నా కూడా దానిపై నిర్వహణపరమైన నియంత్రణ పొందడం పట్ల మరింత ఆసక్తి ఉన్నట్టు కనిపిస్తోంది.

ఏఎస్ఐ ఈ రకమైన వాదనలు జరుగుతున్నప్పటికీ తాజ్‌మహల్‌పై వక్ఫ్ బోర్డు పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకించింది. అలా చేసిన పక్షంలో అది ఒక దృష్టాంతంగా నిలిచి ఎర్రకోట, ఫతేపూర్ సిక్రి లాంటి జాతీయ స్మారక కట్టడాలు మావంటే మావి అంటూ వాటిపై పెత్తనం కోసం అనేక మంది ముందుకు రావడానికి దారి తీస్తుందని హెచ్చరించింది.

సుప్రీంకోర్టు ఎట్టకేలకు సరైన ఆధారాలు లేని కారణంగా తాజ్‌మహల్‌ను తమకు అప్పగించాలంటూ వక్ఫ్ బోర్డు చేసుకున్న పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు తాజ్‌మహల్ లాంటి వారసత్వ నిర్మాణాలు యావత్ జాతికి చెందుతాయని, ఏ ఒక్క మతానికి ఆస్తులు కావని స్పష్టం చేసింది. ఇటీవల కేంద్రంలో మోదీ సర్కారు వక్ఫ్ యాక్ట్‌కు చేసిన సవరణ, దానికి పార్లమెంట్ ఆమోదం లభించడంతో ఇకపై వక్ఫ్‌బోర్డులు తాజ్‌మహల్ కేసులో లాగా వ్యవహరించవని ఆశిద్దాం.

– జాగృతి డెస్క్

# ఆక్రమణల చెరలో వక్ఫ్ ఆస్తులు

ముస్లింల ఏలుబడిలోని వక్ఫ్ బోర్డుల చేతకానితనం కారణంగా దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తులు ఆక్రమణదారుల గుప్పిట్లో చిక్కుకున్నాయి. భారత వక్ఫ్ ఆస్తుల నిర్వహణ వ్యవస్థ (డబ్ల్యుఏఎంఎస్ఐ–వంశీ) పోర్టల్‌లో ఆక్రమణలకు సంబంధించిన 58,890 దృష్టాంతాలు నమోదు అయ్యాయి.

**అందులో కొన్ని దృష్టాంతాలను దిగువన చూడవచ్చు.**


- భోపాల్‌లో ఒక వక్ఫ్ కాంప్లెక్స్‌ను ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించారు. ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవడంతో మొత్తం రిజిస్టరైన 125 శ్మశానవాటికల్లో 101 శ్మశానవాటికలు అదృశ్యమైపోయాయి. దీనికి తోడు సరాయి సికిందరిలో 24,450 చదరపు అడుగుల మేర ఉన్న వక్ఫ్ ఆస్తిలో 1,800 చదరపు అడుగుల భూమిని స్థానిక రాజకీయ నాయకుడు ఆక్రమించుకున్నాడు.
- హైదరాబాద్‌లో ఒక్క 2021లోనే ఆక్రమణదారులకు 765 నోటీసులు జారీ అయ్యాయి. రూ.5 లక్షల కోట్ల విలువైన ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక వక్ఫ్ బోర్డుల్లో ఒకటిగా వాసికెక్కిన తెలంగాణ వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తుల్లో 75 శాతం ఆక్రమదారుల చెరలో ఉన్నాయి. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఒకానొక సందర్భంలో ఇదే విషయమై మాట్లాడుతూ హైదరాబాద్‌లోని వక్ఫ్ భూముల్లో 82 శాతాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని తెలిపారు.




- ముంబైలో 60 శాతానికిపైగా వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయి. పరేల్‌లో లాల్ షా బాబా దర్గా అయితే వాస్తవానికి 72 ఎకరాలకు విస్తరించి ఉండాలి. కానీ ప్రస్తుతం దర్గా చుట్టూ ఆకాశాన్ని తాకుతున్న రెసిడెన్షియల్ టవర్లు కమ్ముకున్నాయి.
- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చెబుతున్న దాన్ని బట్టి లక్నోలో వక్ఫ్ బోర్డు ఆస్తుల్లో 78 శాతం ప్రభుత్వ ఆస్తులు. వాటికి చట్టబద్ధమైన వక్ఫ్ హక్కులు లేవు. అదే రాష్ట్రంలో 1989 నాటి ప్రభుత్వ ఉత్తర్వు సాగులో లేని భూమి అక్రమంగా వక్ఫ్ ఆస్తిగా రిజిస్టర్ కావడాన్ని రద్దు చేసింది.
- బిహార్ సున్నీ వక్ఫ్ బోర్డు హిందువులు అత్యధికంగా నివసించే ఫతూహా బ్లాకులోని గోవింద్‌పూర్ గ్రామంలో భూమిపై యాజమాన్యహక్కు తనదిగా పేర్కొంటూ నోటీసు జారీ చేసింది. దీంతో ఏడు హిందూ కుటుంబాలు వీధినపడ్డాయి.
- సెప్టెంబరు, 2024న కేరళలోని ఎర్నాకుళంలో మరీ ముఖ్యంగా చెరాయి, మునాంబమ్ ప్రాంతాలకు చెందిన 600 క్రైస్తవ కుటుంబాలు తమ భూమిని వక్ఫ్ బోర్డు తన భూమిగా ప్రకటించడాన్ని వ్యతిరేకించాయి. క్రైస్తవ కుటుంబాలు ఆ భూమి తరతరాలుగా తమ అధీనంలో ఉందని వాదించాయి.

ప్రభుత్వ డేటా ప్రకారం దేశంలో 23 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకొని మొత్తం 32 వక్ఫ్ బోర్డులు ఉన్నాయి. వాటిలోనే బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు షియా, సున్నీ తెగలకు వేర్వేరు వక్ఫ్ బోర్డులను కలిగి ఉన్నాయి.

వంశీ పోర్టల్ ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 37.39 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 8.72 లక్షల వక్ఫ్ ఆస్తులు రిజిస్టరై ఉన్నాయి. వక్ఫ్ ట్రిబ్యూనళ్లు, వక్ఫ్ బోర్డుల ఎదుట ఆక్రమణలు, అవ్యవస్థకు సంబంధించి 31,999 లిటిగేషన్ కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలో దాదాపు 9,000 కేసుల్లో ముస్లిం కక్షిదారులు ఉన్నారు. ఇది వక్ఫ్ ఆస్తుల అపసవ్య నిర్వహణ బాధితుల్లో ముస్లింలు కూడా ఉన్నారనే విషయాన్ని ఎత్తి చూపుతోంది. ఆక్రమణలకు సంబంధించిన 16,140 కేసుల్లో దాదాపు 3,165 కేసులు ముస్లింలు ఆక్రమించినవాటికి సంబంధించినవే కావడం గమనార్హం. ★



# రుత్వా – హిందువులు

**రుత్వా (ధర్మబద్ధమైన విరాళ వ్యవస్థ, ధార్మిక సమతుల్యతతో చేసే దానం) హిందూ సంస్కారంలో ప్రధాన గుణం. భక్తికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో, అంత కంటే ఎక్కువ ప్రాధాన్యం దానగుణానికి ఇస్తారు. ఈ విషయాన్ని ఎన్నో శ్లోకాలు చాటి చెబుతున్నాయి. మహాభారతం (అనుశాసన పర్వం 58.23) 'నాస్తి సత్యసమో ధర్మో నాస్తి దానసమం తపః' అంటుంది. అంటే దానం సత్యంతో సమానమైన ధర్మం. శ్రీమద్ భాగవతం (10.10.13) 'స్వధర్మేణ దమేన యజ్ఞః దానం, స్వధర్మం, యజ్ఞం' అంటుంది. కాబట్టి రుత్వాను ఒక శ్రేష్ఠకర్మగా మనం భావించాలి. అందుకే 'రుత్వా దత్తం సదా పుణ్యం, ధర్మసంరక్షణాయ చ' అన్నారు. అంటే, రుత్వా పేరిట ఇచ్చిన దానం ఎల్లప్పుడూ పుణ్యాన్ని ప్రసాదిస్తుంది.**

దైవం, ధర్మం, ధనం, దానం, ధర్మరక్షణ, హిందూ జీవనతత్త్వం– వాటి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఒకసారి పరిశీలించాలి. దైవం అనేది మనకు జీవన మార్గం చూపించే ఆధ్యాత్మికశక్తి. ధర్మం ఆ శక్తిని నిలిపే పునాది. ధనం అనేది జీవనాధారం. కానీ దానిని ధర్మబద్ధంగా వినియోగించినప్పుడే నిజమైన విలువను సంతరించుకుంటుంది. ఈ సంపద స్వార్థానికి కాదు, సమాజానికి ఉపయోగపడాలి.

పూజలు, దేవాలయ సంరక్షణ, వేదవిద్య, అనాథల సేవ, గో సంరక్షణ, అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలకు వెళ్లినప్పుడే ఆ ధనం పరమార్థాన్ని సాధిస్తుంది. ధనాన్ని నిస్వార్థంగా ధర్మానికి అంకితం చేసినప్పుడే అది 'దానం' అనిపించు కుంటుంది. దానం చేసే చేతులు నిరంతరం దివ్య ఆశీర్వాదాలతో నిండి ఉంటాయి.

దైవాన్ని ప్రేమించాలి, ధర్మాన్ని పాటించాలి, ధనాన్ని సంపాదించాలి. కానీ దానాన్ని ధర్మం కోసం, ధర్మ రక్షణ కోసం ఉపయోగించాలి. ఇక ధనం మూలం ఇదం జగత్తు అని ఎలా వేదాలు ఘోషి స్తాయో, అలానే 'ధనం మూలం ధర్మ రక్షణం। ధర్మం మూలం లోక హితం' అంటే ధనం ధర్మానికి, ధర్మం సమాజానికి, సమాజం శ్రేయస్సు కోసమే! ఇది అక్షర సత్యం.

ధర్మ రక్షణకు, ధర్మ ప్రచారానికి, సమాజానికి ఉపయోగపడే ఆధ్యాత్మిక సేవలను కొనసాగించేందుకు ధనం అనివార్యం. ఆలయ సంరక్షణ, అర్చకుల జీవనోపాధి, వేద పాఠశాలలు, ధార్మిక గ్రంథాల ప్రచురణ, అన్నదానం, గోసంరక్షణ వంటి కార్యాలకు నిరంతరం నిధుల అవసరం. హిందూధర్మాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించాలి. రుత్వా (ధర్మదక్షిణ) ద్వారా వచ్చే ఆర్థిక సహాయం లేకుండా ఇవన్నీ స్థిరంగా కొనసాగడం కష్టం. ఈ విషయాన్నీ హిందూధర్మం, హిందూ సమాజం మరిచి పోయిందనడంలో సందేహం లేదు. రుత్వా గురించి ఇంకొన్ని కీలక అంశాలను తెలుసుకునే ముందు వివిధ మతాలలో రుత్వ, వారు అనుసరించే విధానాలను విశ్లేషిద్దాం.

**జకాత్ : ఇస్లామిక్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక**

జకాత్ ఇస్లాంలో ముఖ్య ధార్మిక నిధి. అందులో ప్రతి ముస్లిం తన సంపదలో 2.5% భాగాన్ని (ధనం, బంగారం, పెట్టుబడులు) ఏటా దానం చేయాల్సిందే. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింల జనాభా సుమారు 200 కోట్లకు (2 బిలియన్లకు పైగా ఉన్నందున, ఈ ఆర్థిక వ్యవస్థ ప్రతి సంవత్సరం $1 ట్రిలియన్ డాలర్లు (రూ. 83 లక్షల కోట్ల రూపాయలు) ఉత్పత్తి చేస్తుంది. ఇది భారతదేశ జీడీపీ (రూ. 273 లక్షల కోట్లు)లో దాదాపు 1/3 భాగం. అంటే భారతదేశం మొత్తం ఉత్పత్తి చేసే సంపదలో మూడోవంతు జకాత్ ద్వారా ముస్లిం ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నది. దీనిని మదర్సాలు, మసీదులు, ఇస్లామిక్ మిషనరీ ప్రాజెక్టులు, ఉచిత ఆసుపత్రులు, రుణ రహిత బ్యాంకింగ్ వ్యవస్థలు, ముస్లిం సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తారు. సౌదీ అరేబియా, కతార్, టర్కీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు జకాత్‌ను ఇస్లామిక్ ప్రభావాన్ని విస్తరించేందుకు, ఇతర దేశాలలో ముస్లిం సమాజాలను బలోపేతం చేయడానికి, రాజకీయ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి వినియోగిస్తాయి. జకాత్ కేవలం దానం కాదు. ఇది ఒక బలమైన వ్యూహాత్మక ఆర్థిక వ్యవస్థ. ముస్లిం సమాజాన్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేసి, ఇస్లాం విస్తరించేందుకు వనరుగా ఉపయోగపడుతున్నది.

**క్రైస్తవ ధార్మిక ఆర్థిక వ్యవస్థ: తైత్**

ప్రపంచవ్యాప్తంగా 2.4 బిలియన్ (240 కోట్ల) జనాభా ఉన్న క్రైస్తవమతం తైత్ (Tithe) పేరుతో 10% సంపాదనను విరాళవ్యవస్థకు అందించే పద్ధతి అమలు చేస్తున్నది. తద్వారా అత్యంత స్థిరమైన ధార్మిక, ఆర్థిక వ్యవస్థను ఏర్పరచుకుంది. ఈ విధానంలో ప్రతి క్రైస్తవుడు ఆదాయంలో 10% చర్చ్‌లకు లేదా మిషనరీ పనులకు విరాళంగా ఇవ్వడం తప్పనిసరి. సాధారణ పరిభాషలో దశమ భాగం అని వ్యవహరిస్తూ ఉంటారు. ఇలా క్రైస్తవమతం 700 బిలియన్ల డాలర్లు (రూ. 358 లక్షల కోట్లు) ఉత్పత్తి చేస్తోంది. ఇది భారతదేశ జీడీపీలో (రూ. 72,73,00,000 కోట్లు)లో దాదాపు 20శాతానికి సమానం. ఈ ధన సంపత్తిని చర్చ్‌ల నిర్వహణ, మిషనరీ కార్యకలాపాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, రాజకీయ లాబీయింగ్, మతప్రచారానికి వినియోగి స్తారు. ప్రత్యేకంగా, ఆఫ్రికా, ఆసియా (భారతదేశం సహా), లాటిన్ అమెరికాలో మత మార్పిడి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించి, క్రైస్తవమతాన్ని విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారు. కేవలం మతానికి పరిమితం కాకుండా, ఈ ఆర్థిక వ్యవస్థ రాజకీయాల్లో, శిక్షణ సంస్థల్లో, అంతర్జాతీయ మానవతా సహాయ

# మరచిన కర్తవ్యం

కార్యక్రమాల్లో ప్రభావం చూపిస్తూ, క్రైస్తవ మతాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాపింపజేస్తోంది.

ఖైదకా (Tzedakah) యూదుల ఆర్థిక స్థిరత్వం, జీవన సమృద్ధికి మూలాధారం. యూదులు ప్రపంచవ్యాప్తంగా 1.5 కోట్ల (15 మిలియన్ల) మాత్రమే ఉన్నా, త్సైదకా (FTY) అనే తప్పనిసరి ధర్మ దాన విధానం ద్వారా, అత్యంత శక్తిమంతమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకుంది. యూదు ధర్మంలో ప్రతి యూదుడు తన సంపాదనలో కనీసం 10% (Maaser Kesafim) విరాళంగా ఇవ్వడం నైతిక బాధ్యత. ఇలా యూదు సమాజం ఏటా ఖైదకా ద్వారా సుమారు రూ.4 లక్షల కోట్లు సమకూర్చు కుంటోంది. ఈ నిధులు యూదుల వ్యాపారాలకు, విద్యా వ్యవస్థలకు, ప్రార్థనా మందిరాలకు, ఆసుపత్రులకు, వడ్డీ లేని రుణ పథకాల ద్వారా తిరిగి సమాజంలోనే ప్రవహిస్తాయి, దీనివల్ల యూదులు ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత శక్తిమంతంగా నిలుస్తున్నారు. ప్రపంచ జనాభాలో 0.2% మాత్రమే ఉన్నా, ఖైదకా సహాయంతో వారు విశ్వవ్యాప్తంగా ఆర్థిక, విద్యా, రాజకీయ శక్తిగా ఎదిగారు. హోలోకాస్ట్ (Holocaust), ఇజ్రాయెల్ ఏర్పాటుకు ముందు వచ్చిన సంక్షోభాలు, ఎన్నో శతాబ్దాలుగా ఎదురైన దాడులను ఎదుర్కొనే క్రమంలో ఖైదకా వ్యవస్థే వారికి రక్షణ కవచమైంది.

మళ్లీ ఒకసారి హిందువుల దాన వ్యవస్థ రుత్వా దగ్గరకు వద్దాం. ప్రపంచవ్యాప్తంగా 1.2 బిలియన్ (120 కోట్ల) హిందువులు, ప్రతి సంవత్సరం దాదాపు రూ. 350,000 కోట్ల నుంచి రూ. 783,000 కోట్ల వరకు ధార్మిక సేవలకు, దాన కార్యక్రమాలకు విరాళాలుగా అందిస్తున్నారు. రుత్వా ప్రధానంగా ఆలయ విరాళాలు, హుండీ నిధులు, దేవాలయ పునర్ని ర్మాణం, పూజా కార్యక్రమాలు, ఆలయ నిర్వహణకు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

తిరుపతి, కాశీ, అనంతపద్మనాభస్వామి, సోమనాథ్ వంటి ప్రధాన ఆలయాలు వేల కోట్ల రూపాయల విరాళాలు పొందుతున్నాయి. కానీ ఈ నిధులు వేద విద్యా ప్రచారం, హిందూ విద్యాసంస్థలు, ధర్మ పరిరక్షణ, గో సంరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలకు తగిన విధంగా వినియోగం కావడం లేదు. మరొక అంశం కూడా పరిశీలిద్దాం. ఒక్కొక్క మతంలో ధార్మిక కార్యక్రమాలకు ఆయా మతస్థులు ఇచ్చే (ఏడాదికి) ధర్మ దక్షిణ ఎలా ఉంది? ఎంత ఉంది? హిందువులు సగటున ఏడాదికి రూ. 416, యూదులు రూ. 2,66,666, క్రిస్టియన్లు రూ. 24,166, మహమ్మదీయులు రూ. 41,500. ఇస్తున్నారు. స్పష్టంగా ఇతర మతస్థులలో ఉన్న ధార్మిక దక్షిణ గుణం హిందువులలో లేదని చెప్పటానికి ఇదే నిదర్శనం.

**హిందూ ధార్మిక దక్షిణ ఈ విధంగా ఉండడానికి తొమ్మిది లోపాలు కనిపిస్తాయి.**


1. జాతి, వర్ణ, పంథ భేదం: హిందూ సమాజం కులాలు, వర్ణాలు, మత పంథాలుగా విడిపోయింది. దీనివల్ల ఒకే ధార్మిక విరాళ వ్యవస్థ రూపుదిద్దుకోలేదు.
2. అతిరిక్త కర్మకాండ: హిందూమతం ఆలయ పూజలు, సంప్రదాయ కర్మకాండ్‌లకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తుంది, ధార్మిక, విద్యా, సామాజిక సేవకు తక్కువ ప్రాధాన్యం ఉంది.
3. అర్థలోలుపతా: హిందువులు వ్యక్తిగత ధన సంపాదన, విలాసవంతమైన జీవనానికి ప్రాధాన్యం ఇస్తారు. కానీ ధర్మ పరిరక్షణ, సామాజిక సేవ కోసం విరాళాలు ఇవ్వడం తక్కువ.
4. ప్రచార ప్రసారాభావ: ఇతర మతాల మాదిరిగా, హిందువులకు పెద్ద స్థాయిలో మిషనరీలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు నిర్మించడంలో ఆసక్తి తక్కువ.
5. కేవలం దేవాలయ-కేంద్రితం: హిందువుల విరాళాలు ఎక్కువగా ఆలయ హుండీలు, పూజా కార్యక్రమాలకు వెళ్లిపోతాయి, కానీ ఆధ్యాత్మిక లేదా ధార్మిక విద్యకు తక్కువగా దక్కుతాయి.
6. కేంద్ర-విహీనతా- ఇస్లాం (జకాత్) లేదా క్రైస్తవ మిషనరీలు (టైథింగ్) లాగా, హిందూ విరాళ వ్యవస్థ అనుబంధంగా లేకపోవడం వల్ల విరాళాల ప్రభావం పరిమితమవుతోంది.
7. ధర్మ-సంహితాభావ:-హిందూ ధర్మంలో విరాళాలను క్రమబద్ధంగా ఇవ్వాలని స్పష్టంగా పేర్కొన్న నియమాలు లేవు. ఫలితంగా విరాళాలు అసంఘటితంగా ఉంటున్నాయి.
8. శ్రీ స్వధర్మ విముఖతా: ముస్లింలు లేదా క్రైస్తవులు వారి మతానుయాయులకు విరాళాలు అందజేస్తారు, కానీ హిందువుల విరాళాలు హిందూ సంక్షేమాన్ని పరిరక్షించడంలో పెద్దగా వినియోగించబడడం లేదు.
9. నిజ సంసాధనానాం వ్యర్థతా: హిందువుల సంపద ఇతర సమాజాలకు ప్రవహించేది తప్ప, హిందూ సంస్థలు, విద్యారంగం, వ్యాపారాల్లో తిరిగి మళ్లించటం తక్కువగా ఉంది.

**అయితే రుత్వా తత్వాన్ని అభివృద్ధి చేసే ఏడు మార్గాలు సూచించారు.**

1. సంఘటిత ధార్మిక విరాళ వ్యవస్థ - హిందువులు ఒక శాతం ఆదాయాన్ని ధర్మ పరిరక్షణ కోసం కేటాయించే విధానం (హిందూ టైథింగ్ మోడల్) ను ఏర్పాటు చేయాలి.
2. ఆలయ నిధుల పారదర్శక వినియోగం - ఆలయ విరాళాలను విద్యా ప్రచారం, సామాజిక పురోగతి, ధార్మిక విస్తరణకు ఎక్కువగా వినియోగించాలి.
3. ప్రపంచ స్థాయి హిందూ విద్యా సంస్థలు - క్రైస్తవ, ఇస్లామిక్ విద్యా వ్యవస్థల మాదిరిగా, హిందువులు పెద్ద స్థాయిలో తమ స్కూళ్లు, విశ్వవిద్యాలయాలను నిర్మించాలి.
4. అంతర్జాతీయ హిందూ సంస్థల విస్తరణ - ISKCON, చిన్మయ మిషన్, BAPS స్వామి నారాయణ సంస్థలు వంటి హిందూ సంస్థలను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలి.
5. ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తం చేయడం-హిందూ ఆలయ నిధులు హిందూ ధర్మ ప్రయోజనాలకే వినియోగించాలి. ప్రభుత్వ అదుపు నుంచి విముక్తం చేయాలి.
6. హిందూ రాజకీయ, ధార్మిక ఉద్యమాలకు మద్దతు- ధార్మిక పునరుజ్జీవనానికి, ఆలయ సంరక్షణకు, హిందూ విద్యకు విరాళాల ద్వారా మద్దతు ఇవ్వాలి.
7. "ఏక హిందూ-శ్రేష్ఠ హిందూ" భావన- హిందువుల మధ్య ఏకత్వ భావన, ఐక్యత పెంచి, హిందూ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాము లవ్వాలి. ఆలయాలను కేవలం కర్మకాండ ప్రదేశాలుగా కాకుండా ఆధ్యాత్మిక విద్యా కేంద్రాలుగా కూడా అభివృద్ధి చేయాలి.

**దానం ధర్మస్య సహాయకమ్।**

**లోకాః సుఖినో భవంతు॥** అనే అంశాన్ని హిందువులు పాటించాలి. ఒకటి మాత్రం స్పష్టం. ధర్మం లేదా మతం వ్యక్తి ప్రాధాన్యం కాకుండా, సంఘ ప్రాధాన్యం సంతరించుకొంటుందో, రుత్వను పాటించి ధర్మ దక్షిణ తమ దైనందిన కార్యక్రమాలలో ఒకటిగా చేస్తే ఆ ధర్మం, ఆ మతం, ఆ దేశం బ్రహ్మాండంలో వేగుచుక్కలాగా వెలుగుతుంది.




**డా. బూర నరసయ్య గౌడ్**

**ధార్మిక హిందూ పరిషద్**

**మాజీ ఎంపీ - భువనగిరి**




# మూడో

**వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని లోక్‌సభ, రాజ్యసభలు ఆమోదించాయి. ఆ వెంటనే రాష్ట్రపతి సంతకం చేశారు. ఇప్పుడది చట్టం. పేరు ఉమీద్. వక్ఫ్ అంటే దానం. ఇస్లామిక్ మత దానాలు ఈ పరిధిలోకి వస్తాయి. వక్ఫ్ ఆస్తుల విలువ ఎన్ని కోట్లో ఎవరికీ తెలియదు. రైల్వేలు, రక్షణ రంగ ఆస్తుల తర్వాత వక్ఫ్ ఆస్తులే దేశంలో అధికం. నిజానికి ఆ ఆస్తుల ఫలాలు పేద ముస్లింలకు అందవు. వీటిపై కొంతమంది అమీర్లు, రాజకీయ భూస్వాములు పెత్తనం చేస్తున్నారు. ఇప్పుడు వక్ఫ్ బోర్డులో ముగ్గురు స్త్రీలు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లు పారదర్శకంగా ఉంది. ఐనా సరే కొందరు ఎందుకు కోర్టుకెక్కారు?**

హైదరాబాదులో సెంట్రల్ యూనివర్సిటీ భూములు, అభయారణ్యాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని అమ్మి స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా గాంధీకి కప్పం కడుతున్నది. ఈ విషయంలో ఆందోళన జరిగింది. సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ టీచర్ల నియామకంలో అక్రమాలు చేసిందని కలకత్తా హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టులో కూడా చుక్కెదురయింది. ఇలా ఎన్నెన్నో సంఘటనలు ఇటీవలివే ఉదాహరింపవచ్చు. దీనిని బట్టి తెలిసేదేమిటంటే హైకోర్టు, సుప్రీంకోర్టులతో పాటు భారతదేశంలో మూడో కోర్టు ఉంది. అది రోడ్డు కోర్టు. లక్ష్యసాధన కోసం రోడ్డుకెక్కి ఆందోళనలకు దిగుతున్నారు. ఇక్కడికి వచ్చే వివాదాలకి న్యాయాన్యాయాలతో పనిలేదు. ప్రభుత్వ వ్యతిరేకత. ప్రజాస్వామ్యాన్ని అవమానించడం. ఇంకా చెప్పాలంటే మెజారిటీ మతస్థుల మనోభావాలకు విలువ లేదని రుజువు చేయడం. విద్యార్థులు ఇందులో ఇంధనం లాగా ఉపయోగపడుతూ ఉంటారు. మూడవ కోర్టు అంటేనే రోడ్డెక్కి ఆందోళనలు, అరాజకాలు సృష్టించడం.

మన రాజకీయ పార్టీలలో కమ్యూనిస్టులకు కోర్టుల మీద ఎట్టి నమ్మకమూ లేదు. ఈ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, కోర్టులు అంతా బూటకమని వారు బహిరంగంగానే చెప్పారు. అందుకు వారు చూపించిన ఉదాహరణలు– 1984 నాటి సిక్కుల ఊచకోత కేసు 40 సంవత్సరాలు నడిచింది. 1990 నిర్భయ – కొత్తూరు థామస్ షఫీ (కేరళ) కేసు 30 సంవత్సరాలు సాగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వివేకానంద రెడ్డి హత్యకేసు పదేండ్లుగా సాగుతూనే ఉంది. నేషనల్ హెరాల్డ్ అక్రమ ఆస్తుల కేసులు దశాబ్దంగా సాగుతూనే ఉన్నాయి. కమ్యూనిస్టులనే కాదు, ద్రవిడ పార్టీలు, చాలా ప్రాంతీయ పార్టీలు, ప్రజా సంఘాల పేరుతో చెలామణి అవుతున్న అరాచక శక్తులు ఆశ్రయిస్తున్నది ఈ మూడో కోర్టునే. ఇప్పుడు వక్ఫ్ చట్ట సవరణ ఇలాంటి కిరాయి ఆందోళనకారులకి మూడో కోర్టునే చూపిస్తున్నది. ఏమైతేనేం! ఇవాళ వక్ఫ్ ఆస్తులతో పాటు, చర్చి ఆస్తుల గురించి ఆలోచించే ఒక అవకాశం వచ్చింది.

ప్రస్తుతం కేరళ వంటి రాష్ట్రాలల్లో చర్చి భూములు ఎన్ని ఉన్నాయో ఎవరైనా లెక్కలు తేల్చారా? రామంతపూర్ క్రైస్ట్ ది కింగ్ ప్రాంగణం ఎన్ని ఎకరాలల్లో ఉంది? ముస్లిం మసీదులు, శ్మశాన భూములు, మదర్సాల మీద, చర్చిల మీద ఎవరికీ ఎటువంటి నియంత్రణ లేదు. వారి జోలికి పోతే మైనారిటీ హక్కులకు భంగం అంటూ కాంగ్రెసు, కమ్యూనిస్టు వర్గాలు ఒంటికాలిపై లేస్తాయి. కాబట్టే ఒక సాహసోపేత నిర్ణయంగా అంతా భావిస్తున్న వక్ఫ్ సవరణ చట్టం అంశం జాతీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. తమిళనాడు టెంపుల్ టూరిజం మీద బ్రతికే రాష్ట్రం. ఇక్కడి ముఖ్యమంత్రి వక్ఫ్ ఆందోళనలో పాల్గొని 'మూడవ కోర్టు'ను ఆశ్రయిస్తున్నాడు? ఇదేకాదు, పాస్టర్ ప్రవీణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీనిని హత్యగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని ఇవ్వాళ క్రైస్తవ సంఘాలు ఆశ్రయించినది కూడా మూడవ కోర్టునే.

హైదరాబాదు నగరాన్ని అసఫ్ జాహీ వంశస్థులు పాలించారు. అందువలన నగరంలోని భూములన్నీ వారివే అంటున్నారు ఒక వర్గం. ప్రయాగరాజ్

> **వక్ఫ్ అనే మాటకు అర్థం దేవుడికి చేసిన దానం. భక్తులు, కొందరు ఆనాటి పాలకులు ఇచ్చిన జాగీర్లు ఇవి. ఇలాగే హిందూ దేవాలయలకు, మఠాలకు భక్తులు దానాలు చేశారు. వీటిని దురాశపరులు ఆక్రమించుకున్నారు. ఇందులో సింహాచలం, తిరుపతి వంటి ప్రముఖ ఆలయాల భూములు కూడా ఉన్నాయి. తమిళనాడులో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయ భూములను అప్పడాలు నమిలినట్లు నమిలి తినేశారు. ఇక్కడ అన్ని మతాల వారికి ఒక సామ్యం ఉంది. ఇటీవలి కాలంలో శ్మశాన భూములు, చెరువులు, అడవులు అన్యాక్రాంత మైనాయి.**

(సైఫాబాద్) భూములు, తాజ్‌మహల్ (ఆగ్రా) వక్ఫ్ పరిధిలోకే వస్తాయని ఇంకొందరు వాదించారు. ప్రభుత్వ నియంత్రణకు వ్యతిరేకత ఇందులో సుస్పష్టం. కానీ హిందూ దేవాదాయ సంస్థపై ప్రభుత్వాల నియంత్రణ, ప్రత్యక్ష జోక్యం ఉన్నాయి. గుడ్డిలో మెల్ల అన్నట్టు స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి వక్ఫ్ భూముల సమగ్ర సర్వే చట్టబద్ధంగా జరిగే అవకాశం వచ్చింది.

వక్ఫ్ అనే మాటకు అర్థం దేవుడికి చేసిన దానం. భక్తులు, కొందరు ఆనాటి పాలకులు ఇచ్చిన జాగీర్లు ఇవి. ఇలాగే హిందూ దేవాలయాలకు, మఠాలకు భక్తులు దానాలు చేశారు. వీటిని దురాశపరులు ఆక్రమించుకున్నారు. ఇందులో సింహాచలం, తిరుపతి వంటి ప్రముఖ ఆలయాల భూములు కూడా ఉన్నాయి. తమిళనాడులో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయ భూములను అప్పడాలు నమిలినట్లు నమిలి తినేశారు. ఇక్కడ అన్ని మతాల వారికి ఒక సామ్యం ఉంది. ఇటీవలి కాలంలో శ్మశాన భూములు, చెరువులు, అడవులు అన్యాక్రాంతమైనాయి. ఈ పని చేసినవారు ఓ కులం, ఓ మతానికి చెందినవారని చెప్పలేం. శ్రీవారివి ఏడుకొండలు కాదు జోడుకొండలే అని లోగడ ఒక ముఖ్యమంత్రి అనటం అప్పుడు కోర్టులల్లో కేసులు నడపడం గుర్తుండే ఉంటుంది. 'మదర్సా' అంటే విద్యాలయం. విద్యాభివృద్ధికై ఎవరో దాత దానం చేస్తాడు. అక్కడ




# కోర్టులో వక్ఫ్


మదర్సా ఉండదు. మరి ఆ భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నట్లు?

సెక్షన్ 3 (షరియ) ప్రకారం చరాచర ఆస్తులు వక్ఫ్‌బోర్డుకు చెందుతాయి. అందులో ముస్లిం మతాధికారులు ఉండేవారు. స్త్రీలకు స్థానం లేదు. ఈ చట్టాన్ని 1954-1995-2013 సంవత్సరాలలో కాంగ్రెసు ప్రభుత్వం సవరించింది. ఈ సవరణలన్నీ పేద ముస్లిం ప్రజలను దృష్టిలో పెట్టుకొని చేసినవి కావు. రాజకీయ లబ్ధి కోసం ఆయా సమయాలలో కాంగ్రెసు పార్టీ చేసినవి.

కాంగ్రెస్, దాని అనుబంధ పార్టీలు సవరణ బిల్లును వ్యతిరేకించాయి. ఆంధ్రప్రదేశ్‌లో నారా వారి పార్టీ, జగన్ రెడ్డి పార్టీ రెండూ బిల్లుకు అనుకూలంగానే ఓటు వేశాయి. తెలంగాణ నుండి మజ్లిస్, బీఆర్ఎస్ బిల్లును వ్యతిరేకించాయి. అసదుద్దీన్ ఒవైసీ, ఎం.కె. స్టాలిన్లు 'మూడవ కోర్టు'ను ఆశ్రయించే యోచనలో ఉన్నారు. ఒవైసీ అయితే నితీశ్‌నీ, చంద్రబాబునీ ముస్లింలు ఏనాటికీ క్షమించరని పిల్లి శాపం కూడా పెట్టారు. ఈ ఉదంతంలో శివసేనదే మరీ లజ్జాకరమైన వైఖరి. ఆ పార్టీ ఐక్యంగా ఉన్నప్పుడు ఒక సభ్యుడు లోగడ భారతదేశంలో ముస్లిముల పౌరసత్వాన్ని రద్దు చేయాలని ప్రతిపాదించాడు. తాజాగా అదే శివసేన (యూబీటీ) ముస్లిం లీగ్‌తో కలసి ఓటింగ్‌లో పాల్గొన్నది. "రాజ్యాంగంలోని 14-15-24-25-26-29 సూత్రాలకు ఈ సవరణ విరుద్ధం. అందుకని మేము మూడవ కోర్టు 'వీధిపోరాటానికి సిద్ధం' అన్నాడు అసదుద్దీన్ ఒవైసీ (4.4.2025). 4-4-2025 నాడు లూథియానా, అహమ్మదాబాదు, కలకత్తా, ముంబాయి, చెన్నైలలో శుక్రవారం ప్రార్థనల తర్వాత గుంపులు గుంపులుగా వీధులలోకి వచ్చి ఆ వర్గం వారు అరాచక నినాదాలు ఇచ్చారు. భారతదేశంలోని ముస్లిం మహిళలు ఈ బిల్లును సమర్థించారు. లోగడ త్రిపుల్ తలాక్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. ముస్లిములలో అమీరులు ఒక్క శాతం మాత్రమే ఈ బిల్లును వ్యతిరేకించారు. వాయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వక్ఫ్ బిల్లు చర్చలలో పాల్గొనలేదు. దీనితో వాయనాడ్ ప్రజలు ఆమెను నిలదీశారు. ఇందుకేనా మిమ్మల్ని ఎన్నుకున్నది? అని బహిరంగంగానే తిరగబడ్డారు. రాహుల్ కూడా ముఖం చాటేశాడు.

హైదరాబాదులోని పక్ఫ్ భూములపై అసదుద్దీన్ కిరాయిలు వసూలు చేసుకోవడం నిజమా? కాదా? సారాంశమేమంటే మమతా బెనర్జీ వంటివారు, జయరాం రమేశ్ వంటి వారు హిందూ ముస్లిం భేదాలు సృష్టించి అంతర్యుద్ధాన్ని ప్రేరేపించాలని ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సభ్యుడు సుధాంశు త్రివేది తన రాజ్యసభ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఆయన అన్న మాటలు: ముస్లిం పేద ప్రజల నోట్లో మట్టి కొట్టి ఈ ఆస్తులను కొందరు అమీర్లు అనుభవిస్తున్నారు. ఈ స్వార్థపరులు మాత్రమే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి జోర్డాన్, యెమెన్, కువాయిట్ వంటి ఏ ముస్లిం పాలక దేశాల్లోను లేదు. ఇదేనా కాంగ్రెస్ మార్క్ సెక్యులరిజం అంటే? అని ప్రశ్నించారాయన.

ఇది వక్ఫ్ చట్ట సవరణ. మతానికి సంబంధించిన అంశం కాదు. భూవివాదం మాత్రమే. త్రిపుల్ తలాక్ ఒక సాంఘిక దురాచారం. స్త్రీలపై జరిగే హింస. దీనిని మతచట్టంగా ఎలా పరిగణిస్తారు? బాల్య వివాహాలు సాంఘిక దురాచారాలే కాని తాత్వికాంశాలు కావు. భారతీయ ముస్లిములలో అబ్దుల్ కలాం వంటి దేశభక్తులు ఎందరో ఉన్నారు. హిందూ పేర్లతో మనుగడ సాగిస్తున్న దేశద్రోహులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కాబట్టి మతాన్ని బట్టి ఒక వ్యక్తి దేశభక్తుడా? కాదా? అని మూకుమ్మడిగా నిర్ణయించలేం. భారతదేశాన్ని అరబ్బులు, మొగలులు 600 ఏళ్లు పాలించారు. అప్పుడు భారీ స్థాయిలో మతాంతరీకరణలు జరిగాయన్న మాట నిజం. 1947 నాటి దేశవిభజన తర్వాత భారత్‌లోనే కొన్ని కోట్ల మంది ముస్లింలు ఉండిపోయారు. వీరిలో నిరుపేదలే అధికం. వీరిని ఓటు బ్యాంక్‌గా వాడుకుంటూ కాంగ్రెసు పార్టీ కొన్ని దశాబ్దాలు భారతదేశాన్ని పాలించింది. ఈ పేద ముస్లిముల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలనే ఆలోచన ఏనాడూ చేయలేదు. రంజాన్ మాసంలో ఒక పూట ఇఫ్తార్ ఇచ్చినంత మాత్రాన వీరి దరిద్రం తొలగిపోతుందా? అరటిపండ్లు, కూరలు, పూలు అమ్ముకుంటూ, చిన్న చిన్న మెకానిక్‌లుగా రోడ్డు పక్కన బతికే ముస్లింలు హైదరాబాదులోనే లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరిని కమ్యూనిస్టు, కాంగ్రెసు వర్గాలు పట్టించుకున్నాయా? అనుభవం ఏం చెబుతున్నది? ఇండియాలో హిందువులు మెజారిటీలో ఉన్నంత వరకు ముస్లిములు, క్రైస్తవులు సుఖజీవనం చేయగలరు. చైనాలో కమ్యూ నిష్టుల రాజ్యం ఉంది. అక్కడ ముస్లిములు రంజాన్ చేసుకోవడానికి వీలులేదు. పాకిస్తాన్‌లో ముస్లిములదే మెజారిటీ. అక్కడ కూలి పనులు చేసుకొనే కొద్దిమంది హిందువులు ఒక్క శాతం మిగిలారు. నరేంద్ర మోదీ 'సబ్‌కా వికాస్' మంత్రాన్ని భారతదేశంలోని ముస్లిం మహిళలు నమ్మారు. కానీ అల్లరంతా హిందూ పేరు, పాకిస్తాన్ మనసు ఉన్నవారిదే. మూడో కోర్టులన్నీ వీళ్లవే.





**ప్రొ. ముదిగొండ శివప్రసాద్**
విశ్రాంత ఆచార్యుడు



# ఆక్వాపై అమెరికా సుంకాల

ఆంధ్రప్రదేశ్ రొయ్యల సాగు, ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే అగ్రగామిగా ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం ఊతమిస్తోంది. జీఎస్‌డీపీలో రొయ్యల పరిశ్రమ వాటా 11 శాతంగా ఉంది. ప్రధానంగా ఈ రంగం ఎగుమతులపై ఆధారపడి ఉంది. 2023–24లో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92% వాటా కలిగి ఉన్నాయి. భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు. 40%పైగా రొయ్యలు భారత్ నుంచి అక్కడికి ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు భారత సముద్ర ఉత్పత్తులపై 27% సుంకం విధించడంతో మన రొయ్య యూఎస్ మార్కెట్‌ను తట్టుకొని పోటీలో నిలవలేదు. సుంకాల పెంపుతో కొన్ని రోజుల పాటు నిలిపివేయాలని ఎగుమతులు నిర్ణయించుకున్నారు. దాంతో రొయ్యల రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన ఆర్డర్లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ అయి కోల్డ్ స్టోరేజీలు, పోర్టుల్లో ఉన్నాయి. వీటిపై సుంకం భారం పడుతుంది. రాష్ట్రంలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంటను ఎక్కడ ఉంచాలో తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగం ఉంది. 27% సుంకాల కారణంగా రైతుల నుంచి పంట సేకరించడం ఎగుమతిదారులు నిలిపివేశారు. ఈ పరిణామాలు రాష్ట్ర ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయి. ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతి దారులు.. ఇలా అందరికీ సమస్యలు వచ్చాయి.




**మార్కెట్‌ను మరిచిపోవాల్సిందే..**

అమెరికా సుంకాల ప్రభావం కేవలం యూఎస్‌కు జరుగుతున్న రొయ్యల ఎగుమతులకే పరిమితంకాదు. ద్వితీయ ఎగుమతి మార్గాలను కూడా తీవ్రంగా దెబ్బతీయనున్నాయి. అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న చైనా, థాయ్‌లాండ్, వియత్నాంలకు 35 శాతం రొయ్యల ఉత్పత్తులు మన దేశం నుంచి వెళుతున్నాయి. తిరిగి ఈ రెండు దేశాలూ తాము దిగుమతి చేసుకున్న రొయ్యల్లో చాలా భాగం అమెరికాకే ఎగుమతి చేస్తున్నాయి. ఇప్పుడు చైనా, వియత్నాం నుంచి యూఎస్‌కు ఎగుమతులపై 30% కంటే ఎక్కువ సుంకాలు ట్రంప్ తాజాగా విధించారు. దీంతో ఆ దేశాల నుంచి మనకు ఆర్డర్లు తగ్గిపోతాయి. ఇప్పటికే ఉన్న 5.76 శాతం కౌంటర్ వేలింగ్ డ్యూటీ (సీవీడీ), 1.35% నుంచి 3% మధ్య ఉన్న యాంటీ –

అమెరికా విధించిన ప్రతీకారసుంకాల తీవ్రత రాష్ట్రంలో ఆక్వారంగాన్ని నేరుగా తాకింది. ఇప్పటికే రొయ్యలకు వ్యాధులు ప్రబలి, సాగు ఖర్చులు భారమై సతమత మవుతున్న రొయ్యల సాగుదార్లపై ట్రంప్ తాజా ఆంక్షలు సమ్మెటపోటుగా పరిణమిం చాయి. భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన 27% ప్రతీకార సుంకం ప్రకటన వెలువడిన కొన్నిగంటల్లోనే రొయ్యల ధరల్లో పతనం మొదలైంది. దీంతో సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమ సంక్షోభంలో పడిపోతుందని ఆక్వా రంగ భాగస్వాములు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారం



డంపింగ్ డ్యూటీలను కూడా కలుపుకొంటే ఈ సుంకాల భారం 33%-35% వరకు ఉండవచ్చు. దేశంలోని వివిధ పోర్టుల నుంచి ఆక్వా ఉత్పత్తులతో సముద్ర మార్గంలో అమెరికాకు బయల్దేరిన కంటెయినర్లు 2 వేలు. రవాణాకు సిద్ధంగా ఉన్నవి మరో 2 వేలు. మొత్తం 4 వేల కంటెయినర్లలో ఉన్న సరకు విలువ సుమారు రూ.4 వేల కోట్లకు పైనే. ఈ కంటెయినర్లు ఏప్రిల్ 9లోపు అమెరికాకు చేరకపోతే 26% సుంకం, 3.88% యాంటీ డంపింగ్ సుంకం, 5.77% కౌంటర్ వెయిలింగ్ సుంకం కలిపి 34% చెల్లించాల్సిందే. అంటే ఇప్పటికిప్పుడు పడే సుంకాల భారం రూ. 1,300 కోట్లకు పైనే ఉండచ్చుని వాణిజ్యవర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఈక్వెడార్ నుంచి పోటీ**

అమెరికాకు రొయ్యలు ఎగుమతి చేస్తున్న ఈక్వెడార్ వంటి దేశాలపై కేవలం 10% సుంకాన్ని మాత్రమే ట్రంప్ ప్రభుత్వం విధించింది. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ, వారికి అనుకూలంగా మారుతోంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77% కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ(సీవీడీ) భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలు కలుపుకొంటే ఈక్వడార్‌కు, భారత్‌కు మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20% ఉంటుంది. ఈ కారణంగా అమెరికాకు వెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈ భారం పడుతోంది. దీంతో భవిష్యత్తులో మనకు ఈక్వడార్ ప్రధాన పోటీదారుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఆక్వాపై అగ్రరాజ్యం సెగ!**

ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు 5.73,535 ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులున్నాయి. వాటిలో సుమారు 19 లక్షల టన్నుల రొయ్యలు సాగు చేస్తున్నారు. దీంతో పాటు సముద్రపు వేట ద్వారా లభించే రొయ్యలను కూడా విదేశాలకు ఎగుమతి చేస్తారు. చెరువుల్లో సాగు చేసే రొయ్యలు 30 కౌంట్ వచ్చేవరకు రైతులు ఆగుతారు. ఈ తరుణంలో 30 నుంచి 50 కౌంట్ ఉన్న రొయ్యలు చెరువుల్లో అధికంగా ఉంది. వేసవిలో కొనుగోలు చేసిన రొయ్యలను ప్రాసెసింగ్ చేసి ఓడల ద్వారా డిసెంబరు నాటికి అమెరికాకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం అమెరికా విధించిన సుంకం కారణంగా 30 కౌంట్ ఉన్న రొయ్యలను ఎగుమతి చేయాలంటే కిలోకు రూ.130 అదనపు భారం పడుతుందని, దీంతో స్థానికంగా రొయ్యల ధర తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని ఎగుమతిదారులు భరిస్తారా లేక రైతులకు ఇచ్చే ధరలోనే కోతపెడతారా అనే అంశంపై రైతుల్లో చర్చ జరుగుతోంది.


ఆక్వా ఎగుమతులకు బ్రేక్ పడకుండా ఎగుమతిదారులు కొంతమేర భారం తమపై వేసుకునేందుకు ముందుకు వస్తారా?లేదా? అనే అంశంపై వారం రోజుల వ్యవధిలో స్పష్టత వస్తుందని స్థానికంగా రొయ్యలు కొనుగోలు చేసే వ్యాపారులు చెబుతున్నారు. మన దేశం నుంచి అమెరికా, చైనా తదితర దేశాలకు రొయ్యలన ఎగుమతి జరుగుతుందని, పెద్ద కౌంట్ ఉన్న రొయ్యలు అధికంగా అమెరికాకు ఎగుమతి అవుతాయని పెద్ద వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా విధించిన 27 శాతం మేర సుంకం ప్రభావం తప్పనిసరిగా ఆక్వా రైతులపై పడుతుందని చెబుతున్నారు.

**కొనుగోళ్లు నిలిపివేత**

ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా సుంకం పెంచడంతో 50 కౌంట్ కంటే పెద్ద రొయ్యల కొనుగోలును ప్రాసెసింగ్ యూనిట్‌ల యజమానులు, ఎగుమతిదారులు నిలిపివేశారు. కిలోకు 50, 60, 70, 80, 90, 100 కౌంట్ ఉన్న రొయ్యలనే ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ధరలు తగ్గించి మరీ చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు కిలోకు 100 కౌంట్ ఉన్న రొయ్యలు రూ.250 మేర ధర ఉండగా, గత రెండు రోజులుగా ఈ ధరను రూ.200లకు తగ్గించివేశారు. 60 కౌంట్ రొయ్యలధర గతంలో రూ.330 వరకు ఉండగా నేడు రూ.250కు పడిపోయింది. 50 నుంచి 100 కౌంట్ ఉన్న రొయ్యలను చైనా దేశానికి ఎగుమతి చేసేందుకే కొనుగోలు చేస్తున్నామని, పరిస్థితులు చక్కబడేవరకు అమెరికాకు రొయ్యల ఎగుమతులు ఉండవని ఎగుమతిదారులు చెప్పడం గమనార్హం. ఇప్పటికే తమ వద్ద ఉన్న సరుకును ఏ పద్ధతిలో ఎగుమతి చేయాలో తెలియడం లేదని, 30, 40, 50 కౌంట్ ఉన్న రొయ్యలను ఇప్పట్లో కొనుగోలు చేయబోమని ప్రాసెసింగ్ యూనిట్‌ల యజమానులు, ఎగుమతిదారులు స్పష్టం చేస్తున్నారు.

**ప్రాసెసింగ్ యూనిట్ల సమస్య**


కొవిడ్ సమయంలో ప్రభుత్వం రొయ్యల ఎగుమతులను ప్రోత్సహిస్తూ ప్రాసెసింగ్ యూనిట్లను నడిపింది. కానీ ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కే ప్రత్యామ్నాయ మార్కెట్లు కనిపించడం లేదు. ఏపీలో రొయ్యల పరిశ్రమ ఉపాధి కల్పనకు ఊతం ఇస్తోంది. రాష్ట్రంలో 450పైగా రొయ్యల హచరీలు, 50పైగా ఫీడ్ మిల్లులు, 2లక్షలపైగా రొయ్యల చెరువులు, 250 పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6వేలకుపైగా పడవలు, నౌకల ద్వారా వేలాదిమందికి జీవనోపాధి లభిస్తోంది. ఏటా ఏప్రిల్- సెప్టెంబరు మధ్యనే వార్షిక ఉత్పత్తిలో 70% చేతికి వస్తుంది. అయితే రొయ్యలు త్వరగా పాడయ్యే ఉత్పత్తి. సుంకాల కారణంగా కొంతకాలం సాగునీటి వనరుల్లో నిల్వ చేద్దామంటే తగిన శీతలీకరణ వసతులు లేవు. దీంతో ప్రాసెసింగ్ కష్టమై లక్షల మంది ఉపాధి కోల్పోతారు. ఈ నేపథ్యంలో కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆక్వా సాగుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

జానపద సాహిత్యంపై పరిశోధన అనగానే తొలుత స్ఫురించే పేరు ఆచార్య బిరుదురాజు రామరాజు. శిష్ట సాహిత్యానికి పునాదిగా చెప్పే జానపద సాహిత్యంపై ఎందరో ప్రముఖులు, మహనీయులు కృషి చేశారు, వ్యాసాలు వెలువరించారు. నేదునూరి గంగాధరం ఈ సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురాగా, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, చింతా దీక్షితులు, టేకుమళ్ల కామేశ్వరరావు తదితరులు లెక్కకు మిక్కిలి వ్యాసాల ద్వారా దాని వ్యాప్తికి పాటుపడ్డారు. హరి ఆదిశేషువు 'జానపద గేయ వాఙ్మయ పరిచయం' పేరిట పల్లె ప్రజల సాహిత్యాన్ని తొలిసారి పుస్తక రూపంలోకి తెచ్చారు. అయితే విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన రంగంలో జానపద సాహిత్య పరిమళాలను వెదజల్లిన తొలి వ్యక్తి మాత్రం బిరుదురాజు రామరాజు. ఆయన 'తెలుగు జానపద గేయ సాహిత్యము' సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో మొదటిదే కాకుండా జానపద సాహిత్యంపై దక్షిణ భారతదేశంలోని తొలి పరిశోధన వ్యాసంగా ప్రసిద్ధి పొందింది. భావి పరిశోధకులకు కరదీపికలా నిలిచింది. తెలుగు జానపద అధ్యయనాలకు విజ్ఞాన సర్వస్వంగా అందుబాటులో ఉంది.

# జానపద పరిశోధక



(1925-2010)

ఆచార్య రామరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకులుగా, తెలుగు శాఖాధ్యక్షులుగా సేవలందించారు. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో విశేష కృషి చేశారు. పెద్ద సంఖ్యలో గ్రంథాలు రాశారు. తెలుగు జానపద రామాయణం, వీరగాథలు, యక్షగాన వాఙ్మయం, ఆంధ్రయోగులు (నాలుగు సంపుటాలు), సంస్కృత సాహిత్యానికి తెలుగువారి సేవ, చరిత్రకెక్కని చరితార్థులు, మరుగునపడిన మాణిక్యాలు, తెలుగువీరుడు, తెలుగు సాహిత్యోద్ధారకులు, విన్నపాలు, పల్లెపట్టు (నాటకం) తెలంగాణ పిల్లల పాటలు... వంటివి వాటిలో ఉన్నాయి. ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న ఆయన గురు గోవింద్‌సింగ్ చరిత్ర, జాతక కథలను హిందీ నుంచి తెలుగులోకి అనువదించారు. ఉర్దూ-తెలుగు నిఘంటువును రూపొందించారు.

**జననం.. చదువు**

వరంగల్ జిల్లా దేవునూర్ గ్రామంలో ఏప్రిల్ 16, 1925న నారాయణరాజు, లక్ష్మీదేవమ్మ దంపతులకు జన్మించిన రామరాజు స్వగ్రామంలోని వీధిబడిలో చేరారు. ప్రాథమిక విద్యను మండికొండలో, ఇంటర్మీడియట్ హన్మకొండలో, బి.ఎ. హైదరాబాద్ నిజాం కళాశాలలో చదివారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో స్నాతకోత్తర విద్య (ఎం.ఎ.) పూర్తి చేసి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో (1952-55) 'తెలుగు జానపద గేయ సాహిత్యం' శీర్షికతో పరిశోధన చేసి పీహెచ్.డి. పట్టా పొందారు. కళాశాలలో పార్ట్ టైం ఉపన్యాసకుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడిగా (1951) చేరి అంచెలంచెలుగా డీన్, విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడిగా ఎదిగారు. వరంగల్ కాకతీయ స్నాతకోత్తర కేంద్రంలోని తెలుగుశాఖ వ్యవస్థాపక అధ్యక్షుడిగా సేవలు అందించారు.

**పరిశోధనాసక్తి**

చిన్నప్పుడు నాయనమ్మగారు చెప్పిన జానపద కథలు, పుట్టిన ఊరిలో పొలం పనుల సమయంలో శ్రమజీవులు పాడుకునే పాటలు రామరాజుకు జానపద సాహిత్యంపై ఆసక్తి కలిగించాయి. పాఠశాల, కళాశాల విద్యార్థిగానే జానపద గీతాలు సేకరణ మొదలుపెట్టినట్టు ఆయన చెప్పేవారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనకు అనుమతి లభించగా, మొదట యక్షగానం అంశాన్ని ఎన్నుకోవలసి వచ్చింది. అదే అంశంపై ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (విశాఖపట్నం)లో యస్వీ జోగారావు పరిశోధన చేస్తున్నారని తెలిసి ఆరునెలల అనంతరం 'జానపద సాహిత్యం' అంశాన్ని ఎంచుకున్నారు.

**జనపదాల సందర్శన**

సమాచార, రవాణా వ్యవస్థ అంతగా లేని కాలంలో పరిశోధన సమాచారం, అందునా... జానపద సాహిత్య సమాచార సేకరణ అంత సులభం కాదు. ఆ పరిస్థితులలో సుమారు రెండున్నరేళ్లపాటు తెలంగాణలోని అనేక పల్లెలు తిరిగారు. అప్పుడూ అనేక ఒడుదొడుకులు. చేపట్టిన కార్యం అనుకున్నంత సులువుగా సాగలేదు. జానపదులు (పల్లీయులు) పాడుతున్నప్పుడు సేకరించిన దానిలోనే జవం, జీవం ఉంటుంది. అయితే కొందరు భయం వల్ల, మరికొందరు సిగ్గుతో తన ఎదుట పాడేవారు కారట. ఫొటో(లు) తీసుకునేందుకూ ఒప్పుకునేవారు కారట. ఫొటోతీస్తే

# రేడు-బిరుదురాజు

శరీరం శుష్కించిపోతుందని, కంఠ మాధుర్యం చెడిపోతుందని వారి నమ్మకం. అడిగి పాడించుకోవడం కష్టంగా ఉండడంతో, వారు పనుల్లో నిమగ్నమై పాడు కుంటున్న వేళ చాటుమాటు నుంచి రాసుకోవడం, ఫొటోలు తీయడం చేసేవారు. ఒక గ్రామంలోని వారు పాడిన పాటలను మరో గ్రామంలోని వారికి పాడి వినిపించి, ఆ స్ఫూర్తితో పాడించుకునే ప్రయత్నం చేసేవారు. అందుకు వారికి పాత దుస్తులు, పైకం ఇవ్వడం, కల్లు పోయించడం, పొగాకు లాంటి తాయిలాలు ఇచ్చేవారట. అయినా 'ససేమిరా' అనేవారిని గ్రామాధికారులు, పోలీసులతో గట్టిగా చెప్పించి, బెదిరించి పాడించుకున్న సందర్భాలు ఉన్నాయట (సమాచార సేకరణలో వారిని అలా ఇబ్బంది పెట్టినందుకు పశ్చాత్తాపం చెందారు) జానపద గాయక భిక్షుకులు మాత్రం అడిగినంత పాడేవారట. 'వారికి కావలసింది పిడికెడు బిచ్చం, కల్లు నీళ్లు, రాగి డబ్బులు, పాత వస్త్రములు. వీటి వలన వారి జోలెలు నిండకున్నను తమ ఎదలలోని అమృతవాక్కులతో నా పాటల జోలెను మాత్రము నింపినారీ అల్ప సంతోషులు' అని కృతజ్ఞత పూర్వకంగా వివరించారు. బిరుదురాజు పరిశోధనతో జానపద సాహిత్య విశిష్టతతో పాటు జానపదుల అమాయకత్వం, దయనీయత వెల్లడైనట్లయింది.


జానపద సాహిత్య పరిశోధనను సాంస్కృతిక సేవగా భావించిన రామరాజు ఈ అంశంపై జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో ప్రసంగించారు. అనేక పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆయన సేకరించిన జానపద గీతాలు అనేకం అముద్రితంగానే మిగిలిపోవడంతో జానపద పరిషత్ సంస్థకు, తమ అపూర్వ గ్రంథ సంచయమంతా కడపలోని బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి అందచేశారు.

**అసమర్పిత సిద్ధాంత వ్యాసం**

అప్పటిలో పండిత లోకంలో జానపద సాహిత్యం పట్ల అంతగా సదభిప్రాయం ఉండేది కాదు. దాంతో రామరాజులో, తాను ఎంచుకున్న అంశంపై పరిశోధన చేస్తూనే, ఇతరత్రా ప్రతిభను నిరూపించుకోవాలన్న పట్టుదల పెరిగింది. అలా... సంస్కృత, ఆంధ్ర తాళపత్ర గ్రంథాలను పరిష్కరించారు. సంస్కృతంలోనూ స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. ప్రాచీన సంస్కృతాంధ్ర గ్రంథాల్ని పరిశీలించి, పరిష్కరించి వెలుగులోకి తేవడానికి విశేష కృషి చేశారు. 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల సహకారం' అనే అంశంపై సంస్కృతంలో పీహెచ్‌డీ చేశారు. 19వ శతాబ్ది చివరి వరకు 224 మంది తెలుగువారు సంస్కృతానికి చేసిన సేవల గురించి గ్రంథస్థం చేశారు. కానీ విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించలేదు. ఆ పరిశోధననే (Andhras contribution to Sanskrit Literature) గ్రంథంగా వెలువరించారు. విశ్వవిద్యాలయంలో ఆచార్య పదోన్నతికి కొందరు అడ్డంకి కావడంతో విసుగు చెంది ఆ సిద్ధాంత వ్యాసాన్ని మూలన పడవేశారని అమలాపురం కళాశాల తెలుగు విశ్రాంత ఉపన్యాసకుడు, సాహితీవేత్త దివంగత డాక్టర్ ద్వా.నా.శాస్త్రి (నేనెరిగిన సాహితీవేత్తలు) పేర్కొన్నారు.


బిరుదురాజు ఎన్నో పుస్తకాల పరిష్కర్త, సంపాదకులు. అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. కృష్ణదేవరాయల సంస్కృత కావ్యం 'జాంబవతీ పరిణయం' రూపకాన్ని పరిష్కరించి ప్రచురించారు. శరత్‌చంద్ర ఛటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్ వంటి అగ్ర రచయితల రచనలను తొలిసారిగా తెలుగులోకి అనువదించి సాహిత్యాభిమానులకు పరిచయం చేశారు. ఆ రచనల్లోని ఏ విషయమైనా సూటిగా స్పష్టంగా ఉండేది. ఎలాంటి వ్యాఖ్యానాలకు అవకాశం ఉండదు. వంద పుటలో చెప్పవలసిన బసవేశ్వర చరిత్రను పదవ వంతులో సమగ్రంగా వివరించడం, వెయ్యేళ్ల ఓరుగల్లు ప్రాభవం, సాహిత్య ప్రాధాన్యాలపై 'ఓరుగల్లు సాహితీ సౌరభాలు' అంటూ కేవలం ఐదు పుటల్లో నిక్షేపించడం అందుకు మచ్చుతునకలు.

ఆయన ఎంతటి సమర్థ పరిశోధకుడో అంత ఆధ్యాత్మికవాది. కర్మ సిద్ధాంతాన్ని కాదనే వారు కాదు. 'జీవితంలో ఏం జరిగిన అన్నీ భగవత్ నిర్ణయాలే. 'ఉన్నంత కాలం సాహితీ సేవచేయాలి. సేవ చేసినంత కాలం జీవించగలగాలి' అన్నది ఆయన అభిప్రాయం. యోగుల చరిత్ర అలా ఆవిష్కృతమైనదే. విశ్వవిద్యాలయ ఆచార్యులుగా పదవీ విరమణ చేసిన మూడేళ్లకు ప్రారంభించి (1988–2008) 301 మంది 'ఆంధ్రయోగులు' చరిత్రను ఆరు సంపుటాలుగా వెలువరించారు. మొదటి సంపుటి వెలువడిన పదేళ్లకు మిగిలినవి వెలుగు చూశాయి. రాయడం కంటే సమాచార సేకరణ కష్టతరమైంది. సాహితీవేత్తలకు లేఖలు రాయడం ద్వారా, శిష్యప్రశిష్యుల సహకారంతో వివరాలు సమీకరించి కలను సాకారం చేసుకున్నారు. 'భారతధాత్రి వేదభూమి. యోగుల గురించి తెలియచేయడం అంటే భారతీయ సంస్కృతిని చాటి చెప్పడమే. ఈ దేశం ఇంకా ఇలా ఉందంటే ఆ మహాత్ముల వల్లనేనని నా ప్రగాఢ విశ్వాసం. వీళ్ల వల్లనే మన దేశం తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంటుంది. ఆ భావనే ఈ మహాగ్రంథ




రచనకు బీజం వేసింది. నా సాహిత్య ఆధ్యాత్మిక పారమార్థిక కృషిలో అత్యంత తృప్తినిచ్చిన గ్రంథం ఇదే' అని చెప్పేవారు. చిరస్మరణీయమైనది, స్థిరస్మరణీయమైనదీ రామరాజు గారి 'ఆంధ్రయోగుల' దివ్యజీవన మాలికలో ఇప్పటికి పరశ్శతంగా ఈ భారతీయాధ్యాత్మిక వ్యక్తులను, దివ్యశక్తులను మూర్తీభవింపచేశారు' అని ఆచార్య అక్కిరాజు రమాపతిరావు తమ గురువు కృషిని శ్లాఘించారు.

బిరుదురాజు తన జీవితాన్ని తీర్చిదిద్దిన వారి పట్ల సదా వినయంగా మెలిగేవారు. ముఖ్యంగా 'గురువు ఖండవల్లి గారిని స్మరించుకుంటేనే నా జీవితానికి సార్థకత కలుగుతుంది. నాలో ప్రతిభ అంటూ ఉందంటే అందుకు గురువే కారకుడు. చదువు పట్ల ఆసక్తి కలిగించడం, ఆసక్తి కలవారిని ఆదరించడం గురువు నుంచి అబ్బే సద్గుణాలు. వాటిని నా గురువు ఖండవల్లి నేర్పారు' అని వినయంగా చెప్పేవారు. అలాగే రచయిత, పాత్రికేయ ప్రముఖుడు సురవరం ప్రతాపరెడ్డితో గల ఆత్మీయబంధం, తండ్రీతనయుల వంటి అనురాగబంధం ఆయనను



**డా॥ అరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

ఉన్నతంగా మలచింది. 'సురవరంవారు నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పిన అపరోక్ష గురువు. ఆయన సలహా లేకపోతే సాహిత్యపరంగా ఈ స్థాయికి చేరేవాడిని కానేమో. మహా అయితే నా సహోద్యోగులలో కొందరిలా ప్రభుత్వోద్యోగిగా ఉన్నత హోదాలో పదవీ విరమణ చేసేవాడినేమో' అని అనేక సందర్భాలలో మననం చేసుకున్నారు. స్వరాజ్య సమరంతో పాటు నైజాం సంస్థానం విముక్తి ఉద్యమంలో పాల్గొన్న ఆయనకు అనంతర కాలం రాజకీయంగా క్రియాశీలక పాత్రపోషించే అవకాశం వచ్చింది. చట్టసభకు పోటీ చేసేలా కొందరు పెద్దలు ప్రోత్సహిం చినా, ఆయన 'సర్వ' శ్రేయోభిలాషి సురవరం ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. అంతే కాదు, రామరాజు కళాశాల విద్యార్థిగా ఉండగానే తండ్రి నారాయణరాజు కాలం చేయడంతో, ఇంగ్లండ్ వెళ్లి ఐసీఎస్ సాధించాలనే అభిలాషకు ఆటంకం కలిగింది. అప్పుడే, స్వతంత్ర హైదరాబాద్ స్టేట్ పంచాయతీ అధికారిగా కొలువు దొరికింది. దానినీ సురవరం వారు పడనీయలేదు. రామరాజులోని ప్రతిభ, తెలివితేటలు, పరిశోధన జిజ్ఞాసను గుర్తించిన ఆయన, ఆ దిశగా కృషి చేయాలంటూ ప్రోత్సహిం చారు. ఆయనలోని తెలుగు భాషాభిమానాన్ని, భాషపై పట్టును గమనించి, తెలుగు భాషా సంస్కృతుల అధ్యయనం, పరిశోధనకు ప్రోత్సహించారు.

రామరాజు తమ గురువు(ల) దగ్గర పొందిన ప్రేమనే తన శిష్యులకు పంచారు. శిష్యుల వల్లనే గురువులకు పేరు ప్రఖ్యాతులు వస్తాయనే వారు. శిష్యుల ప్రతిభా పాటవాలు మన్ననలు అందుకున్నప్పుడు అది గురువుకు దక్కిన అమిత గౌరవంగా పరిగణించేవారు. పరిశోధక విద్యార్థులు సిద్ధాంత వ్యాసాలు సమర్పించిన వెంటనే అనంతర ప్రక్రియకు ఉపక్రమించి ఆశీర్వదించే వారని ఆచార్యులుగా పదవీ విరమణ చేసిన ఆయన శిష్యులు నేటికీ స్మరించు కోవడమే ఆయన శిష్యవాత్సల్యానికి నిదర్శనం. అన్ని




అర్హతలు గల తనకు పదోన్నతిలో జాప్యం లాంటి అన్యాయం ఇతరులకు పునరావృతం కాకూడదన్నది ఆయన విశాల మనసుకు కారణం కావచ్చు.

రామరాజు శషభిషలకు అతీతులు. 'స్వీయలోపం బెరుగుట పెద్ద విద్య' అన్న మిత్రుడు దాశరథి కృష్ణమాచార్య రచనా పలుకులను తనకు అన్వయించు కున్నారనవచ్చు. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలలో మొదటి రెండు తనలో తక్కువని నిజాయతీగా అంగీకరించేవారు. సృజనాత్మక రంగంలో రాణింపు దక్కదని భావించి లోకానికి కొత్త విషయాలు చెప్ప వచ్చున్న ఆలోచనతో పరిశోధన రంగంవైపు మళ్లినట్టు స్వయంగా ప్రకటించారు. అలా తాను ఎంచుకున్న రంగంలో(జానపద పరిశోధన) విజయం సాధించ డమే కాదు.. భావి పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. ఆయన ముక్కుసూటి మనిషి. మనసులోని మాటను కుండబద్దలు కొట్టడంలో ఏ మాత్రం మొహ మాటపడే వారు కాదు. 'నబ్రూయాత్ సత్య మప్రియం' (సత్యమైన అప్రియమైన మాటలు పలుకరాదు)అనే ఆర్యోక్తిని పట్టించుకునేవారు కాదని ఆయనను బాగా ఎరిగిన వారు చెబుతారు. ఉద్యోగ ప్రస్థానంలో పదోన్నతులలో ఎదురైన చేదు అనుభవాల నుంచి సర్కార్ జిల్లాలకు చెందిన కొందరు మేధావులు నిజాం ఆశ్రయం పొందడం ద్వారా పరోక్షంగా తెలంగాణ ప్రాంత హిందువులను వంచించారడనడం దాకా మొహ మాట పడలేదు. ఇది ధర్మాగ్రహమే కాని మరోటి కాదని అనంతర కాలంలో ఆయన వ్యవహార శైలి చాటింది. వాస్తవానికి నిజాం పాలనలోని ప్రజల కడగండ్ల గురించి తెలంగాణేతర ప్రాంతాల వారికి అంతగా అవగాహన ఉండేది కాదు. కనుక ఈ విషయంలో వారిని తప్పుపట్ట నవసరం లేదు' అనేవారు.


**ఉద్యమ దీప్తి**

ఆంధ్రమహాసభలను పురస్కరించుకొని మహాత్మా గాంధీ వచ్చినప్పుడు వలంటీరుగా పాల్గొన్నారు. నిజాం కళాశాలలో చదివేటప్పుడు దాశరథితో పరిచయమైంది. అయనతో కలసి నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. కాళోజీ, టి.హయగ్రీవా చారి, జమలాపురం కేశవరావు, ముదిగొండ సిద్ధ రాజలింగం వంటి నాటి యువనాయకులతో రజాకార వ్యతిరేక, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో అనుమతి లేకుండా కవిసమ్మేళనం నిర్వహించినందుకు అరెస్టు అయ్యారు.

**తెరసం కార్యదర్శిగా...**

మాడపాటి హనుమంతరావు నెలకొల్పిన 'ఆంధ్ర సంఘం' అధ్యక్షుడిగా నియమితులైన బిరుదురాజు తెలంగాణ రచయితల సంఘం (తెరసం) వ్యవస్థాపక కార్యదర్శిగా (విశాలాంధ్ర ఆవిర్భావంతో తెరసం 'ఆంధ్ర రచయితల సంఘం'గా మారింది) పనిచేశారు. సి.నారాయణరెడ్డితో కలసి 'రామనారాయణ కవులు' పేరుతో కవిత్వం చెప్పారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్,విశిష్ట పురస్కారం, కేంద్ర ప్రభుత్వంనుంచి నేషనల్ ప్రొఫెషనల్ షిప్, రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, సీపీ బ్రౌన్ అకాడెమీ వారి తెలుగు భారతి పురస్కారం.. వంటివి. అందుకున్నారు.

'1945లో 'ఆంధ్రుడా.. ఓ ఆంధ్రుడా' అనే గేయంతో ప్రారంభమైన నా సాహిత్యవ్యాసంగం ఆంధ్రయోగుల చరిత్ర, ఆంధ్రుల సంస్కృత సాహిత్య పరివస్య (సేవ), నేను–నాసాయి రచనలతో ముగిస్తే బాగుంటుందనుకుంటున్నాను. ఇది నా చివరి కోరిక. ఇది తీరాక ఇక ఏ కోరిక కోరని పరిస్థితి కల్పించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను' (2004) అన్న 'జానపద విజ్ఞాన శిఖరం' తన ధ్యేయం పూర్తి చేసుకున్నాకే (ఫిబ్రవరి 8, 2010) ఎనిమిదిన్నర పదుల ఏళ్ల వయసులో ఒరిగిపోయింది. ★





Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

# Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

www.asvinshospitals.com Ph: +91 94404 45775

**40+ Years of Oncology Expertise**
**Over 7,00,000 Patients Treated**
**75,000 Successful Surgeries**
**99% Success Rate**

ASVINS
Specialty Hospitals
Care • Cure • Comfort



## SERVICES

| SURGICAL SPECIALTIES: | MEDICAL SPECIALTIES: |
|---|---|
| Anaesthesiology | Bone Marrow Transplant |
| Breast Surgery | Cardiology |
| Bone & Soft Tissue Tumors | Chest Medicine |
| Gynaecology & Gynaec Oncology | Endocrinology |
| Head & Neck Oncology | Gastroenterology |
| Minimal Access Surgery | Hematology & Hemato Oncology |
| Neurosurgery | Internal Medicine |
| Plastic & Reconstructive Surgery | Intensive Care |
| Surgical Oncology | Medical Genetics |
| Thoracic Oncology | Medical Oncology |
| Transplant Surgery | Nephrology & Dialysis |
| Urology, Andrology & Endo Urology | Neurology |
| Vascular Surgery | Orthopaedic & Rheumatology |

**Book Your Consultation Now +91 9440445775**

**We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries**

**We Expertise in Treating All Cancers**　**Expert Treatment At Affordable Prices**

SCAN ME

# అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

అశ్విన్స్
స్పెషాలిటీ హాస్పిటల్స్



ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
**డా॥ జి సూర్యనారాయణ రాజు**
M.S. MCh,FRCS,FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్



ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
**డా॥ రమణి GSV**
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

ప్రతి నెల మొదటి ఆదివారం



ప్రముఖ హెమాటో ఆంకాలజిస్ట్
**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**
MBBS, MD ఇమ్యునో-హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

ప్రతి నెల రెండవ ఆదివారం

**ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.**

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతువిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతల, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

అభినవ్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్,
ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ఉదయం గం॥ 10:30 ల నుండి గం॥ 2:00 ల వరకు

బ్లడ్ క్యాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసరికలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

లోటస్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్,
ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 230555

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

**అపాయింట్మెంట్ కొరకు 94404 45775** | **సీత : +91 9618161032**



భండారు అచ్చమాంబ

'హిందూ సుందరి'

ఎవరు? పత్రిక పేరు.

ఎప్పటిమాట? ఎప్పుడో నూటపాతికేళ్ల నాటిది.

ఆ ప్రస్తావన ఇప్పుడెందుకు?

ఏప్రిల్ నెలలోనే ఆ వనితల పత్రికా సంస్థ సంస్థాపన.

భండారు అచ్చమాంబ, మొసలికంటి రమాబాయమ్మ, వెంపల శాంతాబాయమ్మ, మాడభూషి చూడమ్మ, కళ్లేపల్లె వెంకటరమణమ్మ, బాలాంత్రపు శేషమ్మ... వీరందరి పేర్లూ ఆ పత్రికతోనే ముడివడి ఉన్నాయి, ఇంకా ఎప్పటికీ ఉంటాయి.

ఎందుకంటే – నిర్మాణం, నిర్వహణ, రచన, పర్యవేక్షణ బాధ్యతలన్నీ వారివే కాబట్టి.

అంతకుముందు.. వనితల కోసం వనితలే నడిపిన పత్రికలు లేవా?

ఉన్నాయి. వాటిల్లో ప్రత్యేకించి తెలుసుకోవాల్సింది 'హిందూ సుందరి' గురించే.

ఏమిటీ అంత ప్రత్యేకత?

రచనా, నిర్వహణా ఆ పత్రికలో వెల్లివిరియడం. మహిళామణుల కలంబలం అన్నింటా, అంతటా విస్తరించడం. ఇప్పుడు కాదు – శతాబ్ది, ఇంకా చెప్పాలంటే శతాధిక వసంతాల కిందటే అంతటి మహోదయం. నాటి స్థితిగతులు, అప్పటి పూర్వాపరాలు, అతివల నిపుణతలను విశ్లేషిస్తే.... విశేషాలూ, విశిష్టతలూ అనేకం.

# అక్షర మాధురి

అది 1897. ఆ ఊరు ఏలూరు.


అక్కడ ఒకనాడు ఏర్పాటైంది సమాజ సంస్కరణల నిర్వహణ సభ. ఆ కార్యక్రమానికి ఆ రోజుల్లోనే వందమంది దాకా రచయిత్రులు / కవయిత్రులు హాజరయ్యారు. సమకాలీన అంశాలతో రచనల వేగాన్ని పెంచాలని, అదే సమయంలో క్రియాశీలక వైఖరిని అనుసరించాలనీ నిర్ణయించుకున్నారు.

గృహలక్ష్మి, ఆంధ్రమహిళ, అంతకుముందే సతీహితబోధిని, స్త్రీ హిత బోధిని, తెలుగు జవానా, శ్రీబాలిక వంటి పత్రికలైతే ఉన్నాయి. అవి వెలువడింది రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి. హిందూ సుందరి వ్యవస్థాపన 1902 ప్రాంతాల్లో.

సంపాదకురాలిగా ఉండాలని అచ్చమాంబకు పిలుపు వెల్లింది. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ క్రోడీకరణ కర్తకు సోదరి ఆమె. తెలుగు, హిందీలతోపాటు గుజరాతీ, ఆంగ్లభాషల్లోనూ ప్రవీణ. స్వయంకృషితో సంస్కృత కావ్యాలు, శ్రుతులూ, స్మృతులూ, పలు శాస్త్రాలనూ అవగాహన చేసుకున్న నిపుణ. అందుకే ఆమెకు సంపాదక హోదా గురించి అప్పట్లోనే సంప్రదింపులయ్యాయి.

అనివార్య కారణాలతో ఆమె సమ్మతి తెలపలేదు కానీ, ఆ పత్రికకు రచనలెన్నో చేశారు. సమాజ సమస్యలూ, వాటి పరిష్కార మార్గాల గురించిన చర్చలు జరిపారు. మరి కొన్నాళ్ల తర్వాత– సంపాదక విధులను రమాబాయమ్మ, శాంతాబాయమ్మ చేపట్టారు. నిర్వహణ సౌలభ్యం కోసం పత్రిక కార్యాలయం కంతేరుకు మారింది.

మరోవైపున 'సావిత్రి' అనే పత్రిక కాకినాడ నుంచి మొదలైంది. సంపాదకురాలు పులుగుర్త లక్ష్మీ నరసమాంబ. హిందీ, బెంగాలీ భాషల్లో సైతం నేర్పరి. మరికొంత కాలానికి అనసూయ పేరిట పత్రిక ప్రారంభమైంది. వింజమూరి వెంకటరత్నమ్మ ఎడిటర్‌గా ఉండేవారు చాలాకాలం. బాలికలకు ఉపకరించే శీర్షికలెన్నింటినో తన పత్రికలో ప్రవేశపెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ముదితల చరిత్రలను విపులీకరించి ప్రచురించేవారు.


హిందూసుందరి

దురాచారాల మీద అలుపెరగని ఉద్యమాన్ని కొనసాగించారామె. బరంపురం నుంచి వెలువడిన 'ఆంధ్రలక్ష్మి'కి వెంకటరమణమ్మ సంపాదకురాలు. వనితా వికాసానికి ఎంత చేయాలో అంతా చేశారు.

ఆంధ్ర మహిళ సంపాదకురాలు అనగానే, గుమ్మిడిదల దుర్గాబాయమ్మ గుర్తుకొస్తారు. స్త్రీ జనాభ్యుదయానికి జాతీయ స్థాయిన ప్రత్యేక విధానం ఉండాలని లిఖిత పూర్వకంగా ప్రతిపాదించారు. రాచమల్ల సత్యవతీదేవి నిర్వాహకత్వంలో, సంపాదక సహకారంతో వెలువడిన మరొక పత్రిక 'తెలుగుతల్లి'. అలాగే సూర్యదేవర రాజ్యలక్ష్మి కూడా పత్రిక సంపాదక విధులను నిర్వర్తించారు.

ఇంకా వివిధ పత్రికలు (స్త్రీలవి); ఉండేవి. వీటన్నింటికంటే ముందు నడిచింది

'హిందూ సుందరి'.

ప్రతీ సంచికలోనూ కనిపించిన తొలిపేజీ పద్యం ఇదీ :

***శ్రీ సంభావిత వాక్య సంపదలచే జెన్నొంది సాధ్వీమనో***
***ల్లాసంబేర్పడ సేయుచున్ విమలశీలంబొప్పుగా వైదుషీ***
***వ్యాసంగంబుల వెరవృత్తులెడపున్ భాషాఢ్యయై కాన సం***
***తోషంబొందికొనుండ సుందరులు హిందూ సుందరీ రత్నమున్.***

వాక్య సంపద, వైదుషీ వ్యాసంగం, భాషాఢ్య, తదితర పదప్రయోగాలు నారీజన పురోగమనాన్ని సూచించేవే.

'శారదా కుసుమ సంవాదం'. ఇదొక నాటక రచన. హిందూ సుందరిలోనే ముద్రితం అయింది. రచయిత్రి చూడమ్మ. మానసిక, శారీరక ఎదుగుదలను విపులీకరించే శాస్త్ర జ్ఞాన చైతన్యం స్త్రీలకు అత్యవసరమన్నారు.

ఆడవారికి సమగ్రమైన ఆరోగ్య పరిజ్ఞానం ఉండాలన్నది మరొక రచన సారాంశం. దీని ప్రచురణతోనూ హిందూ సుందరి ఎంతో పేరందుకుంది. విద్యావంతురాలైన అతివ తన బిడ్డలను పరిశుభ్ర వాతావరణంలో పెంచుతుంది. వారి శారీరక ఆరోగ్యానికి పూర్తి ప్రాధాన్యమిస్తుంది. ఈ అంశాలను ఆనాడు నాటక రచన ద్వారా ప్రస్ఫుటంచేసిన రచయిత్రి ఓరుగంటి ఆదెమ్మ.

కందుకూరి రాజ్యలక్ష్మమ్మ. సంఘసేవలో అగ్రగామి. కంతేరు (గోదావరి ప్రాంతం) వాస్తవ్యురాలు. తను నివసించే ఆనందాశ్రమ ఆరామంలోనే ప్రార్థన మందిరాన్ని స్థాపించిన సంస్కర్త. అటువంటి మహనీయ స్మృతి సూచకంగా పద్య కవితను ప్రచురించింది హిందూ సుందరి పత్రిక. కవయిత్రి జూలూరు తులశమ్మ.


***వెలలేని సద్ధర్మ వితతిని బోధించి***
***యజ్ఞాన మడచిన యమ్మయెవరు?***
***ఆర లేని యనుకంపనారసి దుఃఖంబు***
***లపనయించినయట్టి యతివ యెవరు?***
***అట్టి మా రాజ్యలక్ష్మమ్మనలఘునాతిని***
***కాలగతినిట్లు నెడబాస కనల వలసె***
***నకట కాలంబు దాటగా నలవియగునె?***
***ఫాలనేత్రునకయినను బ్రహ్మకైన!***

ఇటువంటి రచనల ప్రచురణతో అనేక ప్రక్రియలను సమాదరించింది పత్రిక. స్త్రీలే పత్రికా ప్రచురణ చేయడమన్నదీ హిందూ సుందరి పత్రికతోనే వ్యవస్థీకృతం అయింది. మన స్వాతంత్ర్య సాధనకు ముందువరకూ ఆ పత్రికకు కొంతకాలంపాటు శేషమ్మ సంపాదకురాలిగా ఉన్నారు. స్త్రీలు తప్పక చదవాల్సిన, చదివి సమగ్రంగా తెలుసుకోవాల్సిన పత్రిక ఇదని ప్రచారం చేస్తుండేవారు. **'ఇది ప్రత్యేకము. హిందూ స్త్రీల కొరకు మాసమునకొకసారి ప్రచురింపబడును'** అని ప్రథమభాగంలోనే ప్రచురించేవారు నిర్వాహక సంపాదకులు.

'స్వవిషయము' అంటూ ఒక సందర్భంలో ఆ పత్రిక రాసిందిలా:

**"ప్రియసోదరీ రత్నములారా! హిందూసుందరి పత్రికకు నానాటికి మంచి దశ కలుగుచున్నది. ఇందుకు అత్యంత కుతూహలము చెందుచున్నాము. నేటికీ 'సుందరి' కి దాదాపుగ ముప్పదిమంది ఉప విలేకరులుగా ఉన్నారు.**

**గోదావరి జిల్లా వల్లూరు సంస్థానాధీశ్వరులగు జమీందారువారి అగ్ర పుత్రికయగు రాజ్యలక్ష్మీ దేవమ్మ తమకు కలిగిన సహజ ఉత్సాహంబున ఒక సమస్యను పూర్తిచేసి పంపిరి. ఆమె విద్యావతి అని వినుటయేగానీ స్వలిఖిత వ్యాసములంగను భాగ్యమిచ్చినది గాదు. ఆమె అనుగ్రహంబున మా 'సుందరి' లక్ష్మీపార్వతుల వెంట జమీందారీ గృహముల స్వేచ్ఛగా సంచరించి, వారందించు వ్యాసముల నూతనాలంకారియై చదువరుల మనంబులాకర్షింపగలదని ప్రకటించుచున్నాము."**



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్



కందుకూరి రాజ్యలక్ష్మమ్మ

గ్రాంథిక భాషలో కొనసాగిన ఆ ప్రకటనా రచన స్త్రీల రచనా శక్తి సంపన్నతను చాటి చెప్తోంది.

ఇక, సంపాదకులు రమాబాయమ్మ, శాంతాబాయమ్మ ఆ పత్రికా ముఖంగా చేసిన విజ్ఞాపనలో ఉపయోగించిన పద మాధురులు:

విద్యావివేక సంపన్నులగు సోదరీ మణులారా!

పత్రికాధిపత్యం వహించిన మా పట్ల

విద్యావతులు అమిత వాత్సల్యముతో సర్వవిధములా తోడ్పాటు అగుదురని కోరుచున్నాము.

ఆనాడు మొదలైన ఆ పత్రిక 1960 తర్వాత కూడా కొనసాగుతూ వచ్చింది. వివిధ కాలాల్లో పలువురు మహిళల సంపాదక సేవలను పొందగలిగింది. ఎన్ని ఆర్థిక అవరోధాలు ఎదురైనా, అనేక విధాల సమస్యలు కలిసికట్టుగా చుట్టుముట్టినా; నిర్వాహక సంపాదకుల ఉమ్మడి కృషి ఫలితంగా 'హిందూ సుందరి' జైత్రయాత్ర కొనసాగించింది.

అర్థశతాబ్దానికి పైగా ఆ పత్రిక దిగ్విజయంగా నడవటమన్నది చరిత్రాత్మకం. ఎంతోమందిని ఉత్తమ సాహితీవేత్తలుగా తీర్చిదిద్దింది. రచనల పరంపరతో సమాజాన్ని ఎంతగానో ముందుకు తీసుకువెళ్లగలిగింది. ఉదాత్త రచనలకు వేదికగా స్థానాన్ని స్థిరపరచుకుంది.

పత్రిక ప్రచురణ మొదలైన దరిమిలా అనేకానేక సంవత్సరాలు రచయిత్రులెందరో లిఖిత దర్శనమిచ్చేవారు. సున్నిత, కీలక సమస్యలను వెల్లడించడంలో; వాటికి పరిష్కార మార్గాలను విశదీకరించడంలో ఆ పత్రికా సంస్థ ఎప్పుడూ ముందే ఉండేది.

స్త్రీ విద్య కలిగించే బహుళ ప్రయోజనాలను సుభద్రమ్మ ఎంతో ప్రభావాత్మకంగా వివరించారు ఒక వ్యాసంలో. బాలికల విద్యకు సంబంధించి తల్లిదండ్రులు వివక్ష చూపడాన్ని కాశీనాథుని రామాబాయమ్మ తీవ్రంగా నిరసించారు. ఆ రచనను సమధిక ప్రాధాన్యంతో ప్రచురించి అగ్రతను నిలబెట్టుకుంది హిందూ సుందరి పత్రిక. వర్తమానం పేరుతో ప్రాంతీయం నుంచి అంతర్జాతీయం వరకు వార్తలెన్నింటినో ప్రచురించి కాంతి మాలికలా వెలుగులోకి వచ్చింది ఆ పత్రిక. వార్తావళి అంటూ నారీజనలోకానికి ఎంతెంతో సమాచారం అందించి 'పత్రిక' అనే మాటకు అర్థ తాత్పర్యాలను వెలువరించింది. అందుకే అనంత ప్రఖ్యాతి!



# మంత్రివర్గ వి

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు మంచి వార్తావనరుగా మారిపోయింది. కేవలం ఇక్కడే కాదు.... కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ అది మీడియాకు పూర్తి స్థాయిలో వార్తా సమాచారాన్ని వండి పెడుతూ ఉంటుంది. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ ఆశావహుల్లో నిరాశను నింపుతోంది.**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా పద్నాలుగు నెలలు గడిచిపోయింది. కానీ, మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ అంటూ దాదాపు ఎనిమిది నెలల నుంచి ఆ పార్టీ ఊరిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితి ఎక్కే విమానం, దిగే విమానం మాదిరిలా మారింది. రేవంత్ రెడ్డి ఢిల్లీ విమానం ఎక్కినప్పుడల్లా, మీడియాలో మంత్రివర్గ విస్తరణ హైలెట్ అవుతుంటుంది. మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్న నాయకులు ఆయనను కలవడం, ఆయన దృష్టిలో పడటం, తమకు అవకాశం కల్పించేలా అధిష్టానంతో మాట్లాడాలని విజ్ఞప్తి చేయడం, ఒకవేళ.. అధిష్టానం ఓకే చెప్పినా.. సీఎంగా అడ్డుపుల్ల వేయొద్దని బతిమిలాడుకోవడం వంటివి కాంగ్రెస్ పార్టీలో సర్వసాధారణం అయిపోయాయి. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పటి నుంచి తిరిగి హైదరాబాద్‌లో అడుగు పెట్టేదాకా విశ్లేషణల మీద విశ్లేషణలు సాగుతూనే ఉంటాయి. దాదాపు ఎనిమిది నెలలుగా మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ గురించి చేయని విశ్లేషణ లేదు. రాయని జర్నలిస్టు లేదు అంటే అతిశయోక్తి కాదు. మంత్రివర్గంలో ఎవరికి చోటు దక్కుతుందనే దానిపై నాయకుల ప్రొఫైల్స్‌ను భూతద్దం పెట్టి మరీ వెతికి పుంఖాను పుంఖాలుగా రాయడం పరిపాటి అయిపోయింది. మొన్నటికి మొన్న.. మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం కూడా ఖరారైందన్న ప్రచారం జరిగింది. అంతేకాదు.. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లే ముందు ఏకంగా రాజ్‌భవన్ అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఉగాది తర్వాత ఏప్రిల్ మూడో తేదీన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుంది. ఆ సమాచారం ఇవ్వడానికే సీఎం రాజ్‌భవన్‌కు వెళ్లారు' అనే వార్తలు షికార్లు చేశాయి. అందరూ నిజమనుకున్నారు. కానీ, రేవంత్ రెడ్డి.. షరా మామూలుగానే ఢిల్లీ వెళ్లి వచ్చారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ అటకెక్కింది. అది ఎప్పుడు అటక దిగుతుందో, ఏ సమయంలో దాని బూజు దులుపుతారో.. ఎప్పుడు కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది.

**అధిష్టానమే చూసుకుంటుంది: రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటి మాదిరిగానే హస్తిన వెళ్లారు. అక్కడ అధిష్టానం పెద్దలను కలిశారని చెప్పుకుంటున్నారు. కలిశారా? లేదా? సమయం ఇచ్చారా?లేదా? అన్నది అంతా రహస్యమే. ఇక.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన తర్వాత రేవంత్ హస్తిన వెళ్లి తిరిగొచ్చారు. ఆ సమయంలో రాష్ట్రమంతటా మంత్రివర్గం విస్తరణపైనే వేడివేడిగా చర్చ నడుస్తోంది. రేవంత్ ఢిల్లీ నుంచి రాగానే రాజ్‌భవన్ ప్రోగ్రాం షెడ్యూల్ ఉంటుందని, కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారన్న చర్చ జరుగుతున్న వేళ.. రేవంత్ రెడ్డి విమానాశ్రయం నుంచి ఇంటికి చేరుకున్నారు. కొందరు జర్నలిస్టులు ఆయనకు ఎదురేగి, ఆయన వాహనం నుంచి దిగగానే.. 'సర్. మంత్రివర్గ విస్తరణ అప్‌డేట్స్ ఏంటి?.. ప్రమాణ స్వీకారం ఇవాళ ఉంటుందా?' అని అడిగారట. ఈ ప్రశ్నతో ఒక్కసారిగా చిరాకు పడిన రేవంత్.. 'ఆ మాట అధిష్టానాన్ని అడగండి..' అంటూ విసురుగా లోపలికి వెళ్లిపోయారట. జర్నలిస్టు సర్కిళ్లలో ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

**ఏప్రిల్ 3వ తేదీ ముహూర్తం ఏమైంది?**

ఈ సారి కూడా ముహూర్తం కూడా ఖరారై మంత్రివర్గ విస్తరణ మూలన పడటం వెనుక కూడా ఎవరికి వారు విశ్లేషణలు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఏప్రిల్ మూడో తేదీన కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని అందరూ భావించారు. తొలివారం గడిచి పోగా, కనీసం రెండో వారంలో కూడా ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. అంటే.. ఇప్పట్లో మంత్రివర్గాన్ని విస్తరించే సూచనలు కనిపించడం లేదని గాంధీభవన్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీకి, కొందరి పేర్లు కూడా ఖరారయ్యాయని చర్చ జరిగింది. కానీ, ఆ ప్రచారమే ఈసారి కేబినెట్ విస్తరణకు బ్రేక్ పడేందుకు కారణమైందన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (మునుగోడు)గడ్డం వివేక్ పేర్లు (చెన్నూరు) ఖరారయ్యాయన్న ప్రచారం వల్లే ఈసారికి విస్తరణ ప్రక్రియ నిలిచిపోయిందన్న చర్చలు నడుస్తున్నాయి.

లెక్క ప్రకారం మంత్రివర్గంలో మొత్తం 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం ముఖ్య మంత్రితో కలిపి 12 మంది మంత్రులు ఉన్నారు.







# స్తరణ ఎండమావేనా...!

ఇంకా ఆరుగురికి మంత్రులుగా అవకాశం ఇవ్వొచ్చు. కానీ, రకరకాల కారణాలతో ఈ పదవులను ఖాళీగా ఉంచారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నెల రోజుల్లోపే ఆ ఆరు మంత్రి పదవులు భర్తీ అవుతాయని అప్పట్లోనే ప్రచారం జరిగినా, వివిధ కారణాలతో వాయిదాలు పడుతూ వస్తోంది. దీంతో మంత్రి పదవులను ఆశిస్తున్నవారు ఉసూరుమంటున్నారు.

**వ్యూహాల్లో చతికిలపడుతున్నారా? :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని చెడగొట్టుకుంటోందన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఇప్పటికే దేశంలో కాంగ్రెస్ రోజురోజుకి ఆదరణ కోల్పోంతోంది. అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య పూర్తిగా పడిపోతోంది. దక్షిణాదిలో తెలంగాణ, కర్ణాటకల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణలో ముఖ్య నేతలను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదన్న ప్రచారం నడుస్తోంది. అందుకే అధిష్టానం కేబినెట్ విస్తరణకులో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఏ సమయంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున ఆయా జిల్లాలకు, కులాలకు, మతాలకు చెందిన వారికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలలో విస్తరణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పెద్దలు భావించారని అనుకుంటు న్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రితో పాటు పార్టీ ముఖ్య నేతలను చర్చలు జరిపిన హైకమాండ్, గత నెలలో మరోసారి పిలిపించింది.

సీఎం రేవంత్‌తోనే కాకుండా, పలువురు పార్టీ ముఖ్య నేతలను కూడా ఢిల్లీకి పిలిపించి చర్చించింది. దాంతో ఏప్రిల్ మూడో తేదీన కేబినెట్ విస్తరణ ముహూర్తం అంటూ ప్రచారం జరగగా, ఆ ముహూర్తం కూడా దాటిపోయింది.

**ఆశావహుల కుస్తీలు :**

మరోవైపు.. మంత్రివర్గంలో చోటు సంపాదించు కునేందుకు ఆశావహులంతా హస్తినలో ప్రయత్నాలు ముమ్మరం చేసుకున్నారు. తమకు ఉన్న మార్గాల గుండా, తమకు ఉన్న ఛానెళ్ల ద్వారా అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకున్నారు. హైకమాండ్ ఆమోదం కూడా తెచ్చుకున్నారు. కానీ, మంత్రివర్గ విస్తరణ ఆగిపోవడంతో వాళ్లంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

**కేబినెట్‌లో అసమతుల్యత :**

వాస్తవంగా చూస్తే... సామాజిక వర్గం కోణంలో, జిల్లాల వారీగా చూసినా కేబినెట్ కూర్పు సరిగా జరగలేదని స్పష్టంగా తెలుస్తుంది. కొన్ని జిల్లాలకు అసలు ప్రాతినిథ్యమే లేకపోగా, కొన్ని జిల్లాల నుంచి ఎక్కువ మంది మంత్రులుగా కొనసాగు తున్నారు. సామాజిక వర్గాల పరంగా కూడా ఒకే జిల్లా నుంచి ఎక్కువ మందికి అవకాశం ఇచ్చారు. అంతేకాదు.. కొన్ని సామాజిక వర్గాలకు కూడా మంత్రివర్గంలో అవకాశం దక్కలేదు. ఇలా కేబినెట్లో అసమతుల్యత కూడా కాంగ్రెస్ పార్టీని వెంటాడు తోందంటున్నారు.

మంత్రివర్గంలో ప్రస్తుతం ఆరు ఖాళీలకు గాను, ఈసారికి నాలుగింటిని భర్తీ చేయాలని భావించారని, వాటిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్‌కు ఇస్తున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆ ఇద్దరికి ఇతర శాసనసభ్యులు అభినందనలు కూడా చెప్పడంతో వారికి మంత్రివర్గంలో బెర్తులు ఖరారయ్యారని అందరూ అనుకున్నారు. అయితే వీరి పేర్లపై పార్టీలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతోనే విస్తరణకు చుక్కపడిందంటున్నారు. ప్రధానంగా రాజగోపాల్ రెడ్డి సోదరుడు ఇప్పటికే మంత్రిగా ఉండటం, గడ్డం వివేక్ ఇంట్లో కూడా ఇప్పటికే ముగ్గురికి పదవులు ఉండటంతో అన్ని అవకాశాలు వారికే ఇస్తారా? అనే ప్రశ్న తలెత్తిందంటున్నారు. మంత్రి పదవిని ఇస్తామనే హామీతోనే ఎన్నికల ముందు ఆ ఇద్దరిని పార్టీలో చేర్చుకున్నప్పటికీ, ఇప్పుడు కేడర్ అడ్డం తిరగడంతో అధిష్టానం పునరాలోచనలో పడిందంటున్నారు. అంతేకాకుండా వీరికి పదవులిస్తే సామాజికంగానూ విమర్శలు తలెత్తే అవకాశం ఉందనే భయం పార్టీలో కనిపిస్తోందని చెబుతున్నారు. అంతే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని చెప్పుకుంటారు. మరోవైపు.. గ్రూపుల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. పైగా.. పార్టీ అధిష్టానమే గ్రూపిజాన్ని పెంచి పోషిస్తుందన్న ప్రచారం కూడా ఉంది. అప్పుడప్పుడూ చోటు చేసుకునే పరిణామాలు కూడా వీటిని బలపరుస్తుంటాయి.

ఇక, మంత్రి వర్గ విస్తరణ క్లైమాక్స్‌కు చేరుకున్న సమయంలో సీనియర్ నాయకుడు జానారెడ్డి లేఖాస్త్రం కూడా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు అడ్డుకట్ట పడేలా చేసిందంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అసలు మంత్రివర్గంలో ప్రాధాన్యత లేకుండా పోయిందని, ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో ప్రధానమని ఆయన లాజికల్ పాయింట్ లేవనెత్తారట.

**ఆ భయమే కారణమా?**

మరోవైపు.. మంత్రివర్గంలోని ఖాళీలన్నిటిని భర్తీ చేస్తే పార్టీలో గ్రూపుల కారణంగా అధిష్టానానికి తలనొప్పులు వస్తాయన్న భయం పార్టీని వెంటాడు తుందంటున్నారు. పార్టీ ముఖ్యనేతల, ఆశావహులను బుజ్జగించేందుకు, వాటిని బూచిగా చూపించేందుకు ఆరు ఖాళీలను అలాగే ఉంచారంటున్నారు విశ్లేషకులు. ఇప్పుడు ప్రచారంలో ఉన్నట్లు నాలుగు మంత్రి పదవులే భర్తీ చేయడం వెనుక వ్యూహం కూడా అదే అంటున్నారు. మరో రెండు పదవులు ఉన్నాయంటూ బుజ్జగించేందుకు పనికొస్తాయన్న ఎత్తుగడ దీని వెనుక దాగి ఉందట.

మరి.. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో కాంగ్రెవ్ పార్టీ అధిష్టానం అయోమయంలో పడిపోయిందా? తన లెక్కలేవీ వర్కవుట్ కావడం లేదా? కేబినెట్ విస్తరణ ఎపిసోడ్‌ను ఇంకెన్నాళ్లు సాగదీస్తారు? కాలమే సమాధానం చెప్పాలి.

**రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నెల రోజుల్లోపే ఆ ఆరు మంత్రి పదవులు భర్తీ అవుతాయని అప్పట్లోనే ప్రచారం జరిగినా, వివిధ కారణాలతో వాయిదాలు పడుతూ వస్తోంది.**


**సుజాత గోపగోని,**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

# నదికి 'నమో' నమః




భారతదేశానికి హిందూదేశమని మరొక పేరు. సింధు నది నుంచి ఉద్భవించినదే 'హిందు' పదమని చెబుతారు. నది పేరే ఈ దేశం పేరుగా స్థిరపడింది. నదులకీ, భారతదేశానికీ ఉన్న బంధం ఎంత సమున్నతమైనదో, పురాతనమో చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు. భారత్ అంటేనే నదుల ఆవాసం. మనది నదీ తీరస్థ సంస్కృతి కూడా. నాలుగు వేదాలలో పురాతనమైన రుగ్వేదం 'నదీస్తుతి సూక్తం' (10.75.5-6) ప్రవచించింది. ఆ స్తుతితో ఆర్యావర్త భౌగోళిక స్వరూపాన్ని నదులతో దర్శింపచేశారు రుషులు. ఓ గంగ! ఓ యమున! అర్జికియ, సుషోమి, పరుష్ణి; ఇంకా అసిక్ని, వితస్థ, మరుద్వతీ.. నా ప్రార్థన వినండి అంటూ సాగుతుంది ఈ సూక్తం. ఇంకా సింధు, యమున తదితర నదుల పేర్లు కూడా వేదాలలో, అష్టాదశ పురాణాలలో వినిపిస్తాయి. ఓ నదీమ తల్లుల్లారా! ప్రవాహంతో ఈ భూమిని తడపండి అని విన్నవిస్తాడు రుషి, ఆ సూక్తంలో. ఇంకా అనేక నదులను వాటి పురాతన నామాలతో స్మరిస్తాడు. గంగ, బ్రహ్మపుత్ర, సింధు హిమాలయాలలో పుడతాయి. గోదావరి, కృష్ణ ద్వీపకల్ప నదులు. ఇవి బంగాళాఖాతంలో కలుస్తాయి. మన పురాణాలు ప్రస్తావించిన నదుల పేర్లే 102. ఇందులో సరస్వతి నది పేరు అత్యధికంగా, దాదాపు 42 సార్లు ప్రతిధ్వనిస్తుంది. గంగ పేరు ఎనిమిది పురాణాలలో వినిపిస్తుంది. గోదావరి, వంశధార, సరయు, అలకనంద, బాహుద, చంద్రభాగలను పురాణాలు ప్రస్తావించాయి.

గంగ లేదా భాగీరథి, జాహ్నవి అంటే మనందరికీ కేవలం ఓ జల ప్రవాహం కాదు, జీవనాధారం (ఆధునిక లెక్కల ప్రకారం గంగా పరీవాహక ప్రాంతం భారతదేశంలో నలభయ్ శాతం). మరొక నది సరస్వతి. జ్ఞానదేవత పేరు. జీవనానికీ, జ్ఞానానికీ ఆధరువుల పేర్లతో మనం నదులను గౌరవించుకుంటున్నాం. గోదావరి, కావేరి, నర్మద, యమున అన్నీ మనకి పూజనీయ జలరాశులే. లక్షలాది సంవత్సరాల నుంచి కోట్లాది ప్రజలకు నదులే జీవనాధారం. కానీ ఈరోజు నది అంటే కాలుష్యానికి ఆలవాలంగా మారిపోయింది. నదులను నాశనం చేసుకునే వినాశకర తరాలు పుట్టుకొచ్చాయి. నదుల పట్ల మన పూర్వికులు నిర్మించిన దృక్పథం తిరిగి రావాలి. ఇది భ్రమ కాదు. అలాంటి దృక్పథమే వాటిని పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచిందన్నది కాలం రుజువు చేసిన సత్యం. ఒక నిత్య సత్యాన్ని ఔదలదాల్చ డానికి భేషజాలు అక్కర్లేదు.

దేశంలో ఆరు ముఖ్య నదుల పరీవాహక ప్రాంతాల క్షాళన కోసం అధ్యయనాలు నిర్వహిస్తామని ఆ మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఎంత ప్రత్యేకమైన సమాచారమో, ఎంత నిర్మాణాత్మకమో వేరే చెప్పక్కర్లేదు. ఎందుకు? కొన్ని దశాబ్దాలుగా దేశంలో నదులపై ఉన్న పవిత్రభావం నేల కోతకు గురైన చందంగా భావ కాలుష్యంలో కొట్టుకు పోయింది. క్షంతవ్యం కాని స్థాయిలో నదీమ తల్లులను మనం కలుషితం చేస్తున్నామన్న కఠోర వాస్తవాన్ని ఇకనైనా గుర్తించాలి. ఇటీవలి కాలంలో నదులను నాశనం చేసుకున్నాం. ఇది నిజం! కాకపోతే ఇన్ని లక్షల కోట్లు వాటి రక్షణకు ఎందుకు వ్యయం చేస్తున్నాం? ఆధునిక భారతదేశంలో నదులకు పడుతున్న దుర్గతికి ఖామ్ పెద్ద ఉదాహరణ. ఇది ఛత్రపతి శంభాజీనగర్ (ఇటీవలి వరకు ఔరంగాబాద్) గుండా ప్రవహిస్తుంది. మెట్ల బావులు, నెహర్ పేరుతో పిలిచే ఆక్వాడక్ట్‌తో కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఆ నగర దాహార్తిని ఈ నదే తీర్చింది. దీనిని రక్షించుకోలేకపోయారు. అంతేకాదు, ఒకనాటి దీని వైభవాన్ని మరచి, మురికికాలువ గానే పరిగణిస్తున్నారు. లక్షల తరాలను ఆశీర్వదించిన నదులు ఇటీవలి తరాలను మాత్రం శపించకుండా ఉండగలవా?

దేశంలో నదీనదాలను మనం దేవతలుగా ఆరాధిస్తాం. అవి మనకి కనిపించే దైవాలు, ప్రాణదాతలు. నదికీ, మానవ మనుగడకీ ఉన్న బంధం ఈ దేశవాసులకి మరింత లోతుగా తెలిసి ఉండాలి. ఎందుకంటే మనది వ్యావసాయక దేశం. మనమంతా కర్షకుల కుటుంబాల నుంచి వచ్చినవారమే. తెలుగు రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలలో వేసవి తరువాత తిరిగి కాలువలు తెరిచినప్పుడు, నీటిని పసుపు కుంకుమతో, పూలతో స్వాగతించడం చాలామందికి అనుభవమే. అలాగే నదులను వివిధ సందర్భాలలో పూజించడం సర్వసాధారణం. ఈ భావనను నిరాకరించే, ఆక్షేపించే విధ్వంసకారులు పెరుగుతున్నారు. కొన్ని నదులను అక్షరాలా కుళ్లు కాలువలను చేసేశారు. ఉదాహరణకు మూసీ. మూసీ మాత్రమే కాదు, కొన్ని పెద్ద నదులు, చాలా వరకు ఉపనదుల ఆరోగ్యం అథఃపాతాళంలో ఉంది. ఇన్ని లక్షల ఎకరాలకు పచ్చదనం పూసే నదులను రక్షించుకోవాలన్న కనీస స్పృహ జనించడం లేదు. ఈ తరాల బుర్రలు ఇంకెంత కుళ్లిపోయాయో కదా!

నాగరికత పెరగడం అంటే, నగరాలు పెరగడమన్న భ్రమ ఇటీవలి కాలపు వికారం. ఇలా ఎందుకు అనుకోవలసి వస్తున్నదంటే నగరాలు పెరిగిన కొద్దీ నాశనమవుతున్నవి నదులే. శరవేగంగా విస్తరిస్తున్న నగరాలతో మొదట బలౌతున్నది నదీనదాలే. సర్వేలు ఘోషిస్తున్న వాస్తవమిది. కొన్ని జనావాసాలు, కొద్దిమందికి జీవనోపాధి కల్పించే కర్మాగారాల మూలంగా లక్షలాది ఎకరాలకు నీరునిచ్చే, కోట్లాదిమందికి ఆహారం అందించే నదులు కలుషితమైనా




'గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ
నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు'

పట్టించుకోనక్కరలేదన్న అసంబద్ధ, విధ్వంసకర దృష్టి చాలాకాలం రాజ్యమేలింది. మురుగు నీరు, వ్యర్థాలు, మలినాలు-ఏ పేరుతో పిలిచినా వీటన్నిటి గమ్యం నదులే. ఇలాంటి ధోరణి సరికాదని ప్రజలు గుర్తించడం లేదు సరే, నదులు నాశనమైతే మానవాళి మనుగడ ఏమిటో గుర్తించవలసిన బాధ్యత కలిగిన పాలనాయంత్రాంగాలు కూడా నిమ్మకు నీరెత్తినట్టే ఉండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నదులను కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తించిన మొదటి ప్రధాని 2014లో వచ్చారు. ఆయన నరేంద్ర మోదీ. అప్పటి నుంచి నదుల ప్రక్షాళన అన్న ఆలోచన కార్యరూపం దాల్చింది. ఫలితంగానే, నదుల స్థితిగతుల మీద అధ్యయనం కోసం ప్రణాళికలు, ఒక కార్యాచరణ ముందుకు వచ్చాయి.

కేంద్రం ప్రకటించిన ఆ ఆరు నదుల ప్రక్షాళన కోసం జరిపే అధ్యయనంలో 12 ప్రముఖ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. నదీ పరీవాహక ప్రాంతాల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను అవి రూపొందిస్తాయి. తరువాత ఆ విధివిధానాల అమలుకు నేషనల్ రివర్ కన్సర్వేషన్ డైరెక్టరేట్; జల్‌శక్తి-ఐఐటీలు, నిట్‌లు, ఐఐఎన్‌సీలు, నీరీ (నాగపూర్) మధ్య ఒప్పందం జరుగుతుంది. పరీవాహక ప్రాంతాల రక్షణకు ఎన్నుకున్న ఆ ఆరు నదులు-నర్మద, గోదావరి, కృష్ణ, కావేరి, పెరియార్, మహానది. నమామి గంగే ఒక అసాధారణ పథకం. దీనితోపాటు గోమతి రివర్‌ఫ్రంట్ పథకం, భారత్ క్లీన్ ఫౌండేషన్, మైథీ నది క్షాళన పథకం కూడా అమలవుతున్నాయి. ఈ నదుల క్షాళన కార్యక్రమంలో నిపుణులు ఇచ్చిన ప్రణాళికలతో పాటు, నమామి గంగే పథకం అనుభవాలను కూడా స్వీకరిస్తారు. వీటన్నిటి సారాన్ని భవిష్యత్తులో చేపట్టే నదుల క్షాళన కార్యక్రమాలకు వినియోగిస్తారు. భారత్ నదుల క్షాళనకు కేంద్రం పట్టుదలతో ఉన్నదన్న విషయాన్ని ఈ పరిణామాలన్నీ వెల్లడిస్తున్నాయి. దీనితో పాటు సరస్సులు, సాగరతీరాల క్షాళనకు కూడా కొన్ని పథకాలు అమలు చేస్తున్నారు. ఢిల్లీ, ఆగ్రా, మధురల గుండా ప్రవహించే యమున; అహమ్మదాబాద్, గాంధీనగర్‌ల గుండా ప్రవహించే సబర్మతి; ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో ప్రవహించే కృష్ణ; నాసిక్‌లో పుట్టి తెలంగాణ, మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు చేరే గోదావరి; కర్ణాటక, తమిళనాడుల గుండా వెళ్లే కావేరి ఏ ఒక్కటి సురక్షితంగా లేవు. మలినాలు, ప్లాస్టిక్ వీటిలోని నీళ్ల ప్రమాణాన్ని అథఃపాతాళానికి తొక్కేస్తున్నాయి.

ఒకసారి నర్మద పరిస్థితి ఎలా ఉందో పరికిద్దాం. 2016లోనే నాలుగు ప్రాంతాల నుంచి తెచ్చిన ఈ నది నీటిని పరీక్షించారు. ఈ నీరు ఎంతమాత్రం ఉపయోగకరం కాదని మధ్యప్రదేశ్ కాలుష్య నియంత్రణ సంస్థ తేల్చి చెప్పింది. పెరిగిన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ నర్మదను అథమ స్థాయికి తీసుకుపోయాయి. ఇప్పుడు ఆ గొప్ప నది నీటి పరిశుభ్రత స్థాయి, ప్రమాణం కేవలం 'సీ' కేటగిరీకి (భారత ప్రమాణాల బ్యూరో లెక్క మేరకు) చేరింది. 2017 వరకు అందిన సమాచారాన్ని బట్టి, మధ్యప్రదేశ్‌లోని 52 నగరాల నుంచి వ్యర్థాలు, మలినాలు, మురుగు నీరు నేరుగా ఈ నదిలోకి వచ్చి పడుతున్నాయి. అవే నదిని దారుణంగా కలుషితం చేసేశాయి. నర్మద రక్షణకు 2016లో బీజేపీ ప్రభుత్వం కొన్ని చర్యలు ప్రారంభించింది. రూ. 1500 కోట్లతో మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించింది. మురుగును నదిలోకి తీసుకుపోయే కాలువలను పునర్ వ్యవస్థీకరించడం, జనావాసాల నుంచి వెల్లువెత్తే చెత్తాచెదారాన్ని నిరోధించడం ఆ ప్లాంట్ ఉద్దేశం. 2016 డిసెంబర్‌లోనే ప్రధాని నరేంద్ర మోదీ నర్మదా సేవా మిషన్ కార్యక్రమం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చురుకుగా పాల్గొని, నర్మదా పరీవాహక ప్రాంతంలో చైతన్యయాత్రను నిర్వహించారు. ఆ యాత్రలోనే ఆయన అనేక సభలలో ఉపన్యసించారు. నదులను కలుషితం చేయవద్దని ప్రజలను వేడుకున్నారు. ఆ యాత్ర సందర్భంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం కూడా ఎంతో విజయం సాధించింది. ఆ యాత్ర సాగిన ప్రాంతమంతా కార్యకర్తలు 7.14 కోట్ల మొక్కలు నాటారు. అంటే నదీ పరీవాహక ప్రాంతమంతా ఆ కార్యక్రమం నిర్వహించారు. నదుల క్షాళన కార్యక్రమంలో అడవుల పెంపకం అంతర్భాగంగా తీసుకురావడం ఉత్తమమైన ఆలోచన.

మనం ఎంతో గొప్పగా చెప్పుకునే గోదావరి పరిస్థితి కూడా నర్మదకు పెద్ద భిన్నంగా ఏమీలేదు. ఇది అత్యంత విషాదకరం. గోదావరి జలాల ప్రమాణం కూడా 2019 నాటికే 'సి' కేటగిరిలో చేరిపోయింది. దీనితో నేషనల్ రివర్ కన్సర్వేషన్ పథకం కింద మోదీ ప్రభుత్వం 2022లో గోదావరి

క్షాళనకు రూ 88 కోట్లు కేటాయించింది. మురుగు నీటి కాలువల పునర్ వ్యవస్థీకరణే ఈ కేటాయింపుల ఉద్దేశం. భూమిలోపల మురుగు నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు ఈ నిధులు ఉపయోగించాలి. అంటే శుద్ధి చేయకుండా ఏ రకమైన నీరు నదిలోకి ప్రవేశించకూడదు.

నదుల క్షాళన చర్యలన్నీ కాగితాల మీదనో, ప్రకటనలలోనో ఉండిపోతున్నాయని అనుకోవడం పొరపాటు. ఇందుకు ప్రబల నిదర్శనం ఎగువ ఉత్తర భారతదేశంలో చేపట్టిన దేవిక పథకం. అసలు ఉత్తర భారతదేశంలో దిగ్విజయంగా పూర్తయిన తొలి నది క్షాళన ఇదేనన్న కీర్తి కూడా దీనికి దక్కింది. దేవిక (ఈ నది గురించి వరాహ, కూర్మ పురాణాలు ప్రస్తావిస్తాయి) పథకాన్ని 2019లో నరేంద్ర మోదీ ప్రారంభించారు. దేవిక నది స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. దేవిక అంటే గంగానది సంతానంగా పరిగణిస్తారు. అక్కడి ప్రజలకు విశ్వాసాల పరంగా ఈ నది ఎంతో కీలకమైనది కూడా. దేవిక జమ్ముకశ్మీర్ (ఉదంపూర్ జిల్లా)లోని కొండలలో సుద్దా మహదేవ్ ఆలయం వద్ద పుట్టింది. అక్కడ నుంచి పడమర దిశగా సాగి, పంజాబ్‌కు చేరుకుని రావి నదిలో కలుస్తుంది. ఈ సంగమ స్థలం పాకిస్తాన్‌లో ఉంది. దేవిక నది క్షాళన పథకం ప్రకారం మురుగునీటి శుద్ధి కోసం మూడు ప్రాజెక్టులు నిర్మించారు. వాటి సామర్థ్యం 8, 4, 1.6 ఎంఎల్‌డీలు. ఆ మురుగు నీటి శుద్ధి వ్యవస్థను 129.27 కిలోమీటర్లకు విస్తరించారు. దీనితో జనావాసాల నుంచి వచ్చిన వ్యర్థాల నిర్వహణ ఎంతో సమర్థంగా జరుగుతున్నది. దేవిక నది క్షాళన పథకంలో రెండు చోట్ల అంత్యక్రియల కోసం ఉద్దేశించిన రేవులు నిర్మించారు. నది రక్షణతో పాటు, పరీవాహక ప్రాంతంలోని పచ్చదనాన్ని రక్షించేందుకు కంచె కూడా నిర్మించారు. మధ్యలో చిన్న చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా నిర్మించారు. మూడుచోట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌లు కూడా కట్టారు.

భారతదేశ నదుల రక్షణ, వాటికి పునరుజ్జీవం కల్పించడానికి జరుగుతున్న ఆ ప్రయత్నం ఇప్పుడు ప్రపంచానికే ఒక మహాద్భుతంగా కనిపిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. ఈ అద్భుతాలు సాధించే అవకాశం ప్రపంచ దేశాలకు కూడా భారత్ ప్రేరణగా నిలుస్తున్న మాట కూడా నిజం. గత ఏడాది దుబాయ్‌లో సీఓపీ 28 శిఖరాగ్ర సదస్సు జరిగింది. అక్కడే భారత్ ప్రపంచ నదీ తీరాల నగరాల అలయెన్స్‌ను (గ్లోబల్ రివర్ సిటీస్ అలయెన్స్) ఆరంభించింది. ఈజిప్ట్, నెదర్లాండ్స్, డెన్మార్క్, ఘనా, ఆస్ట్రేలియా, భూటాన్, కంబోడియా, జపాన్ భారత్ ఆలోచనతో గళం కలిపాయి. దీనికి మూలం నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ పథకమే. ఈ పథకాన్ని మనకంటే ప్రపంచ దేశాల వారే ఎక్కువ అర్థం చేసుకున్నారని అనిపిస్తుంది. ప్రపంచాన్ని పునరుజ్జీవింప చేయడానికి చేపట్టిన 10 పథకాలలో నమామి గంగే పథకానికి కూడా చోటు దక్కింది.

నదుల క్షాళన కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలలోని కొన్ని నదీతీరస్థ నగరాలు కూడా అందిపుచ్చుకున్నాయి. ది హేగ్ (నెదర్లాండ్స్), అడిలాయిడ్ (ఆస్ట్రేలియా), జోల్నాక్ (హంగేరి) ఇందులో ఉన్నాయి. ఈ నగరాలు ప్రపంచంలో నదుల పరిరక్షణ ఉద్యమానికి కొత్త వెలుగును ఇచ్చాయి. ఇవి ఆ పని ప్రారంభించడంతో 11 దేశాలలోని 275కు పైగా నదీ తీరస్థ నగరాలు నదుల క్షాళనకు నడుం కట్టాయి. భారత్ నుంచి మొదలైన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ వంటివి భాగస్వాములయి, తమ వంతు అందిస్తున్నాయి. మన గంగ క్షాళన అలా ప్రపంచాన్ని తాకింది. అంతకు ముందే దేశంలోని నదుల క్షాళనకు గంగ క్షాళన పథకం ప్రేరణగా నిలిచింది. నమామి గంగే పథకం కోసం 2021-26 ఆర్థిక సంవత్సరాలలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ 2652.00 కోట్లు కేటాయించింది. అలాగే నేషనల్ రివర్ కన్సర్వేషన్ డైరెక్టరేట్‌కు, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ పథకాలకు రూ. 22,500 కోట్లు కేటాయించింది.

నమామి గంగే పథకం ఒక సమగ్ర యోజన. నీటి వృథాను అరికట్టడం, ఘన వ్యర్థాల నిరోధం, రివర్ ఫ్రంట్ మేనేజ్ మెంట్ (రేవుల, శ్మశానవాటికల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటివి గంగ, దాని ఉపనదుల క్షాళన వరకు అమలు చేస్తున్నారు) వంటి చర్యలు అందులో ఉన్నాయి. అందులో అంతర్భాగంగానే 450 పథకాలు ఆరంభించారు. ఇందుకు అయ్యే ఖర్చు రూ. 38,438 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో 280 పథకాలను విజయవంతంగా పూర్తి చేశారు. నదుల కాలుష్యానికి ప్రధాన కారణమైన మురుగునీటి చేరిక, పారిశ్రామిక మలినాలు, జనావాసాల నుంచి వచ్చే వ్యర్థాల నివారణకు మౌలిక వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఈ పథకాలన్నింటిలో ప్రధానంగా కనిపిస్తుంది.

వీటికి తోడు 2023లోనే ప్రారంభించిన 'ప్రయాగ్' పథకం కూడా ఉంది.



గోదావరి

దీని ఉద్దేశం నదులలో నీటి ప్రమాణాన్ని నిరంతరం పరీక్షించడమే. మురుగు నీటి వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి ఏర్పాటు చేసిన ప్లాంట్‌ల పనితీరును పరిశీలించడం కూడా. గంగ, యమునలలో కామన్ ఎఫ్లుయింట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, మురుగు నీటి వ్యవస్థ కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్‌ల పని తీరును పరిశీలించడం ఇందులో ఉన్నాయి. దేశంలో నదుల పరిరక్షణకు భారత్ చేపట్టిన చర్యలు పర్యావరణ రక్షణ పరిధిలో ఎంతో కీలకంగా ఉన్నాయి. దీనికి అంతర్జాతీయ సహకారం కూడా ఉంది. నర్మద సేవా మిషన్, దేవిక పథకం, నమామి గంగే పథకాలను చూస్తే భారత్ తన పవిత్ర నదీజలాలను పరిరక్షించు కోవడంతో పాటు, ఈ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలబడే స్థాయికి చేరుకుంది. గ్లోబర్ రివర్ సిటీస్ అలయెన్స్ నదుల సంరక్షణ ఉద్యమంలో భారత్ కీలకం కావడం అందుకే.

దివ్యమైన ఆర్థికవ్యవస్థ, ధరాతలాన్ని తడిపే జల సంపద, రవాణా ద్వారా ప్రపంచంతో ఏర్పడే సంబంధ బాంధవ్యాలు నాగరికతను నిర్దేశిస్తాయి. ఇందుకు మూలం నదులు. ఇప్పటికీ జీవకోటికి ఆధారం నదులే. కాబట్టి నదులను నాశనం చేసుకోకూడదన్న స్పృహ మనిషిగా పుట్టినవారందరికీ ఉండాలి.

*ఆ నో భద్రాః క్రతవో యన్తు విశ్వతో దబ్ధాసో అపరీతాస ఉద్భిదః।*
*దేవా నో యథా సదమిద్వృధే అసన్నప్రాయువో రక్షితారో దివేదివే॥*

(అన్ని దిక్కుల నుంచి ఉన్నత భావాలు నాలో ప్రవేశించుగాక: **రుగ్వేదం**)



# చైనాతో సంబంధాలు నేర్పుతున్న పాఠాలు

**భారత్–చైనాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పాటై ఏప్రిల్ 1 నాటికి సరిగ్గా 75 సంవత్సరాలు. 1950, ఏప్రిల్ 1న రెండు దేశాల మధ్య ఈ సంబంధాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్ "డ్రాగన్– ఏనుగు" కలిసి నాట్యం చేయాలంటూ చేసిన వ్యాఖ్యలు ఎంతో కీలకం. ఎందుకంటే అమెరికాతో వాణిజ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో, భారత్ మాత్రమే తనకు అత్యంత విలువైన మార్కెట్ అన్న విషయం చైనా అధినేతకు బాగా తెలుసు. ఒకవైపు మనతో సంఘర్షిస్తూనే మరోవైపు దౌత్యం నెరపడం చైనాకు వెన్నతోపెట్టిన విద్య.**

నిజం చెప్పాలంటే ఈ రెండు దేశాల నాగరికతలు ప్రపంచంలో అత్యంత పురాతనమైనవి మాత్రమే కాదు, ఇన్ని వేల సంవత్సరాలనుంచి నిరంతరాయంగా కొనసాగుతూ వస్తున్నవి కూడా! ప్రపంచంలో మరే ఇతర నాగరికతలో ఇటువంటి నిరంతరాయత కనిపించదు. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్–చీనీ భాయీ భాయీ నినాదం మనందరికీ తెలిసిందే. అయితే 1962లో చైనా మనదేశంపై జరిపిన దురాక్రమణ కారణంగా రెండు దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 1980–90 మధ్యకాలంలో ఇవి మళ్లీ చిగురించడం మొదలైంది. ఈ నేపథ్యంలో 1993లో ఇరుదేశాల మధ్య శాంతి ఒప్పందం, 1996లో సైనికుల ఆత్మవిశ్వాస నిర్మాణ ఒప్పందం (సీబీఎం) వాణిజ్య వృద్ధిపై ఒప్పందం వరుసగా కుదిరాయి. తర్వాత రెండు దేశాల మధ్య వాణిజ్యం బాగా అభివృద్ధి చెందుతూ 2023–24లో ఏకంగా 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతేకాదు భారత్‌లో చైనా సంస్థల పెట్టుబడుల విలువ 3.5 బిలియన్ డాలర్లు! టాగూర్ శతజయంతి ఉత్సవాలు–2025 వంటి ఈవెంట్ల నిర్వహణ ద్వారా విద్యాపరమైన సంబంధాలతో పాటు, సాంస్కృతిక సంబంధాలు కూడా తిరిగి ప్రారంభమయ్యాయి. బ్రిక్స్, ఎస్.సి.ఒ, జి–20 వేదికలు, ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌లో పరస్పరం సహకరించుకోవడం వంటి బహుపాక్షిక అంశాల్లో రెండు దేశాల మధ్య సమన్వయ సంబంధాలు కొనసాగుతున్నాయి.




**సరిహద్దు సంఘర్షణలు**

ఒకపక్క ఇన్ని రకాలుగా సంబంధాలు కొనసాగుతున్నా రెండు దేశాల మధ్య ఉన్న 3,488 కిలోమీటర్ల సరిహద్దుల వద్ద తరచుగా సైనిక సంఘర్షణలు, ప్రతిష్టంభనలు జరగడం సర్వసాధారణమైంది. ఉదాహరణకు 2017లో డోక్లాం ప్రతిష్టంభన, 2020లో గాల్వన్ ఘర్షణలు, చైనా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ), పాక్ ఆక్రమిత కశ్మీర్–పీవోకే గుండా నిర్మిస్తున్న సీపెక్ వంటివి భారత్–చైనా సంబంధాల్లో 'కంటిలో నలుసు' మాదిరిగా కొనసాగుతున్నాయి. చైనా ప్రారంభించిన బీఆర్ఐ ప్రాజెక్టులో భారత్ భాగస్వామి కాలేదు. పీఓకేలో ఆ దేశం చేపడుతున్న చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ తన సార్వభౌమాధికారాన్ని సవాలు చేయడమే ఇందుకు కారణమని భారత్ కుండబద్దలు కొట్టింది. అంతేకాదు ఇందుకు ప్రతిగా 'ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ కారిడార్'ను 'సాగర్ వ్యూహాన్ని' మనదేశం ముందుకు తెచ్చింది. చైనా ఇదే సమయంలో పాకిస్తాన్‌కు అణుసహకారాన్ని అందిస్తుండటం కూడా మనదేశానికి ఆగ్రహం తెప్పిస్తోంది.

ఇప్పటివరకు రెండు దేశాల మధ్య ఉద్రిక్తలకు కారణమైన సంఘటనల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- పాక్ ఆక్రమిత భూభాగం నుంచి పాకిస్తాన్ కొంత భూభాగాన్ని చైనాకు ధారాదత్తం చేసింది. ఈ ప్రాంతాన్ని భారత్ తనదిగా పేర్కొంటున్నది.
- 1962లో జరిగిన భారత్–చైనా యుద్ధంలో మనదేశానికి చెందిన వెయ్యి మంది, చైనాకు సంబంధించి 800మంది సైనికులు మరణించారు. ఈ యుద్ధంలోనే చైనా మనదేశానికి చెందిన ఆక్సాయ్‌చిన్ ప్రాంతాన్ని ఆక్రమించింది. ఈ యుద్ధం తర్వాత అరుణాచల్ ప్రదేశ్ వద్ద ఇరుదేశాల మధ్య సరిహద్దు రేఖగా వున్న 'మక్‌మోహన్ రేఖ'కు అవతలికి చైనా దళాలు వెళ్లినప్పటికీ, ఆక్సాయ్‌చిన్ ప్రాంతాన్ని మాత్రం తన ఆధీనంలోనే ఉంచుకుంది. ఈ ఆక్సాయ్‌చిన్, చైనాలోని జింజియాంగ్ ప్రావెన్స్‌ను పశ్చిమ టిబెట్‌తో కలుపుతుంది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ రేఖనే వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)గా పేర్కొంటున్నారు.
- 1967లో నాథూలా సంఘర్షణలో ఇరుపక్షాల సైనికుల్లో పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగింది. ఈ సంఘర్షణలు నాథూలా, ఛౌలా పర్వత దారుల్లో జరిగాయి.
- 2017లో డోక్లామ్ పీఠభూమి వద్ద ఇరుదేశాల సైనికుల మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది. ఇక్కడ

చైనా సైనికులు జరుపుతున్న రోడ్డు నిర్మాణాన్ని మన సైనికులు అడ్డుకోవడంతో ఏర్పడిన ప్రతిష్టంభన 73 రోజులపాటు కొనసాగింది.

- 2020 జూన్ 15న లద్దాఖ్ వద్ద జరిగిన ఘర్షణలో 20 మంది మన సైనికులు వీరమరణం పొందగా, చైనాకు చెందిన చాలామంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చైనా ఇప్పటికీ మృతుల సంఖ్యను వెల్లడించలేదు. ఈ సంఘర్షణ గాల్వన్ లోయలో జరిగింది. గత 50 ఏళ్ల కాలంలో రెండు దేశాల మధ్య జరిగిన తీవ్రమైన సంఘర్షణ ఇదే!

**కాజాన్ సదస్సు తర్వాత...**

2024లో కాజాన్ సదస్సు నేపథ్యంలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం తిరిగి ప్రారంభమైంది. రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ మరోవైపు టెలికాం, ఔషధ రంగానికి సంబంధించిన ముడిసరుకులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను చైనానుంచి మనదేశం పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటోంది. రెండుదేశాల మధ్య జరిగే వాణిజ్యం అసమతుల్యంగా అంటే చైనాకే అత్యధికంగా అనుకూలంగా ఉండటం గమనార్హం. దీనికి ప్రధాన కారణం మనదేశ తయారీ రంగానికి సంబంధించిన సరఫరా శృంఖలాలు, పారిశ్రామిక ఉత్పాదకాల ఆవశ్యకత అత్యధికంగా ఉండటమే! ఇదేసమయంలో భారత్ కూడా ముడి ఇనుము, సేంద్రియ రసాయనాలు, ఇతర ముడిపదార్థాలు చైనాకు ఎగుమతి చేస్తుంది. దీన్ని వనరుల చోదిత ఎగుమతి నిర్మాణ వ్యవస్థగా చెప్పవచ్చు. అయితే దిగుమతులపై యాంటీ-డంపింగ్ కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ చైనా విదేశీ వాణిజ్య ఒప్పందాలను అడ్డుపెట్టుకొని తన ఆసియన్ దేశాల భాగస్వాముల ద్వారా భారత్‌కు తన ఎగుమతులు కొనసాగిస్తోంది.

**స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో చైనా ఆధిపత్యం**

ప్రస్తుతం మనదేశంలో స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో ఆధిపత్యం చైనాదే. చైనా సంస్థలు 75% శాతం మార్కెట్‌ను ఆక్రమించేశాయి. ప్రభుత్వం ఒకపక్క నిషేధం విధించినా, మనదేశంలో విద్యుత్ వాహనాల తయారీ సంస్థలు, టెలికాం సంస్థలు తమకు కావలసిన బ్యాటరీలు, టెక్నాలజీకోసం చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. సెమికండక్టర్ల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించాలనుకుంటున్న మనదేశానికి అందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, ఎకోసిస్టమ్ లేకపోవడం పెద్ద అవరోధంగా పరిణమించింది. ఇక డిజిటల్ హార్డ్‌వేర్ దిగుమతులపై ఒక స్పష్టమైన విధానం లేకపోవడంతో సంక్లిష్టమైన మౌలిక సదుపాయాలకు తగిన రక్షణ లేకుండా పోయింది. చైనా నుంచి మనకు సైబర్ దాడుల భయం ఉండనే ఉంది. చామెల్ గ్యాంగ్, ఇతర నేరగాళ్లు మన దేశ ఆరోగ్య రంగం, పవర్ గ్రిడ్ నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే మనదేశం చైనాకు చెందిన 300 యాప్‌లను నిషేధించింది. హువావే సంస్థ 5జి టెక్నాలజీ ప్రవేశాన్ని మనదేశం అడ్డుకుంది. భారత్‌లోని యూనికార్న్ ఎకో సిస్టమ్, హైటెక్ పరిశ్రమల్లో చైనా పెట్టుబడులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయి. 2020లో 18 భారతీయ యూనీకార్న్‌ల్లో చైనా పెట్టుబడులు 3.5 బిలియన్ డాలర్లు! ఇది రెండు దేశాల మధ్య పెట్టుబడుల అనుసంధానతను వెల్లడిస్తోంది.



**కొనసాగుతున్న సవాళ్లు**

ప్రస్తుతం 3488 కిలోమీటర్ల సరిహద్దు విషయంలో ఇప్పటికీ ఇరు దేశాలు ఒక స్పష్టమైన అవగాహనకు రాలేదు. ఫలితంగా పరస్పర చొరబాట్లు, మౌలిక సదుపాయాల విస్తరణను రెండు దేశాలు కొనసాగిస్తున్నాయి. అక్సాయ్‌చిన్ ప్రాంతంలో చైనా 38వేల చదరపు కిలోమీటర్ల మేర మన భూభాగాన్ని కబ్జా చేసింది. అరుణాచల్ ప్రదేశ్‌లో 90వేల చదరపు కిలోమీటర్ల భూభాగం తమదేనని వాదిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా చైనా పేర్కొంటున్నది. సరిహద్దు ప్రాంతాల్లో రెండు విధాలుగా ఉపయోగపడే రీతిలో చైనా చేపడుతున్న గ్రామాల నిర్మాణాన్ని భారత్ 'సలామీ స్లైస్'గా పరిగణిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంట పరస్పరం అంగీకరించిన మ్యాప్‌లు లేకపోవడంతో పెట్రోలింగ్ విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. 2020 గాల్వన్ సంఘటన తర్వాత రెండు దేశాల మధ్య పరస్పర విశ్వాసం దెబ్బతిన్నదనే చెప్పాలి. ఇప్పటికీ మనదేశం చైనా గుంటనక్క వ్యవహారశైలిని నమ్మడం లేదు. ఈ నేపథ్యంలో పరస్పర విశ్వాస స్థాయిలు చాలా దిగువనే ఉన్నాయని చెప్పక తప్పదు.

బ్రహ్మపుత్ర, సట్లెజ్ నదులను ఎగువన ఉన్న చైనా నియంత్రించడం ఎప్పటికీ మనకు ఇబ్బంది కలిగించే అంశమే. చైనా బ్రహ్మపుత్రపై మెడాగ్ (గతంలో దీన్ని జాంగ్మూ డ్యామ్ అని పిలిచేవారు) డ్యామ్‌ను భారత్‌తో ఎటువంటి సంప్రదింపులు జరపకుండానే నిర్మించడానికి ఉద్యుక్తమవుతోంది. సముద్ర సిల్క్ మార్గం ద్వారా శ్రీలంక, మాల్దీవులు, మయన్మార్‌లతో చైనా సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా అనుసరిస్తున్న 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్' వ్యూహం భారత్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇక అణుసరఫరా గ్రూపులో మనదేశం ప్రవేశించకుండా చైనా ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. ఇదే సమయంలో ఐక్యరాజ్య సమితిలో మనదేశానికి శాశ్వత సభ్యత్వం రాకుండా నిరోధిస్తోంది. ఐక్యరాజ్య సమితి ఆంక్షల కమిటీలు పాకిస్తాన్ ఉగ్రవాదులను నిషేధించకుండా అడ్డుకుంటూ మనదేశానికి ఇబ్బందులు సృష్టిస్తోంది.

అయితే భారత్-చైనాలు జీ-20, బ్రిక్స్ వేదికల ద్వారా వాతావరణ దౌత్యం, విపత్తు సహాయకచర్యలు, ప్రపంచ ఆరోగ్య నిర్వహణ వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భారత్ ముందుకు తెచ్చిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు చైనా మద్దతిస్తోంది. ఏఐఐబి, న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) వంటి బహుపాక్షిక బ్యాంకింగ్ వ్యవస్థల విషయంలో రెండు దేశాల మధ్య సహకారం కొనసాగుతోంది.

**భారత్-చైనాల సంబంధాల్లో తాజా పరిణామాలు**

రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలపై ఒప్పందం కుదిరి 75 సంవత్సరాలు దాటుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని డెప్సాంగ్, డెమ్‌చౌక్ ప్రాంతాలనుంచి సైనికులను ఉపసంహరించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. 23వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి సమావేశం 2025లో జరిగింది. వైస్-ప్రీమియర్, మన విదేశాంగశాఖ కార్యదర్శి మధ్య బీజింగ్‌లో చర్చలు జరిగాయి. సరిహద్దు విషయంలో వాస్తవాల ఆధారంగా సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. 2024లో కాజాన్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశం సందర్భంగా నరేంద్రమోదీ-జిన్‌పింగ్‌ల భేటీ జరిగింది. గత ఐదేళ్లకాలంలో ఇరుదేశాధినేతల మధ్య లాంఛనంగా జరిగిన తొలి సమావేశమిది. ముఖ్యంగా దారుణంగా దెబ్బతిన్న సంబంధాలను తిరిగి గాడిలో పెట్టడానికి జరిగిన ప్రయత్నంగా చెప్పవచ్చు. బ్రహ్మపుత్ర, సట్లెజ్ నదులకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, 2025 వేసవి నుంచి కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభించడానికి అంగీకారం కుదిరింది. సంక్షోభానంతర కాలంలో రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగు

**వాస్తవాధీన రేఖ వెంట శాంతి నెలకొనాలంటే చైనా తన సైన్యాలను పూర్తిస్థాయిలో వివాదాస్పద ప్రాంతాల నుంచి ఉపసంహరించాలని భారత్ కోరుతోంది. ముఖ్యంగా 2020లో చోటుచేసుకున్న సంఘర్షణల వంటివి సమస్యను పరిష్కరించలేవని కుండబద్దలు కొట్టింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ), బ్రిక్స్ వేదికల ద్వారా పరస్పరం విశ్వాసం పాదుకునే రీతిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.**



పరచడానికి ఈ చర్యలు ఉపకరించాయి.


**రెండు దేశాల మధ్య పోటీ**

21వ శతాబ్దంలో భారత్–చైనాలు బలమైన ఆర్థిక వ్యవస్థలుగా రూపొందేందుకు పోటీపడుతున్నాయి. ఇప్పటివరకు ఈ పోటీ అసమతుల్యంగానే ఉన్నదని చెప్పాలి. 1987 నుంచి 2023 మధ్య కాలంలో చైనా ఆర్థిక వ్యవస్థ 272 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 17.7ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ఇదే మనదేశం 279బిలియన్ డాలర్లనుంచి ఇంకా 3.79 ట్రిలియన్ డాలర్ల వద్దే కునారిల్లుతుండటం గమనార్హం. ముఖ్యంగా పరిశీలిస్తే 1987లో మనదేశ ఆర్థిక వ్యవస్థ చైనాతో పోలిస్తే బలీయంగా ఉంది. దురదృష్టవశాత్తు ముందుచూపులేని, దేశ ఆర్థికాభివృద్ధిని పెద్దగా పట్టించుకోని పార్టీల నిర్లక్ష్య పాలన కారణంగా మనం ఇంకా అట్టడుగున కునారిల్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఇరుదేశాల మధ్య సరిహద్దుల వద్ద శాంతి ఒప్పందం కుదిరింది 1993లో అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు హయాంలోనే. దేశ ప్రయోజనాలను చక్కగా విశ్లేషించి తీసుకున్న ఈ నిర్ణయం విషయంలో అన్ని పార్టీల మద్దతు పొందగలిగారు. నిజం చెప్పాలంటే చైనా విషయంలో, మనదేశ ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా వ్యవహరించడం ప్రారంభమైంది పి.వి. హయాం నుంచే. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. భారత్–యుఎస్ఎస్ఆర్‌ల మధ్య బలీయమైన స్నేహసంబంధాలు చైనాకు అప్పట్లో ఇష్టం ఉండేది కాదు. అందుకనే పాకిస్తాన్‌ను అక్కున చేర్చుకోవడం మొదలుపెట్టింది. నిజానికి 1950లో చైనా టిబెట్‌ను ఆక్రమించడం భారత్‌లో ఆగ్రహావేశాలకు కారణమైంది. అప్పటి డిప్యూటీ ప్రధాని సర్దార్ వల్ల భాయ్ పటేల్, చైనాను శత్రువుగా పరిగణించాలని చేసిన సూచనను నెహ్రూ తోసిపుచ్చారు. 1954లో ఇరుదేశాల మధ్య పంచశీల ఒప్పందం కుదిరిన తర్వాత, ఐదేళ్లకు అంటే 1959లో టిబెట్ రాజధాని లాషాలో చైనా వ్యతిరేక అల్లర్లు చెలరేగడం, దలైలామాకు భారత్ ఆశ్రయమివ్వడం మనదేశంపై ఆ దేశం అనుమానాలను పెంచుకోవడానికి దోహదం చేశాయి. తర్వాత 1962లో చైనా భారత్‌పై దాడిచేసి ఆక్సాయ్‌చిన్‌లో 38వేల చదరపు కి.మీ.ల భూభాగాన్ని ఆక్రమించుకోవడం, నెహ్రూ చైనాను గుడ్డిగా నమ్మిన ఫలితమే! వల్లభాయ్ పటేల్ హెచ్చరికలను బేఖాతరు చేసిన నెహ్రూ నిర్లక్ష్యం కారణంగా పెద్దఎత్తున మన భూభాగాన్ని కోల్పోవాల్సి వచ్చింది. టిబెట్–ఇండియాల మధ్య సరిహద్దుకు సంబంధించి నాటి బ్రిటిష్ ప్రభుత్వం, మక్‌మోహన్ రేఖను ప్రతిపాదిస్తూ 1914లో చేసిన సిమ్లా ఒప్పందాన్ని చైనా అంగీకరించలేదు. అయితే నెహ్రూ పీపుల్స్ రిపబ్లిక్ చైనాతో సన్నిహిత సంబంధాలను కొనసాగించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని అనుకున్నారు. కానీ గుంటనక్క చైనా 1962 యుద్ధం రూపంలో మనకు వెన్నుపోటు పొడిచింది, ఇప్పటికీ స్నేహం ముసుగులో పొడుస్తూనే ఉంది. నెహ్రూ, మావోల మరణం తర్వాత 1978లో అధికారంలోకి వచ్చిన డెంగ్ జియోవో పింగ్ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడం, అమెరికా వంటి పాశ్చాత్య దేశాలు చైనాలో విపరీతంగా పెట్టుబడులు పెట్టడంతో దేశాభివృద్ధి జెడ్‌స్పీడ్‌తో ముందుకు సాగడమే కాదు చైనా ప్రపంచ తయారీకేంద్రంగా రూపొందడానికి దోహదం చేసింది. ఇదే సమయంలో మనదేశంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు దేశాభివృద్ధికి దోహదం చేయలేదు. అదే మనం చైనాతో పోలిస్తే వెనుకబడి పోవడానికి ప్రధాన కారణం. ఇక ప్రస్తుత విషయానికి వస్తే, తానొక ఆధిపత్య దేశంగా ఎదగాలనుకుంటున్న చైనాకు, మనదేశం పశ్చిమ దేశాలు ముఖ్యంగా యు.ఎస్.తో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం సుతరామూ ఇష్టంలేదు. ఇక భారత్ పరంగా ఆలోచిస్తే, నేడు మనదేశం ఎంతో బలోపేతమైంది. 1962 తర్వాత జరిగిన ప్రతి ఘర్షణలో చైనా చిత్తుగా ఓడిపోయింది. పెద్ద సంఖ్యలో సైనికులను కోల్పోయింది కూడా.

**ద్వైపాక్షిక సంబంధాలు బలపడాలంటే...**


వాస్తవాధీన రేఖ వెంట శాంతి నెలకొనాలంటే చైనా తన సైన్యాలను పూర్తిస్థాయిలో వివాదాస్పద ప్రాంతాల నుంచి ఉపసంహరించాలని భారత్ కోరుతోంది. ముఖ్యంగా 2020లో చోటుచేసుకున్న సంఘర్షణల వంటివి సమస్యను పరిష్కరించలేవని కుండబద్దలు కొట్టింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ), బ్రిక్స్ వేదికల ద్వారా పరస్పరం విశ్వాసం పాదుకునే రీతిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) వల్ల ప్రయోజనాలను కొనసాగిస్తూనే, చైనా ద్వారా సరఫరాల శృంఖలాల విషయంలో బహుముఖ వ్యూహాన్ని భారత్ అమలు చేయాలి. సరిహద్దు వద్ద వ్యూహాత్మక రోడ్ల నిర్మాణం, ఏఎల్‌జీలు, నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ముఖ్యంగా చైనా సైనికుల మోహరింపుపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు ఇవి ఉపయోగకరం. అమెరికా నుంచి 31 ప్రెడేటర్ డ్రోన్‌ల కొనుగోలు ఒప్పందాన్ని మనదేశం 2024 అక్టోబర్‌లో కుదుర్చు కుంది. ముఖ్యంగా అత్యంత ఎత్తైన హిమాలయా పర్వత ప్రాంతాల్లో నిఘావ్యవస్థను పటిష్టం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇటీవలి కాలంలో అండమాన్–నికోబార్ ద్వీప సమూహాల వద్ద చేపడుతున్న చర్యలు, ఆసియన్ దేశాలతో సమన్వయ సహకారాలు, చైనా నౌకాదళం దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి దోహదం చేయగలవు.

నేపాల్, భూటాన్, శ్రీలంక దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టడం ద్వారా చైనా అమలుచేసే బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని వచ్చు. సైనిక కమాండ్‌లు, దౌత్య వర్గాల మధ్య హాట్‌లైన్ సదుపాయాన్ని కల్పించడం ద్వారా సమస్య ఉత్పన్నమైనప్పుడు తక్షణం స్పందించి పరిష్కరించడానికి వీలవుతుంది. వాస్తవాధీన రేఖ స్థాయిలో ఉత్పన్నమయ్యే సంక్షోభాలను పరిష్కరించడానికి, ఉమ్మడి శిక్షణ, ఉద్దీపన ప్రొటోకాల్స్‌ను అనుసరించడం వల్ల ప్రయోజనముంటుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సెమికం డక్టర్లు, ఏపీఐలు, సోలార్ పరికరాల అమరికను పి.ఎల్.ఐ. డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద ఏర్పాటు చేయడం. స్పేస్ టెక్నాలజీ, సెమికండక్టర్ రంగంలో స్వావలంబన సాధించడం వల్ల, చైనా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడటం తగ్గుతుంది. చైనాతో సంబంధాలను కొనసాగిస్తూనే, క్వాడ్‌తో సన్నిహితంగా ఉండటం కూడా వ్యూహాత్మకంగా మనకు అవసరమే.



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్




**ఒక రాజు పాలనకు మనం కట్టే విలువ దేని మీద ఆధారపడి ఉంటుంది? చారిత్రక ఆధారాలన్నీ మన ముందు ఉన్నప్పుడు ఎవరికి వారే ఆ అంచనాలు వేసుకోవచ్చు. ఎవరు ఎలా చెప్పినా విజయనగరం చరిత్రలోనే కాదు మొత్తం తెలుగువారి హృదయాల మీద చెరగని ముద్ర వేసిన రాజు శ్రీ కృష్ణదేవరాయలు, కృష్ణ దేవరాయలెవరన్న ప్రశ్నకు తమ వాడు కాదన్న ఊహే తెలుగువాడు తట్టుకోలేడు, అంగీకరించ లేడు. కాని ఇది నిజం,ఆయన కన్నడవాడు.**

మనం చరిత్రను చూసే పరిశీలించే విశ్లేషించే పద్ధతుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. నూతన దృక్కోణాలు ఏర్పడ్డాయి. ఏ కాలంలో ఏ పాలనలో ప్రజలు ఎంత సుఖపడ్డారు. సామాన్య ప్రజానీకానికి జరిగిందేమిటి? అది స్వదేశీయుల పాలనా? విదేశీయుల పాలన? ఏదయినా ప్రజల దృష్టి ఏమిటి? వంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. రాజవంశాల ఉత్పత్తులూ, వారి విజయాలూ, పరాజయాలూ కూడా చరిత్ర వస్తువులే. రాజకీయ చరిత్రతో పాటు సామాజిక చరిత్ర ప్రధానమే. ఈ రెండింటి మేళవింపుగానే చరిత్ర గమనం ఉంటుంది.

విశ్వనాథ నాయకుడు మధురై నాయక వంశస్థాపకుడు. ఇతడు గరికపాటి కుటుంబీకుడు. కృష్ణదేవరాయలకు నమ్మకస్తుడైన సేనాని. కాని ఇదే సమయంలో విశ్వనాథ నాయకుని తండ్రి కోటిగం నాగమనాయకుడు మధురపైకి దండెత్తాడు. గెలిచాక కృష్ణదేవరాయలకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. దానిని అణచి వేసింది విశ్వనాథ నాయకుడే. తానే స్వయంగా తన తండ్రిని పడగొట్టి మధురను చక్రవర్తి కృష్ణదేవ రాయలుకి అప్పగించాడు. దానికి ప్రతిఫలంగా రాజు మధుర రక్షకునిగా, మధురై కొన్ని ఇతర తమిళప్రాంతాలను కలిపి దానికి గవర్నర్‌గా విశ్వనాథ నాయకుని ప్రకటించారు. తద్వారా మధురై నాయకరాజ్యం ఏర్పడింది.

| | |
|---|---|
| **విశ్వనాథ నాయక్** | **1529-1563** |
| **కుమార కృష్ణప్పనాయక్** | **1563-1573** |
| **జాయింట్ రూలర్స్ 1వ గ్రూపు** | **1573-1595** |
| **జాయింట్ రూలర్స్ 2వ గ్రూపు** | **1595-1602** |
| **ముత్తు కృష్ణప్పనాయక్** | **1602-1609** |
| **ముత్తు వీరప్పనాయక్** | **1609-1623** |
| **తిరుమల నాయక్** | **1623-1659** |
| **ముత్తు అలకాద్రినాయక్** | **1659-1662** |
| **చొక్కనాథ నాయక్** | **1662-1682** |
| **రంగకృష్ణ ముత్తు వీరప్ప నాయక్** | **1682-1689** |
| **రాణి మంగమ్మాళ్ (రీజెంట్ రూలర్)** | **1689-1704** |
| **విజయరంగ చొక్కనాథ నాయక్** | **1704-1131** |
| **క్వీన్ మీనాక్షి (రీజెంట్ రాణి)** | **1731-1736** |

విజయనగర సామ్రాజ్య పతనానంతరం తెలుగు సాహిత్యాన్ని పోషించి, తెలుగు సాహిత్యంలో తమకంటూ స్థానం సంపాదించుకున్నవారు ఈ నాయకరాజులు. కాని వస్తువు విషయంలో విలువలను విడిచిపెట్టి శృంగార వర్ణనలు చేశారన్న కారణంతో బ్రిటిష్ ఇండియా పాలనా కాలం నాటి పలువురు సాహిత్యవేత్తలు ఈ యుగాన్ని క్షీణయుగమని వ్యవహరించారు. ఈ అభిప్రాయం వలసవాద ప్రభావితులైన వారి ధోరణివల్ల వ్యాపించిందని నేటి సాహిత్యవేత్తల అభిప్రాయం. కాని ఈ యుగానికి చెందిన ప్రముఖ కవుల్లో త్యాగరాజు, కంకంటి పాపరాజు, కనుపర్తి అబ్బయామాత్యుడు, కూచుమంచి తిమ్మకవి, కూచుమంచి జగ్గకవి, ఆడిదము సూరకవి, కుందవరపు కవి చౌడప్ప మొదలైన ఎందరో కవులు కూడా ఉన్నారు.

మధురై నాయకులు ఒక తెలుగు రాజవంశం వారు. ఆధునిక తమిళనాడులోని మధురై, తిరుచునాపల్లి రాజధానిగా చేసుకుని పరిపాలించారు. సుమారు రెండు శతాబ్దాల పాటు నాయక రాజవంశం పరిపాలించింది. (క్రీ.శ.1529-1736). వీరు కళలు, సంస్కృతి, పరిపాలనా సంస్కరణలు, ఢిల్లీ సుల్తానులు నాశనం చేసిన దేవాలయాల పునరుద్ధరణ, ప్రత్యేకమైన నిర్మాణశైలి వారి ప్రత్యేకత. ఈ రాజవంశంలో 13వ మంది పాలకులున్నారు. వారిలో తొమ్మిది మంది రాజులు,


తెలుగు

తెలుగు

ఇద్దరు రాణులు,ఇద్దరు ఉమ్మడి రాజులు (జాయింట్ రూలర్స్). వారిలో ప్రముఖులు రాజు తిరుమల నాయక, రాణి మంగమ్మాళ్. ప్రధానంగా డచ్చ్, పోర్చుగీసువారితో విదేశీ వాణిజ్యం నిర్వహించి సంపన్నులయ్యారు.

రాణిమంగమ్మ (1689-1709) ముత్తు వీరప్పకుమారుడు విజయరంగ చొక్కనాథుడు మిక్కిలి పసివాడైనందువలన పితామహి మంగమ్మ రాజ్యభారం తీసుకోవలసి వచ్చింది. ఈమె మిక్కిలి సమర్థురాలు, దూరదృష్టి కలది. ఆమెకడ నరసప్పయ్య అను తెలుగు నియోగి బ్రాహ్మణుడు మంత్రిగా దళవాయిగా ఉండి రాజ్యయంత్రాంగాన్ని సమర్థంగా నిర్వహించేవాడు. ఆ నాటికి దక్షిణ ప్రాంతంలోని బీజాపూర్, గోల్కొండ రాజ్యాలను ఔరంగజేబు నాశనం చేశాడు. శివాజీ కుమారుడు శంభాజీని మొగల్ చక్రవర్తి దారుణంగా చంపించాడు. తన





మంగమ్మ నీటిపారుదలకు కాలువల నిర్మాణం, కొత్త రోడ్ల నిర్మాణం, రహదారికి ఇరువైపుల చెట్లు నాటడం, ఎన్నో భవనాలు, దేవాలయాలు నిర్మించారు. తుముక్కం వద్ద నిర్మించిన స్ప్రింగ్ పేలస్‌ను కూడా ఆమే నిర్మించారు. ఇప్పుడు ఈ పేలస్‌లోగాంధీ మెమోరియల్ మ్యూజియం నిర్వహిస్తున్నారు. కేప్ కొమరిన్ నుండి హైవే ఈమె కాలంలోనే నిర్మించారు. దానిని ఇప్పుడు రాణి మంగమ్మాళ్ సలై అని పిలుస్తారు. రాణి మంగమ్మాళ్ మొదటిసారి మీనాక్షి ఆలయంలో ఉంజల్ పండుగను తమిళ నెల 'అప్పి'లో జరుపుకుంది. ఉత్సవాల సందర్భంగా రాజ కుటుంబీకులందరూ పాల్గొని మీనాక్షి అమ్మన్‌కు నివాళులర్పించారు.

# ప్రజలకు తెలియని రాణి మంగమ్మ

బలహీనతను గుర్తించిన మంగమ్మ తప్పని పరిస్థితుల్లో ఔరంగజేబు చక్రవర్తి అధికారం అంగీకరించి కప్పం కట్టేందుకు ఒప్పుకొన్నది. ఆమె మిక్కిలి నేర్పుతో రాజ్యం పాలించింది. అనేక దానధర్మాలు చేసి చరిత్ర ప్రసిద్ధమయింది.

మంగమ్మ రాజ్యానికి వచ్చేనాటికి ఎటుచూసినా శత్రువులే. దక్కన్ సుల్తానులు, మరాఠాలు, తంజావూరు నాయకులు, మొగలులు, దక్షిణాన తిరువాన్కూరు రాజు కప్పం కట్టడం మానేశాడు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల నుండి దేశాన్ని రక్షించిన ఘనత తెలుగు రాణి మంగమ్మది.

మంగమ్మ చంద్రగిరి నాయకరాజు తుపాకుల లింగమనాయకుని కుమార్తె. ఇతడు మధుర చొక్కనాథ నాయకుడి దగ్గర సైన్యాధిపతి. తన కుమార్తె మంగమ్మను చొక్కనాథ నాయకునకిచ్చి వివాహం చేశాడు. 1682లో చొక్కనాథుడు మరణించాడు. వెంటనే అతని కుమారుడగు "రంగకృష్ణ ముద్దు వీరప్పనాయకుడు రాజయ్యాడు. కాని రాజైన కొన్ని నెలలలోనే మరణించాడు. నాటికి ఇతని భార్య గర్భవతి. అతి కష్టం మీద మంగమ్మ సతీ సహగమనాన్ని ఆపింది. కాని బిడ్డకు జన్మనిచ్చిన 3 నెలలకే ఆమె మరణించింది. మూడు నెలల పసిగుడ్డును సింహాసనంపై కూర్చుండ బెట్టి మంగమ్మే రాజ్య భారాన్ని స్వీకరించింది. 1689 నుండి 1705 వరకు సమర్థమైన పరిపాలనను అందించింది. రామనాథపురం రాజు రఘునాథ సేతుపతి స్వతంత్రుడయ్యాడు. బయట నుండి ఏ విధమైన సహాయం లేకున్నా తన తెలివి తేటలతో మధుర రాజ్య గౌరవాన్ని నిలిపింది. 1697లో తిరువాన్కూర్ రాజు రవివర్మను సైనిక చర్య ద్వారా లొంగదీసుకుని కప్పం కట్టేటట్టు చేసింది. దళవాయి నరసప్పయ్య సహాయంతో మరాఠా రాజు షాజీని ఓడించి కాళ్ల బేరానికి వచ్చేటట్టు చేసింది. మైసూరు రాజు చిక్క దేవరాయులు మధురకు చెందిన సేలం, కోయంబత్తూరులను ఆక్రమించగా వారిపై దాడి చేసి వారిని దారిలోకి తెచ్చింది. కాని దురదృష్టవశాత్తూ 1702లో రామనాథపురం రాజు రఘునాథ సేతుపతిపై దాడి చేయగా ఆ యుద్ధంలో దళవాయి నరసప్పయ్య మరణించాడు. ఆ మరణంతో మంగమ్మ పరాజయం పాలైంది.


మంగమ్మ నీటిపారుదలకు కాలువల నిర్మాణం, కొత్త రోడ్ల నిర్మాణం, రహదారికి ఇరువైపుల చెట్లు నాటడం, ఎన్నో భవనాలు, దేవాలయాలు నిర్మించారు. తుముక్కం వద్ద నిర్మించిన స్ప్రింగ్ పేలస్‌ను కూడా ఆమే నిర్మించారు. ఇప్పుడు ఈ పేలస్‌లో గాంధీ మెమోరియల్ మ్యూజియం నిర్వహిస్తున్నారు. కేప్ కొమరిన్ నుండి హైవే ఈమె కాలంలోనే నిర్మించారు. దానిని ఇప్పుడు రాణి మంగమ్మాళ్ సలై అని పిలుస్తారు.

రాణి మంగమ్మాళ్ మొదటిసారి మీనాక్షి ఆలయంలో ఉంజల్ పండుగను తమిళ నెల 'అప్పి'లో జరుపుకుంది. ఉత్సవాల సందర్భంగా రాజ కుటుంబీకులందరూ పాల్గొని మీనాక్షి అమ్మన్‌కు నివాళులర్పించారు.

ఇన్ని విజయాలు సాధించిన ఈ తెలుగు రాణి మంగమ్మ మరణం వివాదస్పదమైంది. 1704లో యుక్త వయస్సు వచ్చిన మనుమడు సింహాసనాన్ని అధిష్ఠించడానికి ఆమె సుముఖంగాలేక పోవడంతో వారి ప్రధానమంత్రి అచ్చన్న సహాయంతో విజయరంగ చొక్కనాథ నాయకుడు ఈమెను బంధించి ఉరి తీయించాడని ప్రతీతి. ఆమె మరణంపై ఎన్ని అభిప్రాయాలున్నా ఆమె 18 సంవత్సరాల కాలం సంక్షేమ కార్యక్రమాలతో అంకిత భావంతో పనిచేసినా ప్రజలు మరచిపోయిన తెలుగురాణి మంగమ్మ.

**మూలం:**


1. మధుర తంజావూరు నాయకరాజుల నాటి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర బై నేలటూరి వెంకటరమణయ్య పేజీ నెం.11.
2. The Hindu : A town by the vaigai dt.17.08.2008
3. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి బై ఖండవల్లి లక్ష్మీ రంజనం, భాలేందు శేఖరం – పేజీ. 384
4. రీజెంట్ రాణి: మైనర్ల తరుపున పరిపాలించిన వారు.

**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

**విపక్ష నేతలు దేశ సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందంటూ గగ్గోలు పెడుతూ, జాతీయ సమైక్యతకు తూట్లు పొడుస్తూ, ప్రమాదకర రాజకీయాలకు తెరలేపుతున్నారు. భిన్న సంస్కృతి, చరిత్ర, బహు భాషలతో భిన్నత్వంలో ఏకత్వంగా సమైక్యంగా ఉండే భారతీయులను ప్రాంతాల పేరుతో విభజించడానికి కుట్రలు ప్రారంభమయ్యాయి. దశాబ్ద కాలంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ఆశయాలను ఒక్కొక్కటి పూర్తి చేస్తూ రోజురోజుకు ప్రజాదరణ పొందుతుండడంతో భవిష్యత్తులో తమ మనుగడకే ముప్పు ఏర్పడుతుందనే అభద్రతా భావంతో, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అభూత కల్పనతో, అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లు దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం తరపున ఎలాంటి ప్రక్రియ ప్రారంభించకపోయినా, ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా బీజేపీని లక్ష్యంగా చేసుకొని చెన్నయ్ వేదికగా జాయింట్ యాక్షన్ కమిటీ – జేఏసీ పేరుతో దేశ విభజన కుట్రలకు కొన్ని రాజకీయ పార్టీలు నాంది పలికాయి.**

# పునర్ 'విభజన' రాజకీయాల చిచ్చు



నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే నెపంతో డీఎంకే చెన్నయ్‌లో ఏర్పాటు చేసిన సమావేశాన్ని బీజేపీ వ్యతిరేక శక్తులు ఒక వేదికగా మార్చుకున్నాయి. ఈ సమావేశంతో డీఎంకే, కాంగ్రెస్, వామపక్షాలు, బీఆర్ఎస్, బీజేడీ, ఆప్, అకాలీదళ్, ఎంఐఎం, ఐయూఎంఎల్, సోషలిస్టు పార్టీలతో పాటు దేశ వ్యతిరేక ఎన్జీఓలకు, కుహనా మేధావులకు నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పసలేని ఒక అంశం దొరికినట్టయ్యింది. వందేళ్లకు పైగా చరిత్ర ఉందని ఢంకా భజాయించుకునే కాంగ్రెస్, చెన్నయ్‌లో అసత్యాలతో హడావిడి చేసి జాతీయ పార్టీ స్థాయి నుండి ప్రాంతీయ పార్టీ స్థాయికి దిగజారింది. ఇక బీజేపీ పేరు చెబితేనే ఉలిక్కిపడే వామపక్షాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇక్కడ వారు కూడా అలానే వ్యవహరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్య మంత్రి డీ.కే.శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌సింగ్‌తో పాటు ఇతర పార్టీల ప్రతినిధులు కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్టు 'ఫెయిర్ డీలిమిటేషన్' పేరుతో నిర్వహించిన ఈ సమావేశాన్ని బీజేపీ వ్యతిరేక కూటమి వేదికగా మార్చారు. తమిళనాడు రాష్ట్ర శాసనసభకు 2026లో జరిగే ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార డీఎంకే కుట్రలో ఈ పార్టీలన్నీ పావులుగా మారాయి.

తమిళనాడులో ఆచరణ సాధ్యంకాని అనేక హామీలతో 2021 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వానికి 2026 అసెంబ్లీ ఎన్నికలు ప్రతికూలంగా మారనున్నాయి. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోవడంతో పాటు డీఎంకే సర్కార్ అవినీతిపై కూడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని 'ఇండి' కూటమి రాష్ట్రంలో మొత్తం 39 ఎంపీ స్థానాల్లో గెలిచినా, విడివిడిగా పోటీ చేసిన అన్నాడీఎంకే కూటమి 23 శాతానికి పైగా, బీజేపీ కూటమి 18 శాతం పైగా ఓట్లు సాధించి స్టాలిన్ ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చాయి. మరోవైపు సినీ నటుడు విజయ్ నూతనంగా స్థాపించిన టీవీకే పార్టీకి కూడా యువతలో మంచి ఆదరణ ఉంది.

రాష్ట్రంలో వ్యతిరేక పవనాలు వీస్తున్న నేపథ్యంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గడ్డు పరిస్థితి తప్పదని తెలుసుకున్న డీఎంకే తమిళ ప్రజల్లో మనోభావాలను రెచ్చగొడుతూ వివాదాస్పద అంశాలను తెరపైకి తెస్తోంది. గతంలో సనాతన ధర్మాన్ని కించపరుస్తూ డీఎంకే నేతలు వ్యాఖ్యానించారు. అనంతరం హిందీ, సంస్కృత భాషలను వివాదాస్పదం చేశారు. ఈ అంశాలపై ఆశించిన స్పందన లేకపోవడంతో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనను లేవనెత్తారు. సనాతన ధర్మం, హిందీ, సంస్కృత భాషల వివాదాలపై ఇతర పార్టీలు కలిసిరాకపోవడంతో నియోజకవర్గాల పునర్విభజనను ముందుకుతెచ్చి అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీయేతర పార్టీలను జేఏసీ పేరుతో బరిలోకి దింపి కుట్రలను ప్రారంభించింది. తమిళనాడులో ఎంపీ సీట్లు తగ్గుతాయని డీఎంకే ఎన్ని విధాలా ప్రచారం చేస్తున్నా తమిళ ప్రజల నుంచి, స్థానిక రాజకీయ నేతలు నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో చెన్నయ్ వేదికగా ఇతర రాష్ట్రాల పార్టీలను పిలిచి సమావేశం పేరుతో హడావిడి చేసింది.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు, ప్రకటనలు వెలువడకపోయినా ఈ పార్టీలు అపోహలతో ప్రజలను రెచ్చగొడుతున్నాయి. 2011 తర్వాత కరోనా మహమ్మారి కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన చేపట్టలేదు. 2026లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ తర్వాతనే నియోజకవర్గాల పునర్విభజన చేపడతారు. ఇంత ప్రక్రియ జరగాల్సి ఉన్నా జనగణన చేపట్టకముందే ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధికంగా సీట్లు పెరుగుతాయని, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల సీట్లలో కోత పడుతుందని ఎవరికి తోచిన లెక్కలు వారు చెబుతూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. జనగణన చేపట్టకముందే ఏ ప్రాతిపదికన ఈ లెక్కలు చెబుతున్నారు? ఒక రాష్ట్రంలో ఇంత జనాభా పెరుగుతుందని, ఇంత జనాభా తగ్గుతుందనే లెక్కలకు ఆధారాలేమిటి? అనే ప్రశ్నలపై స్పష్టత లేదు. అంతా అసత్యాలతో కూడిన ఊహాజనితాలే.

ఒకవేళ వారు చెప్పినట్టే ఉత్తరాదిలో అధిక

స్థానాలు, దక్షిణాదిన తక్కువ స్థానాలుంటే అది నరేంద్ర మోదీ సృష్టించింది కాదు కదా! స్వాతంత్ర్యం రాకపూర్వం నుంచి దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదిన భూమి సాంద్రతతో పాటు జనాభా కూడా ఎక్కువే. 1971 జనాభా లెక్కల ఆధారంగానే 1976లో, 2009లో నియోజకవర్గాల పునర్విభజనను కేవలం సరిహద్దులను మారుస్తూ చేపట్టారు. మరి అప్పుడు కూడా ఉత్తరాదినే అధిక సీట్లు ఉన్నాయి కదా? దానికి 2014కు పూర్వం వరకు ఏకఛత్రాధిపత్యంగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమా? 1971లో జనాభా నియంత్రణ కోసం చేపట్టిన పద్ధతులను ఉత్తరాది రాష్ట్రాలు పాటించకపోతే 2014 వరకు కాంగ్రెస్‌తో సహా ఈ పార్టీలన్నీ ఎందుకు మిన్నకుండిపోయాయి? ఆ కాలంలో కేంద్రంతో పాటు



అధిక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అప్పుడు వారు ఎందుకు మాట్లాడలేదు? 1976 ప్రామాణికంగా మరో పాతికేళ్ల వరకు పునర్విభజన చేయవద్దని చెన్నయ్ సమావేశంలో తీర్మానించారు. ఎలాంటి మార్పులు చేయవద్దంటే సదరు నియోజక వర్గాల్లో గుత్తాధిపత్యం సాగిస్తున్న కుటుంబాలే అధికారం చెలాయించాలా? కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వకూడదా? అశాస్త్రీయమైన మూస పద్ధతి విధానాలనే కొనసాగించాలని వారు డిమాండ్ చేయడం శోచనీయం.

కేంద్ర ప్రభుత్వం అధీనంలో నిర్మిస్తున్న జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, పథకాల అమలు, రక్షణ రంగాల అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా బాధ్యతారాహిత్యమైన ప్రకటనలకు వేదికగా జేఏసీ సమావేశం జరిగింది.

చెన్నయ్ సమావేశంలో ప్రాంతీయ పార్టీలు అవకాశవాద రాజకీయాలతో పాల్గొని తీర్మానాలు, వ్యాఖ్యలు చేసినా కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీగా తన బాధ్యతను, తన హోదాను విస్మరించింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పార్టీ కీలక నేతలు పాల్గొన్న సమావేశంలో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ అధిష్టానం ఢిల్లీ వేదికగా డిమాండ్ చేస్తుందా? దేశంలో అధిక కాలం పాలించిన ఆ పార్టీ 1976 నుంచి నియోజకవర్గాల పునర్విభజనను దాటవేస్తూ, ఇప్పుడే ఏదో అన్యాయం జరిగిపోతుంది అంటూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ, విభజన రాజకీయాలు చేయడం ప్రమాదకరం.

దేశంలో జనగణన అనంతరం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం ఇది మొదటి సారి కాదు. జనగణన ప్రాతిపదికన నియోజకవర్గాల హద్దులు, చట్టసభల్లో స్థానాల సంఖ్య మార్పు ఉంటుందని భారత రాజ్యాంగం చెబుతుంది. దీన్ని అనుసరించే 1951, 1961, 1971 సంవత్సరాల్లో జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, రాజ్యసభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు, నియోజకవర్గాల పరిధులు మారాయి. అయితే 1976లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సమయంలో, 42వ రాజ్యాంగ సవరణతో, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం, నియోజకవర్గాల పునర్విభజన ఆపేశారు. 2009లో పునర్విభజన ప్రక్రియ మళ్లీ చేపట్టినా కేవలం నియోజకవర్గాల పరిధులలో మార్పులు చేర్పులు చేశారు. స్థానాల సంఖ్యల్లో ఎలాంటి మార్పులు జరగలేదు.

పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎంపీ సగటున 30 లక్షల మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుంటే, తమిళనాడులో సుమారు 18 లక్షల మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో రాష్ట్రాల మధ్య సమతుల్యం దెబ్బతింటుంది. అంతేకాక పెద్దపెద్ద నియోజకవర్గాలతో సదరు ఎంపీ ఆ ప్రాంతానికి పూర్తి న్యాయం చేయలేరు. మరోవైపు ప్రజలకు ఆ ప్రజాప్రతినిధి అవసరాలకు అందుబాటులో ఉండడం కూడా కష్టమే. గతంలో 1977 నాటి లోక్‌సభలో ప్రతి ఎంపీ సగటున 10.11 లక్షల జనాభాకు ప్రాతినిధ్యం వహించేవారు. ఈ ప్రాతిపదికనే తీసుకుంటే, ప్రస్తుతమున్న 543 స్థానాలు సుమారుగా 1400 అవుతాయి. అలాకాకుండా 20 లక్షలకు ఒక నియోజకవర్గం అంటే సుమారుగా 700 స్థానాలవుతాయి. ఇటీవల నూతనంగా ప్రారంభించిన పార్లమెంట్ భవనంలో 888 మంది ఎంపీలకు సీటింగ్ వ్యవస్థ ఉంది. ఈ లెక్కన తీసుకుంటే, 20 లక్షల జనాభాకు ఒక నియోజకవర్గం ప్రతిపాదనే ఉండే అవకాశాలున్నాయి.

ప్రతిపక్షాలు ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలు, ఆందోళనలపై ప్రధాని నరేంద్ర మోదీ గతంలో పార్లమెంట్ వేదికగా, అనంతరం హోం మంత్రి అమిత్‌షా స్పందిస్తూ దక్షిణాదిలో స్థానాలు తగ్గవని ప్రకటించినా, జనాభా

చెన్నయ్ సమావేశంలో ప్రాంతీయ పార్టీలు అవకాశవాద రాజకీయాలతో పాల్గొని తీర్మానాలు, వ్యాఖ్యలు చేసినా కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీగా తన బాధ్యతను, తన హోదాను విస్మరించింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పార్టీ కీలక నేతలు పాల్గొన్న సమావేశంలో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ అధిష్టానం ఢిల్లీ వేదికగా డిమాండ్ చేస్తుందా? దేశంలో అధిక కాలం పాలించిన ఆ పార్టీ 1976 నుంచి నియోజకవర్గాల పునర్విభజనను దాటవేస్తూ, ఇప్పుడే ఏదో అన్యాయం జరిగిపోతుంది అంటూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ, విభజన రాజకీయాలు చేయడం ప్రమాదకరం.

ప్రాతిపదికన అన్యాయం జరగుతుందంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల కంటే, దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి పెట్టి, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో ముందుకొచ్చే బదులు, కీలకాంశాల్లో రాజకీయాలకే ప్రాధాన్యతిస్తే, అన్ని వైపుల నష్టం జరిగే అవకాశాలుంటాయి. జనాభా లెక్కలు, కుటుంబ నియంత్రణ అంశాలకే ప్రాధాన్యత ఇస్తే సమన్యాయం జరగదు. ఉదాహరణకు 1991-2001 జనాభా లెక్కల్లో ఉత్తరప్రదేశ్‌లో జనాభా పెరుగుదల 25.85 శాతం ఉండగా, 2001-2011లో అది 5 శాతంపైగా తగ్గింది. ఇదే సమయంలో తమిళనాడు రాష్ట్రంలో 1991-2001 జనాభా లెక్కల్లో జనాభా పెరుగుదల 11.72 శాతం ఉండగా 2001-2011లో అది సుమారు 4 శాతం పెరిగింది. కాబట్టి అన్నింటికీ ఒకే ప్రాతిపదక ఉండదు. ఒకవేళ నిజంగా నష్టం జరిగితే రాజకీయాలకు అతీతంగా ఒక ఫార్ములాను తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలి.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ నియోజకవర్గాల పునర్విభజనపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రక్రియ చేపట్టలేదు. త్వరలో నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ నేపథ్యంలో విపక్షాలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ లక్ష్యంగా ప్రతి అంశాన్నీ రాజకీయం చేస్తే నష్టపోయే అవకాశాలున్నాయి. అన్నింటినీ రాజకీయాలు చేయకుండా సదరు ప్రాంతానికి న్యాయం జరిగేలా మార్గాలను అన్వేషిస్తే దీర్ఘకాలికంగా నష్టం జరగకుండా ఉంటుంది. అంతేకాని నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రమాదకర విభజన రాజకీయాలకు వాడుకుంటే మాత్రం భవిష్యత్ తరాలు ఈ పార్టీలను క్షమించవు.

– శ్రీపాద

# రాజకీయాలే ముఖ్యమా?





తమ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని, సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని రాష్ట్రాలు తరచూ గగ్గోలు పెడుతుంటాయి. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇటువంటి ఆరోపణే వినవస్తుండేది. దాదాపు ప్రతి ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వమూ ఇదే విధమైన ఆరోపణలు చేయడం ఒక సర్వసాధారణ విషయమైపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను, విభేదాలను రాజ్యాంగ నిర్మాతలు ఊహించకపోలేదు. వాటిని దృష్టిలో పెట్టుకుని, ఈ వివాదాలను, విభేదాలకు పరిష్కరించుకోవడానికి రాజ్యాంగంలో వారు కొన్ని అంశాలను పొందుపరచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివిధ సమస్యలు, వివాదాల పరిష్కారం కోసం 1952లోనే జాతీయ అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1990లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 కింద అంతర్రాష్ట్ర మండలిని కూడా ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య విభేదాలను పరిష్కరించడమే కాకుండా వీటి మధ్య సమన్వయాన్ని, సహకారాన్ని పెంపొందించ డానికి కూడా ఈ రెండు మండళ్లు కృషి చేస్తాయి.

సహకారం, సమన్వయాల మీద ఆధారపడిన సమాఖ్య స్ఫూర్తి చుట్టూ కేంద్ర, రాష్ట్ర సంబంధాలు తిరుగుతూ ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తన పథకాలను అమలు చేయడం సాధ్యం కాదు. ఏ కారణంగానైనా ఈ రెండింటి మధ్య సంబంధాలు దెబ్బతినే పక్షంలో రాష్ట్రాలు ఆర్థికంగా దెబ్బతినడం ఖాయం.


కేంద్ర ఖజానా నుంచి తమకు రావాల్సిన వాటా రావడం లేదని, తమ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని రాష్ట్రాలు ఆరోపించే పరిస్థితికి ఈ రెండింటి సంబంధాలు దిగజారకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భౌగోళిక విభజనేదీ ఉండకూడదు. దేశమంతా ఒక్కటేనన్న భావన తప్ప ఇక్కడ రాజకీయ ప్రాధాన్యాలకు అవకాశం లేదు. అన్యాయం జరుగుతోందన్న భావన ఒక రాష్ట్రానికి కలిగే పక్షంలో దీని ప్రభావం ఇతర రాష్ట్రాల మీద  పడే అవకాశముంటుంది.

సరుకులు, సేవల పన్ను(జి.ఎస్.టి) ప్రవేశపెట్టినప్పుడు, రాష్ట్రాలకు నిష్పక్షపాతంగా న్యాయం జరుగుతుందని అంతా నమ్మారు. పన్నుల వసూళ్లను క్రమబద్ధం చేసినప్పుడు, రాష్ట్రాలకన్నిటికీ అత్యధిక మొత్తంలో పన్నుల సొమ్ము అందుతుందనే అంతా భావించారు. ఈ విధంగా ఆశించడంలో తప్పేమీ లేదు కూడా. అయితే, కొన్ని రాష్ట్రాలు ఈ విషయంలో తమ అభిప్రాయాలు తలకిందులైనట్టు భావిస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్రాలు తమకు అన్యాయం జరుగుతోందంటూ ఫిర్యాదు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం దీన్ని రాజకీయ కోణం నుంచి, ఎన్నికల కోణం నుంచి కాక, ఒక జాతీయవేత్త కోణం నుంచి పరిశీలించి సానుభూతితో పరిష్కరిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విమర్శలను కొనసాగిస్తూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు తమకు తోచిన, తమకు వీలైన పేర్లు పెట్టి వాటిని అమలు చేస్తున్న మాట నిజమే. కానీ, ఆ కారణంగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఆపేయడం అన్నది ఎక్కడా లేదు. కేంద్ర ప్రభుత్వం అటువంటి సమస్యలను మరో విధంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తోంది.

విచిత్రమేమంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభేదాలు, వివాదాలను పరిష్కరించడానికి అంతర్రాష్ట్ర మండలి, జాతీయ అభివృద్ధి మండలి ఉన్నప్పటికీ, ఇంతవరకూ వాటికి తమ ఫిర్యాదులు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. దీనిని బట్టి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం తప్ప, సమస్యల పరిష్కారం ముఖ్యం కాదని తేలికగా అర్థమవుతోంది. కేంద్రానికి రాష్ట్రాలతో సమస్యలు వచ్చినా, రాష్ట్రాలకు కేంద్రంతో సమస్యలు వచ్చినా, ముఖాముఖీ తలపడే ప్రయత్నమే జరుగుతోంది. దాన్ని రాజకీయం చేయడం, రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం, ప్రతీకార కోణం నుంచి ఆలోచించడం అనేక ఏళ్లుగా ఉంది. ఈ రెండు మండళ్లను ఉపయోగించుకోవడం ద్వారా సమాఖ్య స్ఫూర్తి బాగా పెరిగే అవకాశం ఉంది. వీటిని ఎంత ఎక్కువగా ఉపయోగించుకుంటే అంత మంచిదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

రాష్ట్రాలు చేస్తున్న ఫిర్యాదుల్లో ఒక్క శాతం వాస్తవం ఉన్నా అది దేశానికి శ్రేయస్కరం కాదు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం అన్యాయం చేస్తోందని, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని అభిప్రాయపడడానికి ఆస్కారం లేదు. రాష్ట్రాలకు నిధులు పంచే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఆమోదయోగ్యమైన పద్ధతిని అనుసరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ పద్ధతిని ఉల్లంఘించే పక్షంలో కోర్టులను ఆశ్రయించడానికి కూడా అవకాశం ఉంది. రాష్ట్రాలు ఆ పని కూడా చేయడం లేదు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాల ఆరోపణల్లో నిజం ఉందనే అనుకుందాం. కేంద్రం ఆర్థికంగా శక్తిమంతమైన ప్రభుత్వమే కావచ్చు. కానీ, కేంద్రం వద్ద చేరుతున్న సొమ్మంతా ఈ రాష్ట్రాల్లోని ప్రజల నుంచి పన్నుల రూపేణా అందుతున్న సొమ్మేనన్న విషయాన్ని మరచిపోకూడదు. పైగా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలంగా ఉండడం, రాష్ట్రాలు మాత్రం ఆర్థికంగా అధ్వాన్న స్థితిలో ఉండడం అనేది దేశానికి ఏ విధంగానూ శ్రేయస్కరం కాదు.

దేశంలోని రాష్ట్రాల న్నిటి నుంచి తమకు అందుతున్న నిధులతో తాము ఆర్థికంగా శక్తిమంతం అవుతున్నామనే విషయాన్ని కేంద్రం అర్థం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయం కలగజేస్తూ ఉండాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాలకు అందజేయవలసిన న్యాయమైన వాటాను చిన్నా చితకా కారణాలు చెప్పి, సాంకేతిక కారణాలు చూపించి దానికి దక్కకుండా చేయడం ఏ విధంగానూ న్యాయం కాదు. కేంద్ర ప్రభుత్వం ఒక ధర్మకర్తలా వ్యవహ రించాల్సి ఉంటుంది. రాష్ట్రాల నమ్మకాన్ని చూరగొ నాల్సి ఉంటుంది. ఏ రాష్ట్రమైనా నిధుల దుర్విని యోగానికి పాల్పడుతున్నదనే అభిప్రాయం కలిగినప్పుడు ఈ సమస్యను అంతర్రాష్ట్ర మండలి ద్వారా పరిష్కరించడం చాలా మంచిది. జాతీయ అభివృద్ధి మండలి, అంతర్రాష్ట్ర మండలికి సంబం ధించి రాజ్యాంగంలో పొందుపరచిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.



**జి.రాజశుక**

**సీనియర్ జర్నలిస్ట్**

నివాళి

# వెండితెర మీద దేశభక్తి భావన

1947 నాటి భారత్‌-పాకిస్తాన్‌ విభజన చూసిన వారికి ఈ దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అక్కడకే వచ్చి ఎందుకు ఆగిందో లోతుగా అర్థమై ఉంటుంది. ఆనాటి నెత్తుటి జ్ఞాపకాలు ఎప్పటికీ మరపునకు రావు. అలాంటి వారు గుండెలలో మాతృభూమి మీద భక్తిని, ప్రేమను అజరామరం చేసుకున్నారు. అలాంటి వారిలో ప్రముఖ హిందీ చలనచిత్ర నటుడు మనోజ్‌కుమార్‌ ఒకరు. ఆయన నిర్మించిన దేశభక్తి ప్రపూరిత చిత్రాలు భారతీయుల హృదయాల మీద చెరగని ముద్ర వేశాయి. ఆయన పేరు 'భరత్‌కుమార్‌' అని స్థిరపడింది.





మనోజ్‌కుమార్‌

మనోజ్‌కుమార్‌ (జూలై 24,1937–ఏప్రిల్‌ 4,2025) అసలు పేరు హరికిషన్‌ గిరి గోస్వామి. బ్రిటిష్‌ ఇండియాలోని వాయవ్య ప్రాంతంలోని అబోట్టాబాద్‌లో పుట్టారు (ఇది ప్రస్తుతం పాక్‌లోని ఖైబర్‌ ఫఖ్తుంఖ్వాలో ఉంది). వారి కుటుంబం విభజన సమయంలో ఢిల్లీ చేరుకుని కింగ్స్‌వే క్యాంప్‌, హడ్సన్‌ లైన్‌ శరణార్థి శిబిరాలలో గడిపింది. ఈ విషయంలో ప్రఖ్యాత గేయ రచయిత గుల్జార్‌కీ మనోజ్‌కీ పోలికలు ఉన్నాయి. ఈ ఇద్దరు పాకిస్తాన్‌ నుంచి వచ్చి ఢిల్లీ శరణార్థుల శిబిరాలలో ఉండి, తరువాత హిందీ చలనచిత్ర సీమలో ప్రవేశించారు. మనోజ్‌కుమార్‌ సోదరుడు కుకు ఆ సమయంలోనే కన్నుమూశారు కూడా. అందుకే తనది చాలా విషాదకరమైన బాల్యమనే ఆయన చెప్పుకున్నారు. విభజన తన జీవితానికి ఇచ్చిన అత్యంత చేదు అనుభవాన్ని కూడా ఆయన చెప్పేవారు. తీస్‌ హజారీ ఆసుపత్రిలో ఉన్నప్పుడు ప్రమాదాన్ని సూచించే సైరన్‌ మోగింది. డాక్టర్లు, నర్సులు రోగులను విడిచిపెట్టి నేల మాళిగలలోకి నిష్క్రమించారు. మనోజ్‌ తల్లి గట్టిగా అరిచింది. ఎందుకంటే అప్పుడు మనోజ్‌ చిన్న తమ్ముడు కుకు చనిపోయాడు. మనోజ్‌ కర్ర పుచ్చుకుని డాక్టర్లను కొట్టడానికి వెళ్లారు. తరువాత యమునలో ఆ బిడ్డ మృతదేహాన్ని విడిచిపెట్టి వచ్చారు. ఇకపై ఎవరి మీద దెబ్బలాటకు దిగవద్దని ఆ రాత్రే మనోజ్‌ తండ్రి గట్టిగా చెప్పి ఒట్టు వేయించారు. ఆయనే ఖిజ్ర్‌ (కలం పేరు. జ్ఞానవంతుడు అని అర్థం). ఆయన కవి. 1956లో ఢిల్లీలోని హిందూ కళాశాలలో పట్టభద్రుడైన మరుసటి సంవత్సరం బాలీవుడ్‌కు పయనమయ్యారు మనోజ్‌. ఆయన నటించిన తొలిచిత్రం ఫ్యాషన్‌. అదైనా ఆయనకు సులభంగా రాలేదు. రైల్వే ప్లాట్‌ఫారాల మీద నిద్ర, పోలీస్‌ లాఠీ దెబ్బలు వంటివన్నీ అప్పటికే బొంబాయిలో అనుభవమయ్యాయి. మనోజ్‌కుమార్‌ నటుడిగా, దర్శకుడిగా, చిత్రానువాదకునిగా, గేయ రచయితగా, ఎడిటర్‌గా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పనిచేశారు. 53 చిత్రాలలో నటించారు. దిలీప్‌ కుమార్‌, అశోక్‌కుమార్‌ బాటలోనే గిరి గోస్వామి కూడా తన పేరును భరత్‌కుమార్‌ అని మార్చు కున్నారు. 1992లో పద్మశ్రీ పురస్కారం, 2015లో చలనచిత్ర రంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం దాదా సాహెబ్‌ ఫాల్కే ఆయనకు వచ్చాయి.

ఆయన చిత్రాలు రోటీ కపడా ఔర్‌ మకాన్‌, క్రాంతి వంటి చిత్రాలు చూస్తే ఆయనలో సామాజిక స్పృహ స్పష్టంగా తెలుస్తుంది. క్రాంతి చిత్రం 1857 నాటి కొన్ని ఘటనల ఆధారంగా నిర్మించారని చెబుతారు. 1965లో 'షహీద్‌' చిత్రాన్ని భగత్‌సింగ్‌ జీవితం ఆధారంగా ఆయన నిర్మించారు. ఇందులో కొవ్వొత్తి మీద అరచేయి పెట్టి ప్రమాణం చేసే సన్నివేశం జనాన్ని కదిలించింది. భగత్‌సింగ్‌ పాత్రను మనోజ్‌ పోషించారు. దేశభక్తి తత్త్వంతో ఆయన తీసిన తొలి చిత్రం ఇదే కావడం విశేషం. లాల్‌ బహదూర్‌ శాస్త్రి ప్రశంసలు కూడా ఆయన పొందారు. జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. రోటీ కపడా ఔర్‌ మకాన్‌లో ఒక దృశ్యం ప్రేక్షకులను కదిలిస్తుంది. ఒక బక్కచిక్కిన మనిషి దుప్పట్లో ఏదో దాచి పెట్టుకుని పారిపోతూ ఉంటాడు. ఒక పోలీస్‌ అధికారి అతడిని చాలా దూరం వెంటాడి ఆపుతాడు. రివాల్వర్‌ గురిపెట్టి లోపల ఉన్నదేమిటో చూపమంటాడు. అతడు గొంగడి నుంచి చేయి బయట పెడతాడు. అందులో రెండు చపాతీలు ఉంటాయి. అతడు దొంగిలించినవి అవే. ఆయన దేశభక్తి అవసరాన్ని ఎంత గుర్తించారో దేశంలో పెరుగుతున్న అవినీతి, నిరుద్యోగం వంటి తీవ్ర సామాజిక సమస్యలను కూడా వెండితెరకు ఎక్కించారు. ఈ సమస్యలను ఎలుగెత్తి చాటిన చిత్రమే రోటీ కపడా ఔర్‌ మకాన్‌. అందుకే ఆయన చిత్రాలు 1960, 1970లలో హిందీ చలనచిత్ర సీమను ఏలాయి. 1967లో విడుదలయిన ఉపకార్‌ ఆయన దర్శకత్వంలోనే వచ్చింది. దీనికి నాటి దేశ సామాజిక నేపథ్యమే మూలం. నాటి ప్రధాని లాల్‌ బహదూర్‌ శాస్త్రి జైజవాన్‌ జై కిసాన్‌ నినాదం ఇచ్చారు. ఆ నినాదాన్ని గౌరవిస్తూ నిర్మించినదే ఉపకార్‌ చిత్రం. పొలం దున్నే కర్షకునిగా, యుద్ధ భూమిలో సైనికునిగాను ఆయన నటించారు. పూరబ్‌ ఔర్‌ పశ్చిమ్‌ భారతీయ సంస్కృతిని కాటేస్తున్న పాశ్చాత్య సంస్కృతి మీద నిరసనతో నిర్మించిన చిత్రం. ఆయన ఓ కౌన్తీ, గుమ్‌నామ్‌ వంటి సస్పెన్స్‌ చిత్రాలలోను నటించి మెప్పించారు. ఆయనకు సంగీతమంటే ఎంతో అభిమానం. అందులో మంచి అభిరుచి కూడా ఉంది. అందుకే ఆయన చిత్రాలలోని ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

– జాగృతి డెస్క్‌

# దక్షిణాఫ్రికాలో 60 వేల హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ




దక్షిణాఫ్రికాలో ఎస్‌ఏ హిందూస్ అనే ధార్మిక సంస్థ శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఇటీవల 60 వేల హనుమాన్ చాలీసా పుస్తకాలను దేశంలో ఎనిమిది దేవాలయాల వద్ద పంచిపెట్టింది. గౌటెంగ్ ప్రావిన్సుకు చెందిన పలు క్లబ్బులకు చెందిన బైకర్ల నేతృత్వంలో ఎస్‌ఏ హిందూ సభ్యులు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్‌ఏ హిందూస్ సంస్థ షెరెనో ప్రింటర్స్, ఎలక్ట్రో ఆన్‌లైన్ మీడియా భాగస్వామ్యంతో ఆగస్టు 24, 2024న 10 లక్షల హనుమాన్ చాలీసా పుస్తకాలను పంచిపెట్టే కార్యక్రమానికి నాంది పలికింది. 2029 నాటికి 10 లక్షల హనుమాన్ చాలీసా పుస్తకాలను పంచిపెట్టడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఇదే విషయమై ఎస్‌ఏ హిందూస్ వ్యవస్థాప కురాలు పండిత లూసీ సిగాబన్ మాట్లాడుతూ "మా కార్యక్రమానికి భగవంతుని ఆశీస్సులు తోడైనట్టుగా మేము వెళ్లిన దేవాలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు కనిపించారు. హనుమాన్ చాలీసా పుస్తకాల పంపిణీతో పాటుగా అవసరార్థుల కోసమని మేం చేపట్టిన పచారీ సామాన్ల సేకరణకు ఆయా దేవాలయాల నిర్వాహకుల నుంచి, భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది. దాదాపుగా 2,000 కేజీల పచారీ సామాన్లను సేకరించాం. ఇందుకు

# మయన్మార్‌కు అండగా ఆపరేషన్ బ్రహ్మ

మార్చి 28న పెను భూకంపానికి అతలాకుతలమైపోయిన మయన్మార్‌ను అన్నివిధాలుగా ఆదుకోవడానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ బ్రహ్మను ఆరంభించింది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన ఆరు విమానాలు, ఐదు నౌకలు 625 మెట్రిక్ టన్నుల మానవీయ సాయం, విపత్తు పునరావాసానికి సంబంధించిన సామాగ్రిని మయన్మార్‌కు చేరవేశాయి. ఆ క్రమంలో భారత్ మార్చి 29న గుడారాలు, దుప్పట్లు, అత్యవసరమైన ఔషధాలు, ఆహార పదార్థాలతో సహా మొత్తం 55 టన్నుల సామాగ్రిని, మార్చి 30న 112 టన్నుల సామాగ్రితో పాటుగా భారత సైన్యానికి చెందిన 118 మందితో కూడిన వైద్య బృందాన్ని, 80 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని, ఏప్రిల్ 1న 16 టన్నుల సహాయక సామాగ్రితో పాటుగా విశాఖపట్టణం ఓడ రేవు నుంచి బయలుదేరిన భారత నావికా దళం నౌక ద్వారా 405 మెట్రిక్ టన్నుల బియ్యం, 30 మెట్రిక్ టన్నుల వంట నూనె, 5 మెట్రిక్ టన్నుల బిస్కెట్లు, 2 మెట్రిక్ టన్నుల నూడుల్స్‌తో కలుపుకొని 442 మెట్రిక్ టన్నుల ఆహార పదార్థాలను మయన్మార్‌కు చేరవేసింది.




# బోర్డర్ భారతి



పాకిస్తాన్‌లోని సింధ్ ప్రాంతం నుంచి 149 మంది భారత్‌కు వస్తున్నారు. అందులో జాతా అనే వర్గానికి చెందిన ముగ్గురు ఉన్నారు. వాఘా సరిహద్దు దాటగానే ఈ వర్గానికి చెందిన ఒక మహిళకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమె పేరు మాయ. భర్త పేరు ఖన్నో. స్థానికులు వెంటనే ఆమెను అట్టారిలోని ఒక ఆసుపత్రిలో చేర్చారు. మాయ సుఖ ప్రసవంతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఏప్రిల్ 4న ఇది జరిగింది. ఆమెను ఆసుపత్రిలో చేర్చుకోవడానికి వీలుగా ఇమిగ్రేషన్ అధికారులు కూడా విధివిధానాలు పూర్తి చేసి సహకరించారు. వెంటనే చిన్నారికి చక్కని పేరు కూడా పెట్టారు – భారతి. మాయ పేరుతో భారత్‌లోకి అడుగు పెట్టిన ఆమె సంతాన లక్ష్మి కూడా. భారతితో కలిపి ఆమెకు పదిమంది సంతానం. అందులో భారతి ఎనిమిదో కూతురు. డిసెంబర్ 2, 2021న కూడా ఇలాంటి శుభ సందర్భమే వాఘా సరిహద్దులలోనే సంభవించింది. ఇంతకీ ఈ 149 మంది హిందువులు హరిద్వార్‌ను దర్శించుకోవడానికి వెళుతున్నారు. అంటే అక్కడ నుంచి హరిద్వార్‌కు ఆ పూర్ణ గర్భిణి కూడా బయలుదేరిందన్నమాట. ఆసుపత్రిలో ఒక పాకిస్తాన్ హిందూ మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చిన సంగతి తెలిసి విజయ్‌వర్మ అనే అట్టారీ వాసి అక్కడికి వెళ్లి అభినందనలు తెలియచేశారు. అక్కడ అందరికీ మిఠాయిలు కూడా పంచి పెట్టారు.

భారతీయులందరి తరఫున ఆయనే శిశువుకు ఆశీస్సులు కూడా అందించారు. నింబు బాయి అనే పాకిస్తానీ హిందూ మహిళ (భర్తపేరు బాలన్‌రామ్) మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆ చిన్నారికి పెట్టిన పేరు ఏమిటో తెలుసా? సరిహద్దు రాముడు. అయితే ఇలాంటి పురుళ్లలో ఒక లోపాయికారి విషయం కూడా ఉంది. పాకిస్తాన్‌లో బాధలు భరించలేక భారత్‌కు రావాలనుకున్న వాళ్లు ఈ వ్యూహం కూడా అనుసరిస్తారట. అలా భారత్‌లో శాశ్వత నివాసం పొందుతారట. ★

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. సేకరించగా వచ్చిన పచారీ సామాన్లను మరికొద్ది రోజుల్లో గౌటెంగ్, కేజెడ్ఎన్ ప్రావిన్సుల్లో అవసరార్థులకు పంచిపెడతాం" అని తెలిపారు.

షెరెనో ప్రింటర్స్ యజమాని నిరాన్ సింగ్ హనుమాన్ చాలీసా పుస్తకాల పంపిణీ గురించి మాట్లాడుతూ "ఎస్ఏ హిందూస్ ఎంతో అంకిత భావంతో ప్రజలకు ఆధ్యాత్మిక విద్యను అందించడానికి చేపట్టిన ప్రాజెక్టులో భాగమైనందుకు వేం ఎంతగానో సంతోషిస్తున్నాం" అని తెలిపారు. దక్షిణాఫ్రికా బైకర్ల క్లబ్‌లో ఒకటైన థ్రోటల్ కలెక్టివ్ సహ వ్యవస్థాపకుడు మృణాల్ భగవాన్ సైతం ఎస్ఏ హిందూస్ చేపట్టిన కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# మధ్యప్రదేశ్ పుణ్యక్షేత్రాల్లో మద్య నిషేధం



మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో పుణ్యక్షేత్రాలతో కూడుకున్న 19 ప్రాంతాల్లో మద్య నిషేధాన్ని అమలులోకి తెచ్చింది. తాజాగా తీసుకువచ్చిన ఈ మద్య విధానానికి లోబడి ఒక మున్సిపల్ కార్పోరేషన్, ఆరుగురు మున్సిపల్ కౌన్సిళ్లు, ఆరు నగర కౌన్సిళ్లు, ఆరు గ్రామ పంచాయతీలలో మద్య నిషేధం పూర్తిగా అమలులో ఉంటుంది. ఉజ్జయినీ, ఓంకారేశ్వర్, మహేశ్వర్, మండలేశ్వర్, ఓర్చా, మయిహర్, చిత్రకూట్, దాటియా, పన్నా, మాండ్లా, ముల్తాయి, మందసౌవుర్, అమర్‌కంటక్, సల్కాన్‌పూర్, కుండల్‌పూర్, బందక్‌పూర్, బర్మన్ కలన్, బర్మన్‌ఖుర్ద్, లింగాలో ఎలాంటి మద్యం దుకాణాలను అనుమతించరు. అయితే ఉజ్జయినీలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కాలభైరవ దేవస్థానంతో పాటుగా పలు దేవాలయాల్లో దేవీదేవతలకు భక్తులు అనాదిగా మద్యాన్ని నైవేద్యంగా సమర్పించుకుంటూ వస్తున్నారు. దేశ, విదేశాల నుంచి వేలాదిగా భక్తులు కాలభైరవ దేవాలయానికి వస్తుంటారు. కనుక ఉజ్జయినీలో కాలభైరవ దేవాలయం లాంటి దేవాలయాల పరిసర ప్రాంతాలలోని మద్యం దుకాణాలు మూతపడిపోతాయని సంబంధిత అధికారులు తెలిపారు. భక్తులు ఎవరైతే దేవీదేవతలకు మద్యాన్ని నైవేద్యంగా సమర్పించాలని అనుకుంటారో వారు తమ కూడా మద్యాన్ని తెచ్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

# ట్రంప్‌కు వ్యతిరేకంగా 25 గంటల ప్రసంగం



అమెరికా సెనెటర్ కోరి బూకర్ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలను విమర్శించడం కోసమని 25 గంటల 4 నిమిషాల ప్రసంగించడం ద్వారా 1957లో అదే సెనెట్‌లో సెనెటర్ స్ట్రోమ్ తుర్మోండ్ 24 గంటల 18 నిమిషాల పాటు ప్రసంగించడం ద్వారా నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టారు.

న్యూజెర్సీకి చెందిన డెమొక్రట్ కోరి బ్రూకర్ స్థానిక కాలమానం ప్రకారం మార్చి 31 సాయంత్రం మొదలుపెట్టిన తన ప్రసంగాన్ని ఏప్రిల్ 1 సాయంత్రం 8 గంటల 4 నిమిషాలకు ముగించారు. బూకర్ రికార్డు సృషించే సమయానికి అతడి టిక్‌టాక్ అకౌంట్‌లో ప్రసంగం ప్రత్యక్ష ప్రసారానికి 22 కోట్లకు పైగా లైక్‌లు వచ్చాయి.

బూకర్ ఉదయం ఏడు గంటలప్పుడు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తన ప్రసంగాన్ని కొనసాగిస్తు న్నట్టుగా "12 గంటలుగా నేను నిలబడే ఉన్నాను. అయినప్పటికీ పట్టు కోల్పోకుండా కొనసాగిస్తాను. ఎందుకంటే మన అధ్యక్షుడు (ట్రంప్) చేస్తున్నారు కాబట్టి. ఈ పుస్తకం (రాజ్యాంగాన్ని చూపిస్తూ) మనకెంతో ఇష్టమైంది. అయితే ఇందులో ఎంతో సూటిగా, స్పష్టంగా ఉన్న సూత్రాలను ఆయన ఉల్లంఘిస్తున్నారు" అని అన్నారు.

ఆయన రాత్రి 8 గంటల 4 నిముషాలప్పుడు సుదీర్ఘమైన తన ప్రసంగానికి ముగింపు పలుకుతున్నట్టుగా తోటి సెనెటర్లు లేచి నిలబడి అభినంది స్తుండగా "ఇదొక నైతికమైన సందర్భం. ఇది కుడి కాదు ఎడమ కాదు.. మంచి కాదు చెడు కాదు. ఇంతటితో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను" అని అన్నారు.

# 'మనల్ని ఐక్యంగా ఉంచే శక్తి శ్రీరామచంద్రుడు'



ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామనవమి పర్వ దినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 6న తమిళనాడులో భారతదేశంలో సముద్రంపై నిలువుగా లేచే మొట్ట మొదటి వంతెన పంబన్ వంతెనను ప్రారంభించారు. 2.07 కి.మీ.ల పొడవుతో పాక్ జలసంధిపైన అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన ఈ వంతెన భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో అనుసంధానం చేస్తుంది. వంతెన పని తీరుకు నిదర్శనంగా అన్నట్టుగా భారత సముద్ర తీర గస్తీ దళానికి చెందిన ఒక బోటు వస్తుండగా, దానికి దారి ఇస్తున్నట్టుగా వంతెన పైకి లేచింది. బోటు దాటిపోగానే వంతెన మళ్లీ యథాస్థితికి చేరుకుంది. ప్రధాని మోదీ అదే సమయంలో కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవితో కలిసి సాగర వంతెన ద్వారా చెన్నయ్‌లో తాంబరం నుంచి రామేశ్వరానికి రాకపోకలు సాగించే తొలి రైలుకు పచ్చ జెండా చూపారు. ప్రధాని అంతకుముునుపు సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పెట్టిన ఒక పోస్టులో "కొద్దిసేపటి క్రితం శ్రీలంక నుంచి తిరిగి వస్తుండగా రామ సేతును దర్శించుకున్నాను. దైవం సంకల్పించి నట్టుగా సరిగ్గా అదే సమయంలో అయోధ్యలో బాలరాముడికి సూర్య తిలక ధారణ జరుగుతోంది. ఆ రెండింటిని దర్శించుకునే భాగ్యం నాకు దక్కింది. శ్రీరామచంద్ర ప్రభువు మనలను కలిపి ఉంచే మహా శక్తి. వారి ఆశీస్సులు మనకు ఎల్లవేళలా ఉండాలి" అని అన్నారు. ★

కథ

# తొలిరేయి


## బి.వి.ఎస్. ప్రసాద్

శిరీష పాల గ్లాస్‌తో ఎదురొచ్చింది. తలుపులు బంధించబడ్డాయి, కానీ కోరికలు రెక్కలు విప్పుకొని వినువీధుల్లో విహరిస్తున్నాయి! ఎన్నో కావ్యాలు చదివాడు వినయ్. ఎదురుగా నేడు కావ్య కన్యక. "నన్ను చదవ్వూ!" అంటున్నది. తెల్లటి చీరలో ఎల్లోరా శిల్పంలాంటి తన సిరి విసురుతున్న ఆ సూటి చూపులకు ఎక్కడో సిగ్గుపడుతున్నాడు. స్త్రీ బిడియం సడలించినప్పుడు ప్రేమ జల్లులో తడిసి వలపు వాగులో కొట్టుకుపోవడం సహజమైన ఇబ్బందే మగవాడికి! మల్లెలూ, పరుచుకున్న పరువం లాంటి కొత్తటి మెత్తటి పరుపూ పోటీ పడుతున్నాయి, ఆస్వాదనకి శ్రీకారం చుట్టవోయ్.. అంటూ. 'నేను అడ్డయితే తీసేయండి' అంటున్నది దీపం. చాలిక! నీ మదిలోని ఈ తొలిరేయి వర్ణన! ఆపి కార్యోన్ముఖుడవు కమ్మంటోంది ఆత్మీయ అంతరంగం. అక్కడ నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ శిరీష వేసిన ప్రశ్న వినయ్‌ని వెంటాడుతోంది. ఆరేయి ఎలా గడిచిందో మరో మారు చెప్పుకుందాం.

* * *

ఏంటి ఆ ప్రశ్న? వినయ్‌ని వెంటాడుతున్నదీ– శిరీష అడిగినదీ! తెలుసుకోవాలంటే – మనం శ్రీ పంచాగ్నుల వెంకటావధాని గారి ఇంటి తలుపు తట్టాల్సిందే. "ఇప్పటికి 9 నెలలు అయింది. వ్యాకరణం, పద్య రచన బాగానే నేర్చుకున్నావు, సంతోషం! ఏదీ! నేను అడిగిన ప్రశ్నకి నువ్వు ఆశువుగా ఒక అందమైన పద్యం చెప్పు! చూద్దాం" – సూటిగా ప్రశ్నించాడు అవధాని గారు. అదే! అదే!! అలాగే అచ్చంగా తొలిరేయి నాడు అడిగేసింది శిరీష. 'ఓయ్! వినయ్! సారీ.. వినయ్ గారూ! మీరు ఎంఏ తెలుగు చేశారుగా. నా అందం మీద ఓ అందమైన పద్యం చెప్పరూ!' అని, కళ్లు వినయ్ చుట్టూ తిప్పేస్తూ. "చెబితేనేనండోయ్ మనం ముందుకెళ్లేది" అన్నది కూడా. చచ్చింది గొర్రు. చదివింది ఎంఏ తెలుగే కానీ, చేస్తున్నది బ్యాంకులో ఉద్యోగం.

ఏవో మాయమాటలు చెప్పి ఏమార్చి ఆ రోజు శిరీషను సంతోషపెట్టాడే కానీ పద్యం చెప్పలేదు. ఫస్ట్ నైట్ చెలి కోరిన తొలి కోరిక తీర్చలేదు. వచ్చే యానివర్సరీకైనా శిరీష అందం మీద హృద్యంగా ఓ పద్యం చెప్పేయాలని మనసులో ప్రతిజ్ఞ చేసుకున్నాడు వినయ్. అదీ సంగతి! అందుకోసం వెంకటావధాని గారి వద్ద శిష్యరికం. చేతులు నలుపుకుంటూ– గురువుగారి పాదపద్మాలకు దగ్గరగా పీట వేసుకొని కూర్చున్నాడు రోజుకు మల్లే. అక్కడే దివాణం మంచం మీద శయనించి ఉన్నారు గురువుగారి సతీమణి పద్మావతి. ఆమెకు సపర్యలు చేస్తూ ఉంటుంది మంజుల. పద్మావతి గారు కూడా పాండిత్యంలో దిట్టే! కాకపోతే ఆవిడ అనారోగ్య రీత్యా ఇంటి పనులు వంట పనులు ఏవీ చేయడంలేదు. అంచేత మంజుల వారింట పదేళ్లుగా పనిచేస్తున్నదట. పద్మావతి గారు కూడా సాహితీ పిపాస కలిగి ఉండడంతో –



అనారోగ్యం ఆలోచనలు పక్కకు పెట్టి గోష్టి కార్యక్రమాలు వీక్షిస్తూ, ఆస్వాదిస్తూ ఉంటారు. అవధానిగారు ముక్కుపొడి లాగిస్తూ – వ్యసనం మీద ఆశువుగా ఓ పద్యం చెప్పవోయ్ అని అడిగి, మళ్లీ... "ఆగాగు! పద్యం–మహాభారతంలోని ఏదైనా ఘట్టాన్ని స్పృశిస్తూ ఉండాలి" అన్నారు. వినయ్‌కి తొలి రేయినాటి చెమటలు గుర్తుకు వచ్చాయి. ఎందుకో తెలుసా? ఇది వినయ్ చెప్పబోయే తొలి ఆశువు గనుక. శారదామాతకు మనసులోనే ప్రణమిల్లి గొంతు సవరించుకొని చెప్పసాగాడు.

**కం.పరిపాలన తన విధి ఏ**
**మరిపాటులు కూడ దెపుడు మహిపతులకు ఆ**
**విరటుడు జూదము నాడుచు**
**మరచెను పరిపాలనమ్ము మతిహీనుండై!**

తను చెప్పిన పద్యం ఎలా ఉంటుందని అంటారో! అనే ఆరాటం అతడి ముఖంలో కనపడిపోతోంది. అవధాని గారు భుజం మీద కండువా సరి చేసుకుని, ఓమారు గొంతు సవరించుకొని వారి అభిప్రాయం చెప్పబోయే తరుణంలో మంజుల పుసుక్కున ఓ నవ్వు నవ్వి–కొంగు అడ్డు పెట్టుకున్నది. 'ఎందుకు నవ్వుతున్నావ్' పద్మావతి గద్దించింది మంజులను. ఆ ఇంట్లో వంట చేస్తున్న ఆ అమ్మాయిని వాళ్లు 'అన్నపూర్ణ' అని పిలుస్తారు–పదేళ్లుగా అన్నం వండి పెడుతోంది గనుక.

ఆమె వారికి ఇంటి మనిషి కిందే లెక్క. అవధాని గారు కూడా 'ఎందుకు నవ్వావు ? అలా నవ్వవచ్చా! సభ్యత కాదు కదా ! చేతనయితే ఓ పద్యం నువ్వూ చెప్పు!' అన్నారు ఆయన. మంజులకు సంజాయిషీ చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్షమాపణలైన చెప్పాలి లేదా పద్యమైనా చెప్పాలి. తను రెండవదే ఎంచుకున్నది.

**కం.తన గోవుల పరరాజులు**
**కొనిపోవగ వాని దెచ్చుకొనగల ధీరున్**
**గనజాలని దుస్థితిలో**
**ఘనుడగు పార్థుడు దెచ్చి కాపాడేగదా!**

అన్నది చేతులు జోడించి నమస్కరిస్తూ!

'ఓ భేష్! బాగా చెప్పావు' అన్నది పద్మావతి. మంజుల ఆమెకు నమస్కరిస్తూ, "మీ సేవా భాగ్యం వలన నాకు కాస్త విద్య అబ్బింది' అని ఆమె పాదాలను కళ్లకద్దుకున్నది...'మీ యెదుట ఇది నా తొలి ప్రయత్నం' అంటూ. వినోద్ కూడా భేషజం లేకుండా సంతోషాన్ని ప్రకటించాడు. అవధాని గారు మాత్రం సంతోషించినట్లు లేరు. 'నేను వారిని అడిగితే–నీవు చెబుతావేం? నిన్ను అడిగినప్పుడు నువ్వు చెప్పాలి. అది సభ్యత. మన ఇంట్లో జరిగే చర్చల ద్వారా అబ్బిన పరిజ్ఞానం, వాసనా బలంతో చెప్పినట్లుగా ఉన్నది. ఇది నీ తొలి ప్రయత్నం అయితే ఇప్పుడు నీకో సవాల్! ఏదైనా ప్రస్తుత కాలపు వ్యసనాన్ని నిరసిస్తూ ఓ పద్యం చెప్పు! చూద్దాం.." అన్నారు అవధాని గారు.

"సవాలు స్వీకరిస్తావా?" కాస్త పరుషంగానే అడిగారనిపించింది. వినయ్ కి కూడా ఒక సవాలే! మనసులో ఆశువు ఒకటి మెరిసింది వెంటనే. పెదవుల మీదికి వచ్చేసింది. చక్కటి పద్యం చెప్పాలని తహతహ! అయితే అవధాని గారి మాట అడ్డు పడ్డది. అడిగినది మంజులను. ఆమె చెప్పడమే సబబు! వెనక్కు తగ్గాడు వినయ్ వినయంగా. ఈసారి గురువుగారి పాదాలకి నమస్కరించి చెప్పింది మంజుల – మంజులమైన పద్యం.

**కం. ఇప్పటి యూట్యూబ్ ముందర**
**అప్పటి చతురంగ మొక్క వ్యసనమ్మగునా**
**ఎప్పుడు బాలురు వృద్ధులు**
**తప్పనిసరిగా యువత – దానికి దాసుల్!"**

"చరవాణికి దాసులు అందరూ! అని నీవు వినిపించిన బాణి బాగుందోయ్! ఏదీ.. ఈ సందర్భంగా మాకు ఓ మంచి కాఫీ పట్రా" అంటూ మంజులకు పని పెట్టారు అవధానిగారు. అంతటి మంచి సాహితీ స్పర్శ గల వాతావరణంలో ఉండడం వల్లే ఆశువును మంజుల సునాయాసంగా చెప్పగలుగుతున్నది అని అభినందించాడు వినయ్. మళ్లీ మాటల్లో పడ్డారు గురుశిష్యులు ఇద్దరూ. వరుసగా రోజూ అవధాని గారి ఇంటికి వస్తూనే ఉన్నాడు, అశువులు చెబుతూనే ఉన్నాడు. శభాష్ అనిపించుకుంటూ చదివిన తెలుగు ఎంఏ పట్టాకి గౌరవం తీసుకొచ్చాడు.

***

సరే ! ఇంతకీ వినయ్ తొలిరేయి యానివర్సరీ నాడు శిరీషకు ఏం పద్యం చెప్పాడో తెలుసుకోవాలని మీకూ మహా తొందరగానూ కుతూహలం గానూ ఉందని నాకు తెలుసు! దీపమార్పే ముందు ఫస్ట్ నైట్ స్మృతుల గురించి ముచ్చటించు కుంటూ– 'శిరీషా! ఆరోజు ఆశువుగా పద్యం చెప్పమన్నావు కదూ! ఇదిగో చెబుతున్నా కంద పద్యం. "బిగి కౌగిలి ..అంటూ అందుకున్నాడు వినయ్. "నోరు ముయ్యండి! పద్యం లేదు, గిద్యం లేదు..." అంటూ తన పెదవులతో అడ్డుకున్నది మహా సుకుమారి సవినయంగా!




వచ్చేవారం కథ..

**ఎడబాటు**

– వెంకట శివకుమార్ కాకు



# కళానికి 'కళారత్న'



తెలంగాణ రాష్ట్ర 'సమాచార భారతి' ఉపాధ్యక్షుడు, జాగృతి రచయితల్లో ఒకరు, అర్ధ శతాబ్దకాలానికి పైగా పాత్రికేయ వృత్తిలో తనదంటూ ముద్ర వేసిన జి. వల్లీశ్వర్‌ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' పురస్కారంతో సత్కరించింది. విశ్వావసు నామ సంవత్సర ఉగాది రోజున విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కన్నులపండుగగా జరిగిన ఉత్సవంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఈ అవార్డుని వల్లీశ్వర్‌కి అందించారు. ఏలూరులో తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు గుండు వేంకటకృష్ణమూర్తి, శ్రీమతి లక్ష్మీనర్సమ్మల మూడవ కుమారుడు వల్లీశ్వర్.

హైస్కూల్ రోజుల నుంచి జర్నలిజం మీద మక్కువతో, కాలేజీ చదువు పూర్తి కాగానే 'ఆంధ్రపత్రిక' విలేకరిగా పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన పదేళ్ల పాటు (2005–15) రాష్ట్ర ప్రభుత్వ మాసపత్రిక 'ఆంధ్రప్రదేశ్'కు ప్రధాన సంపాదకులుగా పనిచేశారు. ప్రభుత్వ గణాంక వివరాల ప్రచురణకు పరిమితమైన ఆ మాసపత్రికలో పఠనీయతను పెంచేలా పలు సాహితీ శీర్షికలను ప్రవేశపెట్టారు. 75 ఏళ్ల వల్లీశ్వర్ ఇప్పటికీ సమకాలీన అంశాలమీద, జీవిత విలువలమీద వివిధ పత్రికల్లోనూ, సోషల్ మీడియాలోనూ చురుగ్గా రాస్తూనే ఉన్నారు. వల్లీశ్వర్ విశాఖపట్నంలో పాత్రికేయ వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు 'వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం' ఏర్పాటు చేసి, దానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2012లో 'ఏలూరు ప్రెస్ ఫోరం' నుంచి ఎం. చంద్రశేఖరం స్మారక 'గోల్డెన్ పెన్' అవార్డు, 2016లో హైదరాబాద్‌లో 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' నుంచి పులికంటి కృష్ణారెడ్డి స్మారక పురస్కారం, 2021లో స్వధర్మ సభ (హైదరాబాద్) నుంచి పి.వి.ఆర్.కె. ప్రసాద్ స్మారక పురస్కారం, 2023లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 'ప్రతిభామూర్తి' పురస్కారం పొందారు.

ఆయన రాజీవ్‌గాంధీ హత్య–దర్యాప్తుపై 'నిప్పులాంటి నిజం', పీవీ నర్సింహారావు జీవితకథ 'నరసింహుడు', రిజర్వ్ బ్యాంక్ పనితీరుపై 'ఆర్.బి.ఐ రాతి గోడల వెనకాల', అద్వానీ–వాజపేయిల అనుబంధం 'జుగల్బంది' తదితర డజనుకి పైగా అనువాదాలు చేశారు. ప్రస్తుతం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా పాలకవర్గ సభ్యుడిగా ఉన్నారు. ★


**జాగృతి ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి**

**స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక**

'నవలల పోటీ- 2025'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



1936–2022

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125–150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 18 ఏప్రిల్, 2025**

ఇరవై ఓవర్లు..అరవై థ్రిల్సుగా సాగే ధూమ్ ధామ్ టీ-20 ఐపీఎల్‌లో వయసుకు ఏ మాత్రం పరిమితి లేకుండా పోతోంది. ప్రతిభాపాటవాలు ఉంటే లీగ్‌లో పాల్గొనడంతో పాటు రూ. కోట్ల సంపాదనకు అవరోధం ఏదీ లేదని గత 18 సీజన్లుగా సాగుతున్న ఐపీఎల్ చెప్పకనే చెబుతోంది.





# ఐపీఎల్‌లో బాబాయిలు...అబ్బాయిలు!

ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ టీ-20 హంగామా కొత్తపుంతలు తొక్కుతోంది. 2008లో ప్రారంభమైన ఈ లీగ్ గత 18 సీజన్లుగా తన రికార్డులను తానే అధిగమిస్తూ వస్తోంది. పాతకాపులు మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మ, విరాట్ కొహ్లీ ఓ వైపు తమ ఐపీఎల్ ప్రస్థానాన్ని గత 18 సీజన్లుగా అప్రతిహతంగా కొనసాగిస్తుంటే..మరోవైపు 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ లాంటి పసికూన ఆటగాళ్లు తమ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నారు.

### 639 కోట్లతో 18వ సీజన్ మెగావేలం...

కేవలం రెండుమాసాల కాలంలోనే రూ. కోట్లు వర్షం కురిపించే ఐపీఎల్‌లో పాల్గొనాలని వివిధ దేశాలకు చెందిన వందలాది మంది నిన్నటి, నేటి తరం ప్రతిభావంతులైన క్రికెటర్లు కలలూ కంటూ ఉంటారు. అయితే..వేలం ద్వారా వివిధ ఫ్రాంచైజీల జట్లలో చోటు దక్కించుకొనే అదృష్టవంతులు అతికొద్దిమంది మాత్రమే ఉంటారు. 2025 ఐపీఎల్ కోసం నిర్వహించిన మెగా వేలంలో 185 మంది స్వదేశీ, విదేశీ క్రికెటర్లు పాల్గొన్నారు. మొత్తం రూ. 639 కోట్ల 15 లక్షలను పది ఫ్రాంచైజీలు వెచ్చించడం ద్వారా తమ జట్ల అవసరాలకు అనుగుణమైన ఆటగాళ్లను సొంతం చేసుకోగలిగాయి. వయసుతో ఏమాత్రం పని లేకుండా కేవలం అనుభవం, ప్రతిభ, ఫిట్‌నెస్‌ల ప్రాతిపదికనే తమతమ గెలుపు గుర్రాలను వివిధ జట్లు ఎంపిక చేసుకొన్నాయి.

### 43 ఏళ్ల ధోనీ నుంచి 13 ఏళ్ల వైభవ్ వరకూ....

2008 ప్రారంభ ఐపీఎల్ నుంచి ప్రస్తుత 18వ సీజన్ వరకూ వివిధ జట్ల కూర్పు చూస్తే అపారఅనుభవం కలిగిన 42 సంవత్సరాల మహేంద్రసింగ్ ధోనీ నుంచి బాలక్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మనకు కనిపిస్తారు.

బీహార్‌కు చెందిన 13 సంవత్సరాల వైభవ్‌ని వేలం ద్వారా జైపూర్ ఫ్రాంచైజీ.. రూ.కోటీ 10 లక్షల ధరకు తనజట్టులో చేర్చుకొంది. ఐపీఎల్ కాంట్రాక్టు పొందిన అత్యంత పిన్నవయస్కుడైన క్రికెటర్‌గా వైభవ్ రికార్డుల్లో చేరాడు.

వివిధ జట్లలో చోటు సంపాదించిన ఇతర కుర్రక్రికెటర్లలో 18 ఏళ్ల యాండ్రీ సిద్ధార్థ (చెన్నై సూపర్ కింగ్స్), 19 ఏళ్ల స్వస్తిక్ చికారా (బెంగళూరు), 20 ఏళ్ల ముషీర్ ఖాన్ (పంజాబ్ కింగ్స్), కుమార్ కుషాగ్రా (గుజరాత్ టైటాన్స్), అర్షిన్ కులకర్ణీ, అంగ్ క్రిష్ రఘువంశీ (కోల్‌కతా), 21 సంవత్సరాల నితీశ్ కుమార్ రెడ్డి (సన్ రైజర్స్ ), మాన్వంత్ కుమార్ (ఢిల్లీ క్యాపిటల్స్), 22 ఏళ్ల రాజ్ బావా (ముంబై) ఉన్నారు.

ఇక..ప్రస్తుత సీజన్ లీగ్ లో పాల్గొంటున్న మహాముదురు ఆటగాళ్లలో 43 సంవత్సరాల మహేంద్రసింగ్ ధోనీ, 40 ఏళ్ల ఫాఫ్ డూప్లెసీ (ఢిల్లీ క్యాపిటల్స్), 37 సంవత్సరాల రోహిత్ శర్మ (ముంబై), మోయిన్ అలీ (కోల్‌కతా), 36 ఏళ్ల విరాట్ కోహ్లీ (బెంగళూరు), సచిన్ బేబీ (హైదరాబాద్), గ్లెన్ మాక్స్ వెల్ (పంజాబ్), ఇశాంత్ శర్మ (గుజరాత్ టైటాన్స్) ఉన్నారు.

### రాజస్థాన్ రాయల్స్ అరుదైన ఘనత.....

ప్రతిభావంతులైన బాల, యువక్రికెటర్లను గుర్తించి, ప్రోత్సహించడంలో జైపూర్ ఫ్రాంచైజీ తరువాతే ఏదైనా. ప్రస్తుత సీజన్ రాజస్థాన్ రాయల్స్ జట్టులో అత్యంత ఎక్కువ వయసున్న ఆటగాడు సందీప్‌శర్మ (31 సంవత్సరాలు), అత్యంత తక్కువ వయసున్న ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (13 ఏళ్లు) ఉన్నారు. 2008 ప్రారంభ ఐపీఎల్‌లో 19 సంవత్సరాల వయసులో రవీంద్ర జడేజాను రాజస్థాన్ రాయల్స్ తమజట్టులో చేర్చుకొని గొప్ప ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దింది.

2013 సీజన్లో 18 ఏళ్ల వయసులో వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌కు కాంట్రాక్టు ఇవ్వటం ద్వారా తమ జట్టు కెప్టెన్‌గా ఎదగడంలో జైపూర్ ఫ్రాంచైజీ ప్రధానపాత్ర పోషించింది.

### విదేశీ క్రికెటర్లు సైతం.......

2014 నుంచి ఐపీఎల్ అరంగేట్రం చేసిన సీనియర్ క్రికెటర్లలో ఇంగ్లండ్ కు చెందిన గ్లీసన్ (36 ఏళ్ల 151 రోజుల వయసు), జింబాబ్వే ఆల్ రౌండర్ సికిందర్ రజా (36 ఏళ్ల 342 రోజులు), దక్షిణాఫ్రికా లెగ్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ (35 ఏళ్ల 44 రోజులు, కేరళ ఆల్ రౌండర్ జలజ్ సక్సేనా (34 ఏళ్ల 124 రోజులు), దక్షిణాఫ్రికా స్పిన్ ఆల్ రౌండర్ కేశవ్ మహారాజ్ (34 ఏళ్ల63 రోజులు) ఉన్నారు. అయితే..కేవలం 17 సంవత్సరాల వయసులోనే ఐపీఎల్‌లో తొలిమ్యాచ్ ఆడిన మొనగాడిగా దక్షిణాఫ్రికా యువఫాస్ట్ బౌలర్ క్వెనా మపాకా నిలిచాడు.

2024 సీజన్ లీగ్ ద్వారా 17 సంవత్సరాల కుర్రఫాస్ట్ బౌలర్ క్వెనా మపాకా ముంబై ఇండియన్స్ తరపున తన అరంగేట్రం మ్యాచ్ ఆడటం ద్వారా రికార్డుల్లో చోటు సంపాదించాడు. జోహెన్స్ బర్గ్‌కు చెందిన మపాకా కేవలం 17 సంవత్సరాల వయసులోనే గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే మెరుపు ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకొన్నాడు. డెత్ ఓవర్లలో భీకరమైన యార్కర్లు సంధించే నేర్పు సైతం మపాకాకు ఉంది.


ఈ ఎడమచేతి వాటం యువఫాస్ట్ బౌలర్‌కు అండర్ -19 ప్రపంచకప్‌లో ఆడిన 6 మ్యాచ్‌ల్లోనే 21 వికెట్లు పడగొట్టిన రికార్డు ఉంది. ప్రస్తుతం హైస్కూలు విద్యార్థిగా ఉన్న మపాకాకు టెన్నిస్, హాకీ క్రీడల్లో సైతం ప్రవేశం ఉంది. ఏ మాత్రం అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం లేని మపాకా లాంటి పిల్ల క్రికెటర్లు సైతం రూ.కోట్లు సంపాదించ గలుగుతున్నారంటే అది కేవలం ఐపీఎల్ మహిమ. పిల్లలు, పెద్దలు కలసి ఆడే ఆటలా ఐపీఎల్ రూపుదిద్దుకోడం భారత క్రికెట్‌కే గర్వకారణ మనడంలో ఏమాత్రం సందేహంలేదు. ★



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# జాగృతి పత్రిక పంపిణీ పోస్టల్ డిపార్ట్‌మెంటుకు ఆనందదాయకం..

**– జిల్లా పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి**



మధ్యలో కూర్చున్న వ్యక్తి జనార్దన్‌రెడ్డి

**ఇందూరు జిల్లా :** జాగృతి పత్రిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వతేది ఇందూరులోని మాధవసేవసమితి భవనంలో 42 మంది పోస్టుమెన్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సన్మానగ్రహీతలకు హాట్ పాక్, కిచెన్ సెట్ అందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ జాగృతి అనేది ప్రజలను జాగృతంచేసే పత్రిక. ఇటువంటి పత్రిక 77 ఏళ్లుగా వస్తూ ఉంటే దాన్ని పంచడం గర్వంగా భావిస్తున్నామని అన్నారు.

**పోస్ట్‌మెన్‌ల స్పందన**

**మహ్మద్ ఇక్బాల్ :** నా పరిధిలో 45 మంది జాగృతి చందాదారులకు వారంవారం పత్రికను అందిస్తుంటాను. పెద్దలు విదేశాలనుంచి తమ పిల్లలు పంపించే సమాచారం కోసమని ఎలా ఎదురు చూస్తారో ఆ విధంగానే పత్రిక కోసం పాఠకులు ఎదురుచూస్తుంటారు. ఇది చాలా సంతోషకరమైన విషయం. జాగృతిపత్రిక వారు గత ఏడు సంవత్సరాలుగా సన్మానిస్తున్నారు. ఈ విధంగా మమ్మల్ని గౌరవిస్తున్న జాగృతి పత్రిక నిర్వా హకులకు రుణపడి ఉంటాం. ఈ సన్మానం మమ్మల్ని మరింత బాగా పనిచేసేలా మాలో ఉత్సాహాన్ని నింపు తుంది.

**అబ్దుల్ సమద్ :** ఈ సన్మానం మాకు మరింత ప్రేరణనిస్తుంది. పాఠకులు కూడా మా పట్ల అత్యంత ఆత్మీయతతో ఉంటారు. మేమూ అంతే ఆనందంగా పత్రికను వాళ్ల దగ్గరికి చేరుస్తున్నాం.

**శ్రీకాంత్ :** నేను గతంలో కామారెడ్డిలో నా బీట్లో సుమారు వంద పత్రికలు పంచేవాణ్ణి. ఇన్ని పత్రికలు రావడం నాకు సంతోషంగా అనిపించి ఆదివారం రోజు కూడా ఉత్సాహంగా పంచే వాణ్ణి. ఇక్కడ కూడా అదేవిధంగా నా బాధ్యత నిర్వహిస్తాను.

**పద్మ :** ఇలా సన్మానించడం మాకు ఉత్సాహాన్ని కలిగిస్తుంది. పత్రికను పంచడం మేము గర్వంగా భావిస్తున్నాం. ఒక వారం పత్రిక రావడం ఆలస్యమైతే చాలు దాని వెనుక కారణం ఏమై ఉంటుందని మాలో మేమే చర్చించుకుంటాం. మేం పత్రికను సకాలంలో అందించడంలో మాకు పాఠకుల తోడ్పాటు కూడా ఉంది.

**జోషి :** మేము మా వృత్తి ధర్మంలో భాగంగా ఎన్నో ఉత్తరాలు, రిజిస్టర్ పోస్టులు ఎన్నెన్నో పత్రికలు పంచుతున్నప్పటికీ కేవలం జాగృతి వారు మాత్రమే మమ్మల్ని గుర్తుంచుకొని మాకు సన్మానం చేయడం నిజంగా మాకు ఒక పండుగలాగా అనిపిస్తుంది. ఇది మా బాధ్యతను మరింత పెంచుతుంది. అదేవిధంగా జాగృతి చందా దారులను పెంచడంలో మేము కూడా మా వంతు పాత్ర పోషిస్తాం.

ఈ కార్యక్రమంలో జాగృతి పత్రిక అసోసియేట్ ఎడిటర్ కుర్రా దుర్గారెడ్డి, జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం, మాధవసేవా సమితిట్రస్ట్‌చైర్మన్ మర్రి క్రిష్ణారెడ్డి, విభాగ్ సంపర్కప్రముఖ్ నాగ శ్రీనివాస్, విభాగ్ ప్రచార ప్రముఖ్ రాంనరేశ్, జిల్లా కార్యవాహ దస్తగిరి, జిల్లా ప్రచారప్రముఖ్ రుద్రమధు, జిల్లా జాగృతిప్రముఖ్ ఇప్పకాయల సుదర్శన్, నగర జాగృతి ప్రముఖ్ రాజశేఖర్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

## ప్రవచనాల రూపంలో రామకథ





రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో తెలంగాణలో ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు 26 జిల్లాలలో 108 స్థానాల్లో రామకథ ప్రవచనం జరిగింది. సేవికాసమితి సేవికలు ప్రవచనకర్తలుగా వ్యవహ రించారు. లక్ష్మీబాయి కేళ్కర్ మరాఠీలో చెప్పిన ప్రవచ నాలను సంకలనంచేసి పథదర్శిని రామకథ పేరుతో వివిధ భాషలలోకి అనువదించారు. 9 అధ్యాయాలుగా ఉన్న రామకథను సమితి కార్యకర్తలు ప్రతి సంవత్సరం ప్రవచనాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

# నెల్లూరు బాలసంస్కార కేంద్ర వార్షికోత్సవం






**నెల్లూరు:** సింహపురి వైద్య సేవాసమితి (జయభారత్ హాస్పిటల్ )నెల్లూరు వారి ఆధ్వర్యంలో 54 యానాదుల కాలనీలలో బాలసంస్కార కేంద్రాలను (సాయం బడులు) నిర్వహిస్తున్నది. ఈ కేంద్రాలలో సుమారు 1200మంది గిరిజన పిల్లలకు విద్య, సంస్కారం, దేశభక్తి నేర్పుతున్నారు. వెంకటాచలం మండలంలో 12 గిరిజన కాలనీలలో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

మండలంలోని యర్రగుంట గిరిజన కాలనీలో నిర్వహిస్తున్న బాలసంస్కార కేంద్ర వార్షికోత్సవం ఏప్రిల్ 6న జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంఘచాలక్, వైద్య సేవాసమితి ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దేశ వ్యాప్తంగా లక్ష ఏభైవేల సేవా ప్రాజెక్టులు నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా వైద్యసేవాసమితి జిల్లాలో పేద వర్గమైన యానాదుల కోసమని జయ భారత్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా 10 పడకల హాస్పిటల్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యపరంగా వెనుకబడిన గిరిజన పిల్లలను విద్యావంతులను చేయాలనే ఉద్దేశం తోనే బాలసంస్కార కేంద్రాలను నడుపుతున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాలలో బాలలకు చదువుతోపాటు సంస్కారంకూడా నేర్పుతామని చెప్పారు. అదే సమయంలో పిల్లల తల్లిదండ్రులలో విద్యపట్ల అవగాహన పెంచి, పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా చూస్తున్నట్టు తెలిపారు. బాలలను చదువుకునేలా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలు శారీరక ప్రదర్శనలు, వారు ఆలపించిన దేశభక్తి గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు పొట్లూరు శ్రీనివాసులు, విజయలక్ష్మి, సంఘ కార్యకర్త నరసయ్య, ప్రాజెక్ట్‌ఆఫీసర్ సుబ్బారావు, ఉపాధ్యాయులు చెంబేటీ శిరీష, కేంద్రాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# సేవికా సమితి పథసంచలన్






**రా**ష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం ఏప్రిల్ 5న కర్నూలులోని విద్యానగర్ మాంటెస్సోరి పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి నాందిగా కర్నూలు పురవీధులలో సేవికలు పథసంచలన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన సమితి ప్రాంత సహకార్యవాహిక ఉజ్వల మాట్లాడుతూ భారతీయ మహిళల్లో నిద్రాణమై ఉన్న దేశభక్తిని జాగృతంచేసే పనిని గత 90 ఏళ్లుగా సమితి చేస్తున్నదని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా స్వర్ణలత పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 215 మంది పూర్ణ గణవేష్‌ధారి సేవికలు, 250మంది ఇతరులు పాల్గొన్నారు.

ఈ కార్య క్రమంలో రాష్ట్ర సేవికాసమితి కర్నూలు విభాగ్ కార్యవాహిక జి.ఎన్. విశాలాక్షమ్మ, కర్నూల్ జిల్లా కార్యవాహిక జి.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

# సామాజిక సమరసత ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణం




**సంగారెడ్డి :** సామాజిక సమరసత సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం ఏర్దనూర్ గ్రామం, కంది మండలం శ్రీ హనుమాన్ మందిరంలో వైభవంగా జరిగింది.

గ్రామంలోని కులాల నుండి దాదాపు ఇరవై కుటుంబాలు భక్తి శ్రద్ధలతో వేదమంత్రాల నడుమ స్వామివారికి పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్లోళ్ల నర్సారెడ్డి, ముఖ్యవక్త గంగాధర్ శర్మ పాల్గొన్నారు.




## బాల భక్తులు

# మార్కండేయుడు



మృకండు మహర్షి కుమారుడు మార్కండేయుడు. హరిహరుల వరప్రసాది. అతిచిన్న వయసులోనే సకల శాస్త్రాలనూ ఔపోసన పట్టాడు. వ్యక్తిత్వంలోనూ తనకు సాటి లేదనిపించుకున్నాడు. అయితే అల్పాయుష్కుడు. 'దీర్ఘాయుష్కుడైన సామాన్య పుత్రుడు కావాలా? అల్పాయుష్కుడైనా ఉత్తమ పుత్రుడు కావాలా?' అని హరిహరులు ప్రశ్నించగా, మృకుండ మహర్షి రెండవ అవకాశాన్ని ఎంచుకున్నాడు. కాలం గడుస్తున్నకొద్దీ కుమారుడికి మృత్యు ఘడియలు సమీపిస్తుండడంతో మహర్షి దంపతులు కలత చెందసాగారు. విషయం తెలిసి మార్కండేయుడు, పరమేశ్వరుడి గురించి తీవ్ర తపస్సు చేయసాగాడు. మృత్యు వేళ సమీపించింది. యమగండం నుంచి కాపాడాలంటూ మహాభక్తుడు మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకున్నాడు. యమపాశం మార్కండేయునితో పాటు శివలింగానికి తగలగానే శివుడు కాలరుద్రుడై బయటకు ఉరికి, మార్కండేయుడిని కాపాడాడు. 'నీకు ఎల్లప్పుడూ పదహారేళ్ల వయసే' అని దీవించాడు. అలా లోకంలో 'మార్కండే యాయుష్య' అనే దీవెన పుట్టింది.

## కథ | సుమంతుడి తెలివి



జయపురాన్ని పరిపాలించే ధర్మనందన మహారాజు మంత్రివర్గంలో సుమంతుడు అనే మంత్రి ఉండేవాడు. అతను చాలా తెలివైనవాడు. మహారాజుకి అతనంటే అభిమానం. ఇది చూసి ఓర్వలేకపోయారు మిగతా మంత్రులు. ఎలాగైనా సుమంతుడిని మంత్రి వర్గం నుండి తప్పించాలని ఒక పథకం పన్నారు.

అందరూ కలసి మహారాణి తమ్ముడి దగ్గరికి వెళ్లి, "నీ అంత తెలివైన వాడిని మహారాజు గారు తన మంత్రివర్గంలో పెట్టుకోకపోవడం మాకు చాలా బాధగా ఉంది. సుమంతుడి కన్నా నువ్వు ఎందులో తక్కువ? అసలు నువ్వే సుమంతుడి కన్నా చాలా తెలివైన వాడివి. అతని బదులు నువ్వే మంత్రిగా ఉండాలని మా కోరిక" అని చెప్పారు.

దీంతో అతను మహారాణి దగ్గరికి వెళ్లి, సుమంతుడి స్థానంలో తనని మంత్రిని చేయాలని కోరాడు. మహారాణి ఈ విషయాన్ని మహారాజుతో చెప్పింది. దానికి మహారాజు అంగీకరించలేదు. ఏ తప్పు లేకుండా సుమంతుడిని తొలగించలేనన్నాడు.

అప్పుడు మహారాణి, "అయితే నేనొక ఉపాయం చెబుతాను వినండి. మీరు రేపు ఉద్యానవనంలో నాపై కోపంగా ఉన్నట్టు నటించండి. సుమంతుడితో నన్ను మీ దగ్గరికి పిలుచుకు రమ్మని చెప్పండి. నేను రాకపోతే అతన్ని మంత్రి పదవి నుండి తొలగిస్తానని చెప్పండి. అతడు ఎంత పిలిచినా నేను రాను. దీంతో అతనిని తొలగించి మా తమ్ముడిని అతని స్థానంలో నియమించవచ్చు" అని ఒక కుటిల పథకం పన్నింది మహారాణి.

## పద్యము

పరహితమైన కార్యమతి భారముతోడిదియైన పూను స
త్పురుషుడు లోకము ల్పొగడ, పూర్వమునం దొక రాలవర్షమున్
కురియగ చొచ్చినన్ గదిసి గొబ్బున గోజన రక్షణార్థమై
గిరి నొక కేలనెత్తెనట కృష్ణుడు ఛత్రము భాతి భాస్కరా!

**భావం :** లోకులకు హితాన్ని కలిగించే పని ఎంత కష్టమైనది అయినా మంచివాడు పూనుకుంటాడు. పూర్వం రాళ్ల వర్షం కురిసినప్పుడు గోవులను, గోపాలకులనూ రక్షించటానికి కృష్ణుడు కొండనే ఎత్తి గొడుగుగా పట్టాడు.

## శ్లోకము

ప్రియ వాక్య ప్రదానేన సర్వే తుష్యన్తి జంతవః
తస్మాత్తదేవ వక్తవ్యం వచనే కా దరిద్రతా?

**భావం :** ప్రియం, సంతోషకర మాటలు పలకడం వల్ల సమస్త జంతుజాలం, ప్రాణులు సంతోషిస్తున్నాయి. కనుక అలాంటి మాటలు ఆడడంలో దారిద్ర్యం ఎందుకు?


## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| జై జవాన్, జై కిసాన్ | అటల్ బిహారి వాజపేయి |
| ఢిల్లీ ఛలో | లాల్ బహదూర్ శాస్త్రి |
| జై విజ్ఞాన్ | సుభాష్ చంద్రబోస్ |
| వేదాలకు మరలండి | ఇందిరాగాంధీ |
| గరీబీ హటావో | దయానంద సరస్వతి |

**సమాధానాలు :** జై జవాన్, జై కిసాన్–లాల్ బహదూర్ శాస్త్రి; ఢిల్లీ ఛలో–సుభాష్ చంద్రబోస్; జై విజ్ఞాన్–అటల్ బిహారి వాజపేయి; వేదాలకు మరలండి–దయానంద సరస్వతి; గరీబీ హటావో–ఇందిరాగాంధీ.

## శాస్త్రవేత్తలు



### జగదీష్ చంద్రబోస్ (1858-1937)

భారతదేశానికి చెందిన ప్రముఖ భౌతిక, జీవ శాస్త్రవేత్త. రేడియో మైక్రోవేవ్ ఆప్టిక్స్‌పై పరిశోధనలు చేశారు. వృక్షాల పెరుగుదలను కొలిచే క్రెస్కోగ్రాఫ్ అనే పరికరాన్ని రూపొందించారు. మొక్కలు బాహ్య ఉద్దీపనలకు చలిస్తాయని మొదటిసారిగా నిరూపించారు. సూర్యుడి కాంతి నుంచి విద్యుదయస్కాంత తరంగాలు వెలువడతాయని ప్రతిపాదించారు. దీన్ని శాస్త్రవేత్తలు 1944లో రుజువు చేశారు. 'మార్కోని' కంటే ముందే ఈయన వైర్‌లెస్ ట్రాన్స్‌మిషన్‌ను కనుగొన్నారని భౌతిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

## జనరల్ నాలెడ్జ్

1. ఔరంగ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏ రాష్ట్రంలో ఉంది?
2. భారతదేశంలో అతిపెద్ద నౌక నిర్మాణ కేంద్రం ఏది?
3. కపిలధార జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?

సమాధానాలు : 1. అస్సాం; 2. హిందుస్తాన్ షిప్‌యార్డ్(విశాఖ); 3. మధ్యప్రదేశ్ (నర్మదా నది).



మహారాజుకు ఇది నచ్చకపోయినా మహారాణి మాటను కాదనలేకపోయాడు. మరుసటి సాయంత్రం మహారాణి చెప్పినట్లే చేస్తూ, "వెళ్లి మహారాణిని తీసుకురాలేకపోతే నిన్ను మంత్రి పదవి నుండి తొలగిస్తాను" అని సుమంతుడితో కోపంగా చెప్పాడు రాజు. ఒక నమ్మకస్తుడి ద్వారా సుమంతుడికి మహారాణి పథకం తెలిసింది. సుమంతుడు మహారాణి దగ్గరికి వెళ్లి, రాజు గారు పిలుచుకురమ్మన్నారని చెప్పకుండా, కుశల ప్రశ్నలు అడగసాగాడు. కాసేపటికి ఆ నమ్మకస్తుడు వచ్చి సుమంతుడి చెవిలో ఏదో చెబుతున్నట్లు నటించాడు.

సుమంతుడు ఆశ్చర్యం నటిస్తూ, "అయ్యో! అలాగా! మహారాణి గారు దుర్మార్గపు పనులు చేయమన్నారని మహారాజు గారికి కోసం వచ్చిందా?! దీంతో అతను వేరే పెళ్లి చేసుకొని కొత్త రాణిని తెస్తానన్నారా?" అని అన్నాడు. తన పథకం బెడిసికొట్టి తనకే ఆపద వచ్చిందని మహారాణి భయపడి రాజుగారి దగ్గరికి పరుగు పెట్టింది. దీంతో సుమంతుడి తెలివి మరోసారి నిరూపితమైనట్లైంది. ★

## మెదడుకు మేత

**కొమ్ములుంటాయి కానీ ఎద్దు కాదు. అంబారీ ఉంటుంది కానీ ఏనుగు కాదు.. ఏమిటది?**

జవాబు : నత్త

## మంచిమాట

నిన్నటి కంటే నేడు నీ వివేకం పెరగకపోతే నీ జీవితంలో ఓ రోజు వ్యర్థమయిపోయిందని అర్థం.



# వారఫలాలు

14-20 ఏప్రిల్ 2025

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

బంధువులు, స్నేహితులతో తగాదాలు క్రమేపీ పరిష్కారమవుతాయి. ఆస్తుల ఒప్పందాలలో జాప్యం. కాంట్రాక్టులు దక్కే సూచనలు. గృహనిర్మాణ యత్నాలలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగులకు విధుల్లో బాధ్యతలు పెరుగుతాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు కష్టానికి ఫలితం కనిపిస్తుంది. క్రీడాకారులు, పరిశోధకులకు కాస్త ఊరట లభిసుంది. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు.. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆత్మీయులతో వివాదాలు పరిష్కరించుకుం టారు. ప్రత్యర్థులు అనుకూలురుగా మారతారు. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. ఆదాయం సంతృప్తికరం. సమాజసేవలో భాగస్వాములవుతారు. ఇళ్ల నిర్మాణ యత్నాలు కలసివస్తాయి. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 19,20 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలు కొంత నిదానించినా ఎట్టకేలకు పూర్తి కాగలవు. బంధువులతో వివాదాలు సర్దుకుంటాయి. వాహనాలు, భూములు కొనుగోలు. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు మార్పులు జరిగే వీలుంది. రాజకీయవేత్తలు, కళా కారులు, రచయితలకు ఒక సంతోషకరమైన సమా చారం అందుతుంది. 14,15తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. స్నేహితులతో విభేదాలు. శివపంచాక్షరి పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజసేవలో పాల్గొంటారు. వాహన యోగం. వ్యాపారులకు గతం కంటే లాభాలు మెరుగుపడతాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంత రాలు తొలగి ఊరట లభిస్తుంది. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, క్రీడాకారుల యత్నాలు సఫలమవుతాయి. 15,16 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబసమస్యలు చికాకు పరుస్తాయి. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. అప్పులు తీరి ఊరట, కొన్ని సమస్యల నుంచి బయట. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు మరింతగా లాభాలు అందుతాయి. ఉద్యోగులకు అనుకూల మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలకు శుభవర్తమానాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 18,19తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

దృఢదీక్ష, చాకచక్యంతో ముందుకు సాగి కొన్ని సమస్యలనుంచి గట్టెక్కుతారు. నిరుద్యోగుల ప్రయత్నాలలో ప్రతిబంధకాలు ఎదురుకావచ్చు. వ్యాపారస్తులకు ఒత్తిడులు తప్పకపోవచ్చు. ఉద్యోగులు విధుల్లో సమర్థతను నిరూపించుకోవలసిన సమయం. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలు నిర్ణయాలలో తొందరపడరాదు. 16,17తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆలోచనలు అంతగా కలసిరాక మదనపడతారు. స్థిరాస్తి వివాదాలు గందరగోళంగా మారవచ్చు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో మనశ్శాంతి చేకూరుతుంది. కాంట్రాక్టులు ఎట్టకేలకు లభిస్తాయి. 18,19 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేసి సత్తా చాటుకుంటారు. ఉద్యోగార్థుల యత్నాలు కొలిక్కి వస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో చికాకులు కొంతమేర తొలగుతాయి. ఒక ఆహ్వానం మరింత సంతోషం కలిగిస్తుంది. ఉద్యోగులకు కొత్త అవకాశాలు లభిస్తాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 14,15 తేదీల్లో శ్రమాధిక్యం. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ముఖ్యమైన కొన్ని కార్యక్రమాలు సజావుగా పూర్తి



సింహంభట్ల సుబ్బారావు
6300674054

చేస్తారు. ఆదాయం మరింత మెరుగుపడుతుంది. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి, అనుకున్నంత లాభాలు. ఉద్యోగులకు ఒత్తిడులు, సమస్యలు తొలగుతాయి. రాజకీయ వర్గాలకు శుభవార్తలు. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. 19,20తేదీల్లో దూరప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

స్థిరాస్తి వివాదాల నుంచి గట్టెక్కుతారు. వాహన, గృహం కొనుగోలు ప్రయత్నాలు సఫలమవుతాయి. వ్యాపారులకు తగినంత పెట్టుబడులు సమకూరి లాభాలు అందుతాయి. ఉద్యో గులకు బాధ్యతల భారం నుంచి కొంత విముక్తి. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు కలసివస్తుంది. రచయితలు, క్రీడాకారులు లక్ష్యసాధనలో ముందడుగు వేస్తారు. 17,18తేదీల్లో స్నేహితులతో తగాదాలు. స్వల్ప శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు శివాష్టకం పఠించండి.


**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొత్త విషయాలు గ్రహిస్తారు. ఆప్తుల సలహాలతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పొందుతారు. ఒక సమాచారం మీలో మార్పునకు దారితీస్తుంది. వ్యాపారస్తులకు ఉత్సాహవంతమైన కాలం. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళా కారులకు కొన్ని ఇబ్బందులు తొలగుతాయి. 15,16 తేదీల్లో బంధువులతో తగాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. కొత్త విషయాలు తెలుసుకుంటారు. విచిత్రమైన సంఘటనలు. జీవిత భాగస్వామి తరపున ఆస్తిలాభం. కాంట్రాక్టర్లు, రియల్టర్లకు కలసివచ్చే కాలం. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులు పేరు సంపాదిస్తారు. పారిశ్రామిక వర్గాలకు నూతనోత్సాహం. రచయితలు అనుకున్నది సాధిస్తారు. 17,18 తేదీలలో అనుకోని ప్రయాణాలు. ధనవ్యయం. కాలభైరవాష్టకం పఠించండి.

# పదరసం - 509



## ఆధారాలు

**అడ్డం**

1) మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ........(7)
5) కష్టాలు (3)
6) మార్గంలో వెళ్లేవాడు అటూ యిటూ అయ్యాడు (4)
8) రక్షణ సరిగాలేదు (3)
9) శృంగార గీతం (3)
10) ఛిద్రమైన జీవితం (3)
12) ఇవి తొక్కుతున్నారంటే కోపంగానో/ కంగారుగానో ప్రవర్తించడం (3)
13) అసహ్యం వేస్తే... అంటాము (1)
14) దేశవాళీ (2)
15) చెంప పగిలింది (3)
16) శాశ్వతంగా, ఎప్పటికీ గుర్తుండేలా (5)
19) బలిష్టంగా ఉండి తగినంత ఎత్తు ఉంటే ఇలా అంటారు (5)
22) తొందర తొందరగా హడావిడిగా (6)
24) పదిమంది తిరగబడ్డారు (4)

**నిలువు**

1) లెక్కకు రాని, నీచం (4)
2) నడిపేవాడు పైకొచ్చాడు (3)
3) వరంగల్లులో కొలువైన అమ్మవారు (4)
4) బతికుంటే ఇది తినొచ్చని సామెత (4)
5) సంబంధించిన (3)
7) మేళతాళాలు (3)
11) ఏ మాత్రం వినిపించకపోతే ఇలా అంటారు(5)
12) చెల్లాచెదురు, అస్తవ్యస్తం (6)
14) పనిలోకి రాకపోవడం, డుమ్మా (2)
17) పైకొచ్చిన పినతండ్రి (3)
18) తిరుమల వేంకటేశ్వరుని ప్రసాదం (2)
19) కత్తి ఉంచే అర, తొడుగు (2)
20) ఆవులు మొదలైనవి పాలిచ్చేచోటు, పక్షులు గుడ్లను రెక్కలతో కప్పడం (3)
21) పైకి దౌడు (3)
23) గట్టు, సమీపం (2)

## పదరసం - 508 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| శ్రీ[1] | మం | తు[2] | లు | ■ | తె[3] | ■ | ■ | త[4] | ■ |
| రా | ■ | ట్ట | ■ | కు[5] | ప్ప | లు | తె | ప్ప | లు |
| మ[6] | ద్ద | తు | ■ | ■ | రి | ■ | ■ | ట | ■ |
| న | ■ | ద[7] | ద్ద | రి[8] | ల్లు | ■ | ఋ[9] | డు | గు |
| వ[10] | ణు | కు | ■ | స | ■ | చే[11] | ■ | గు | ■ |
| మి | ■ | ■ | ఆ[12] | రా | ■ | వ[13] | ల[14] | లు | డు |
| ■ | త[15] | ధ్యం | ■ | స[16] | ప్రా[17] | ■ | త్తు | ■ | ■ |
| మ[18] | ఖ | ■ | అ[19] | ■ | తి | ■ | కో[20] | లా | టం[21] |
| ■ | ము[22] | క్కై | ర | ■ | ని[23] | టా | రు | ■ | ర |
| మో[24] | వి | ■ | పై[25] | వి | ధ్యం | ■ | ■ | రం[26] | కె |

సినిమా













**చూస్తుండగానే కొత్త సంవత్సరంలో మూడు నెలలు గడిచిపోయాయి. తెలుగు కొత్త సంవత్సరం విశ్వావసులోకి కూడా మార్చి నెలాఖరులో అడుగుపెట్టేశాం. అయితే ఈ మూడు నెలల్లో తెలుగు సినిమా రంగం గురించి చూసినప్పుడు విజయాల విషయంలో మిశ్రమ స్పందన లభించిందనిపిస్తుంది. సినిమాల రాశి పరంగా తక్కువేమీ లేవు. అనువాద చిత్రాలతో కలిపి 77 సినిమాలు జనం ముందుకు వచ్చాయి. కానీ అందులో ఐదారు మాత్రమే ఆశించిన స్థాయిలో విజయాలను నమోదు చేసుకున్నాయి.**

# తెలుగు సినిమా త్రైమాసిక ఫలితాలు!

జనవరి మాసం విషయానికి వస్తే... అందరూ ఆసక్తిగా ఎదురుచూసేది సంక్రాంతి సీజన్. దానికి ముందు వారం ఆరు సినిమాలు విడుదలయ్యాయి కానీ ఏవీ చెప్పుకోదగ్గవి కాదు. దాంతో అందరి దృష్టి సంక్రాంతి సినిమాల మీదనే ఉంది. అయితే ఆ సమయంలో వచ్చిన రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' మూవీ పరాజయం కాగా, బాలకృష్ణ 'డాకు మహరాజ్' మంచి ఓపెనింగ్స్ సంపాదించుకుంది. మూవీకి హిట్ టాక్ వచ్చినా... కొన్ని ప్రాంతాలలో మాత్రం ఆశించిన స్థాయిలో ఆడలేదని స్వయంగా ఆ సినిమా నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. అయితే... సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' జయకేతనం ఎగరేసింది. సీనియర్ స్టార్ హీరోలలో తెలుగులో ఎవ్వరూ ఇంతవరకూ వరకూ రూ. 300 కోట్ల గ్రాస్ వసూలు చేసిన దాఖలాలు లేవు. ఆ రికార్డ్‌ను 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వెంకటేశ్ సాధించారు. ఇందులో వెంకటేశ్ కొడుకు పాత్ర ద్వారా చెప్పిన ముదురు సంభాషణలపై విమర్శలు రాకపోలేదు. అయితే ఇవాళ్టి ఓటీటీలకు పిల్లలను అలవాటు చేస్తే... ఇదీ పరిస్థితి అన్నట్టుగా దర్శకుడు అనిల్ రావిపూడి చూపించే ప్రయత్నం చేశారు. సినిమాలో కొత్తదనం లేకపోయినా... వినోదానికి పెద్దపీట వేయడంతో దిల్‌రాజు నిర్మించిన ఈ సినిమా కమర్షియల్‌గా గ్రాండ్ విక్టరీని అందుకుని, విక్టరీ వెంకటేశ్‌ను మరోసారి సక్సెస్ ట్రాక్‌లోకి తీసుకొచ్చింది. ఇదే నెలలో వచ్చిన మరే చిత్రమూ ఆశించిన స్థాయిలో ఆడలేదు. మొత్తంగా జనవరిలో ఇరవై మూడు సినిమాలు విడుదలైతే అందులో పదిహేను స్ట్రయిట్‌వి కాగా ఎనిమిది అనువాద చిత్రాలు.

ఇక ఫిబ్రవరి విషయానికి వస్తే... అక్కినేని నాగచైతన్య నటించిన 'తండేల్' సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా రూ.100 కోట్ల గ్రాస్ సాధించింది. నాగచైతన్యకు చక్కని విజయాన్ని అందించింది. ఇదే అతని కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ చిత్రం. అలానే చైతు నటించిన భారీ బడ్జెట్ చిత్రం కూడా ఇదే. 'కార్తికేయ -2' ఫేమ్ చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు దీనిని నిర్మించారు. సాయిపల్లవి నాయికగా నటించిన ఈ సినిమాలో పాకిస్తాన్‌లో చిక్కుకుపోయిన శ్రీకాకుళం జాలర్లు ఎన్ని ఇబ్బందులు పడ్డారు., వారిని బయటకు తీసుకురావడానికి అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నా సుష్మాస్వరాజ్ ఎంతగా కృషి చేశారు అనే అంశాలను హృదయానికి హత్తుకునేలా చూపించారు. దాంతో జనాలు 'తండేల్'కు విజయాన్ని అందించారు. చిత్రం ఏమంటే... మీడియం బడ్జెట్ చిత్రాలు అనేకం ఈ నెలలో విడుదల అయ్యాయి. అవన్నీ కూడా తీవ్ర నిరాశకు గురిచేశాయి. సాయిరామ్ శంకర్ 'ఒక పథకం ప్రకారం', విశ్వక్ సేన్ 'లైలా', బ్రహ్మానందం 'బ్రహ్మా ఆనందం', ధన్‌రాజ్ 'రామం రాఘవం', బ్రహ్మాజీ 'బాపు', సందీప్ కిషన్ 'మజాకా' ఇవన్నీ పరాజయం పాలయ్యాయి. ఈ నెలలో కూడా 23 సినిమాలు రాగా అందులో ఆరు అనువాద చిత్రాలు.

మార్చి మాసంలో రెండు చిన్న సినిమాలు విజయం సాధించి చిన్న చిత్రాల నిర్మాతలకు కొత్త ఊపిరి పోశాయి. ఈ నెలలో 31 సినిమాలు విడుదల అయ్యాయి. అందులో ఏడు అనువాద చిత్రాలు. పోక్సో యాక్ట్ నేపథ్యంలో నాని, ప్రశాంతి తిపుర్నేని నిర్మించిన 'కోర్ట్' మూవీ మంచి విజయాన్ని అందుకుంది. చట్టాన్ని మానిప్యులేట్ చేయలేని వారికి న్యాయ స్థానాలలో ఎలాంటి ఎదురుదెబ్బ తగులుతుందనే విషయాన్ని ఇందులో చూపించారు. నటీనటులకు మంచి పేరును నిర్మాతలకు డబ్బులను తెచ్చిపెట్టిన సినిమా ఇది. అయితే... ఈ థాట్ ప్రొవోకింగ్ మూవీతో పాటే... ఇదే నెలాఖరులో వచ్చిన 'మ్యాడ్ స్క్వేర్' కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. దీనికి ముందు వచ్చిన 'మ్యాడ్' స్థాయిలో ఈ సినిమా లేదనే విమర్శలు వచ్చినా... వినోదాన్ని పంచడంలో దర్శకుడు సఫలీకృతం కావడంతో ఈ సీక్వెల్ కూడా సక్సెస్ బాట పట్టింది. ఈ నెలలో వచ్చిన ఇతర చిత్రాలు 'దిల్ రుబా', 'పెళ్లికాని ప్రసాద్, షణ్ముఖ, రాబిన్ హుడ్' నిరాశ పర్చాయి.

ఈ మూడు నెలల్లో వచ్చిన 21 డబ్బింగ్ మూవీస్‌లో ఒక్క సినిమా మాత్రమే లాభాలు తెచ్చిపెట్టింది. విశాల్ నటించిన 'మదగజ రాజా', విష్ణువర్ధన్ 'ప్రేమిస్తావా', ధనుష్ డైరెక్ట్ చేసిన 'జాబిలమ్మ నీకు అంతకోపమా', ఆది పినిశెట్టి 'శబ్దం', జీవా 'అగాత్య', జీవీ ప్రకాశ్ 'కింగ్ స్టన్', విక్రమ్ 'వీరధీరశూరన్ – 2', హిందీ డబ్బింగ్ చిత్రాలు 'కిస్ కిస్ కిస్సిక్', మలయాళ డబ్బింగ్ మూవీలు 'మార్కో', 'ఐడెంటిటీ', 'ఆఫీసర్', 'ఎంపురాన్'... తెలుగువారిని మాత్రం ఆకట్టుకోలేకపోయాయి. ఈ మొత్తం సినిమాలలో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మాత్రమే విజయాన్ని సాధించింది. దాంతో అతనితో తెలుగు నిర్మాతలు సైతం సినిమాలు తీయడానికి ఆసక్తి చూపుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రదీప్‌తో ఓ ద్విభాషా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిందీలో విజయకేతనం ఎగరేసిన 'ఛావా' సినిమా సైతం మార్చిలో తెలుగులో విడుదలైంది. అయితే... ఇప్పటికే ఈ సినిమాను హిందీలో జనాలు చూసేయడంతో తెలుగులో ఊహించిన విజయాన్ని అందుకోలేకపోయింది. మొత్తం మీద గడిచిన మూడు మాసాల్లో మిశ్రమ స్పందన లభించిందనే అనుకోవాలి.

**అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



# ఆసియా హృదయ స్పందన రామకథ

రామకథ ఇప్పటికీ రెండు దేశాల సంబంధాలకు వారథిగా నిలబడింది. మన ప్రధాని నరేంద్ర మోదీ థాయ్‌లాండ్ పర్యటనకు గుర్తుగా ఆ దేశం భారత్‌తో తన బంధాన్ని రామాయణం ఆధారంగానే వ్యక్తీకరించింది. థాయ్‌లాండ్‌లో 18వ శతాబ్దానికి చెందిన కుడ్యచిత్రాలకు ఎంతో ఖ్యాతి ఉంది. ఆ చిత్రాలు ఉన్న ఒక స్టాంప్‌ను ఏప్రిల్ 3న అక్కడ విడుదల చేశారు. అవన్నీ రామకథా దృశ్యాలే. అక్కడ రామాయణాన్ని రామ్‌కీన్ అని పిలుచుకుంటారు. తన పర్యటన సందర్భంగా థాయ్ ప్రభుత్వం ఒక ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేసినందుకు, అది కూడా రామాయణ చిత్రాలతో విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానని మోదీ ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించారు. ద్వైపాక్షిక చర్చల తరువాత బ్యాంకాక్‌లోని ప్రభుత్వ భవనంలో థాయ్‌లాండ్ ప్రధాని పయోటాంగ్‌టార్న్ షిన్వాత్రా మోదీకి పవిత్ర ప్రపంచ త్రిపీతికా గ్రంథాలను బహూకరించారు. ఇవి పాళీ భాషలో ఉన్నాయి.

రామాయణ కుడ్యచిత్రాలతో స్టాంప్‌ను విడుదల చేయడమే కాకుండా, రామకథతో ఒక నాటక ప్రదర్శన కూడా మోదీ కోసం ఏర్పాటు చేశారు. రామాయణం ఆసియాలోని అనేక దేశాల ప్రజల హృదయాలను కలుపుతున్నదని మోదీ అన్నారు.













From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 25



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.300/-




వెల : ₹.300/-





వెల : ₹.100/-





వెల : ₹.160/-




వెల : ₹.200/-





వెల : ₹.499/-





వెల : ₹.300/-





వెల : ₹.120/-




వెల : ₹.300/-





వెల : ₹.180/-





వెల : ₹.350/-





వెల: PB ₹.550/-




వెల :₹.450/-




వెల : ₹.549/-




వెల : ₹.150/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722.